సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు


www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 9 - ఆదివారం 15 జనవరి, 2017 సంపుటి : 2 సంచిక 16 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## బీచ్‌లో ఎమ్మెల్సీ వీరంగం

**రాజధాని ప్రతినిధి,గుంటూరు :** టీడీపీ ఎమ్మెల్సీ అన్నం సతీశ్ బాపట్ల బీచ్‌లో వీరంగం సృష్టించారు. బాపట్ల సూర్యలంక బీచ్‌లో హరిత రిసార్ట్స్ డిప్యూటీమేనేజర్ శ్రీనివాస్‌పై దాడి చేశారు. గదిలోకి లాక్కెళ్లి మరీ అతడిని చితకాబాదారు. శ్రీనివాస్‌తో పాటు మరో నలుగురు సిబ్బందిపైనా ఎమ్మెల్సీ దాడి చేశారు. వివరాల్లోకి వెళితే... హరిత రిస్టార్‌లో నిర్మాత కొరటాల సందీప్ పుట్టినరోజు వేడుకకు వచ్చిన అతిథులకు సరైన ఏర్పాటు చేయలేదని ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ ఘటనకు పాల్పడ్డారు. బీచ్‌లో క్యాంప్ ఫైర్ వేసి స్నేహితులతో కలిసి సతీశ్ చిందులు వేశారు. ఏర్పాట్లు బాగోలేదంటూ ఎమ్మెల్సీ అక్కడి సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. అయితే దాడి ఘటనపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన హరిత రిస్టా ఉద్యోగులకు చుక్కెదురు అయింది. తెల్లవారేవరకూ పోలీస్ స్టేషన్లోనే ఉంచిన పోలీసులు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

**ఆ ఇద్దరిపై చంద్రబాబు ఆగ్రహం**



**విజయవాడ:** సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం తన నివాసంలో తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన ఎమ్మెల్సీ అన్నం సతీష్ వ్యవహారం చర్చకు వచ్చిందని సమాచారం. ఈ సందర్భంగా రావి, అన్న సతీష్‌ల తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇద్దరూ తక్షణమే వచ్చి తనను కలవాలని సీఎం ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. ఇటీవల గుడివాడ క్లబ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తుపాకి మిస్‌ఫైర్ అయిన విషయం తెలిసిందే. బాపట్ల సూర్యలంక బీచ్ రిసార్ట్స్‌లో శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ అన్నం సతీష్, అనచరులు పర్యాటకశాఖ డిప్యూటీ మేనేజర్, సిబ్బంది దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతలను చంద్రబాబు తీవ్రంగా మందలించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## అలా చేస్తే తాట తీస్తాం: డీజీపీ



**రాజధాని ప్రతినిధి, విజయవాడ:** సంక్రాంతి సీజన్‌లో అగ్రహీరోల అభిమానులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఏపీ డీజీపీ సాంబశివరావు ఆదేశించారు. చాలా సంవత్సరాల తర్వాత రెండు పెద్ద హీరోల సినిమాలు విడుదలవుతున్న సందర్భంగా డీజీపీ సమీక్ష నిర్వహించారు. అభిమానులు హద్దు మీరితే కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను కోరారు. అభిమానులు సంయమనం పాటించాలని పండగ వాతావరణాన్ని కలుషితం చేయవద్దని డీజీపీ సూచించారు. హీరో ఎవరైనా, ఏ వర్గమైనా, మరొకరిని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే తాట తీస్తామని అభిమానులను డీజీపీ సాంబశివరావు హెచ్చరించారు.

## కోర్టు ఉత్తర్వులు

# అమలయ్యేనా..?


**రాజధాని ప్రత్యేక ప్రతినిధి, అమరావతి :** సంక్రాంతి వచ్చిందంటే కోడిపందేలు ఖాయం. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నవారుకూడా తప్పకుండా స్వగ్రామాలు చేరుకొని, ఏదో ఒక చోట కోడిపందేలకు తప్పకుండా హాజరవుతారు. తమిళనాడులో జరిగే జల్లికట్టు హింసాయుతంగా ఉండటంతో సుప్రీంకోర్టు దానిని నిషేధిస్తూ తీర్పు వెలువరించింది. అది దశాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయక ఆటని దానిని నిర్వహించాల్సిందేనని స్థానికులు ఆగ్రహించారు. ఓట్లకోసం ప్రజల బలహీనతలను పెంచి పోషించే రాజకీయనాయకులు కూడా నిషేధం కూడదన్నారు. అంతేకాని కోర్టు తీర్పులను గౌరవిస్తూ ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు జరపలేదు. ఇక ఆంధ్రప్రదేశ్‌కు వస్తే కోడి పందేలు, గత ఏడాది కోడిపందేలు జరపరాదని కోర్టు తీర్పువెలువరించింది. పోలీసు ఉన్నతాధికారులంతా ఎటువంటి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో కోడిపందేలు జరపబోనీమని, కట్టుదిట్టంగా కోర్టు తీర్పును అమలు చేస్తామన్నారు. కాని రోజులు దగ్గరకు రాగానే పరిస్థితులు మారిపోయాయి. ఆయా ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగారు. దగ్గర ఉండి మరీ పందెం బరులు సిద్ధం చేయించి, కోడిపందేలు నిర్వహించారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమంటే ప్రజా సంక్షేమం దృష్ట్యా లేదంటే సాంఘిక దురాచారాల నేపథ్యంలోనో సుప్రీంకోర్టు అనేక తీర్పులు ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయాల్సిన ప్రభుత్వం, అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించడం ద్వారా కోర్టు ఉత్తర్వులు నిర్వీర్యమవుతున్నాయి. ఎప్పటిలాగే ఈ ఏడాదికూడా పందెంరాయుళ్లను కట్టడి చేయడానికి కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ రాజకీయనాయకులు ఎప్పటిలానే తూట్లు పొడుస్తున్నారు. కోడిపందేలపై హైకోర్టు తీర్పుపై స్టేవిధించాలని పందెంరాయుళ్లంతా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కోర్టు తోసిపుచ్చింది. అయితే పందెంకోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకోరాదని, వాటికి కట్టే కత్తులు మాత్రమే స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశించింది.



కోస్తాంధ్రలో గతేడాది రూ. 800 కోట్ల కోడిపందేలు జరిగాయి. పందేల్లో రెచ్చిపోయి పోగుట్టుకున్నవారు, సంపాదించినవారు ఉండగా, నిర్వాహకులైన (ఏపార్టీ అధికారంలో ఉన్నా ) అధికార పార్టీ మంత్రులు, నాయకులు మాత్రం భారీగా దండుకున్నారు. గోదావరి జిల్లాల్లోని కోడిపందేలు ప్రస్తుతం అన్ని జిల్లాలకు పాకింది. దీనికోసం కొన్ని నెలలు ముందుగా కోడిపుంజులను సిద్ధం చేస్తారు. దీని ఖరీదు లక్ష నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుంది. వీటిలో ముఖ్యమైన రకాలు డేగ, పంచకాకి, కాకినెమళ్లు ముఖ్యమైనవి. ఉభయగోదావరి జిల్లాల్లోని అమలాపురం, పాలకొల్లు, భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడల్లో పందెంరాయుళ్లు కార్లతో వస్తారు. అంతేకాదు ఒక్కోసారి సుదీర తీరాలనుంచి హెలికాఫ్టర్‌ల్లో కూడా విచ్చేస్తారు. వీరికోసం పొలాల మధ్యలో 20 ఎకరాల స్థలాలను చదును చేయించి షామియానా, కుర్చీలు పరుస్తారు. రాజధాని ప్రాంతమైన కృష్ణానదీపరివాహక ప్రాంతాల్లో విచ్చల విడిగా ఈ కోడి పందేలను నిర్వహిస్తారు.


## పరమ పవిత్ర దినం

# ముక్కోటి ఏకాదశి



విష్ణుమూర్తి ఆరాధకులు పరమ పవిత్రమైన దినంగా భావించే రోజిది. నేడు ముక్కోటి ఏకాదశి! ముక్కోటి ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారు. హిందువుల కాలెండరు ప్రకారం ముక్కోటి ఏకాదశి మార్గశిర మాసంలో వస్తుంది. అంటే ఆంగ్ల కాలెండరు ప్రకారం డిసెంబరు-జనవరినెలలో అన్నమాట. "స్వర్గద్వారం." "ముక్కోటి ఏకాదశి", " వైకుంఠ ఏకాదశి " అని పేర్లున్న ఆ పర్వదినాన వైష్ణవాలయాల్లో ఏకాదశిని ఎంతో బ్రహ్మాండంగా జరుపుతారు. శ్రీ మహావిష్ణువు సర్వాలంకార భూషితుడై వైకుంఠం ఉత్తర ద్వారం వద్దకు విచ్చేయగా... అక్కడి ఉత్తర ద్వారం వద్ద సకలదేవతలు ఆయనను సేవించిన రోజు కనుక దీనికి " వైకుంఠ ఏకాదశి" అని పేరు ఏర్పడింది. అందువల్ల ఈ దినం వైష్ణవాలయాల్లో ఉత్తరం వైపున వున్న వైకుంఠ ద్వారాన్ని తెరుస్తారు. ఈ ద్వారం నుంచి వెళ్ళి స్వామివారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదంగా భావించబడుతుంది. ఆ రోజున శ్రీ మహావిష్ణువుతో పాటు ముప్పై మూడు కోట్ల మంది దేవతలు భూమికి దిగివస్తారని చెప్తారు. అందువల్లనే దీనికి " ముక్కోటి ఏకాదశి" అని పేరు మన రాష్ట్రంలోని తిరుమల, భద్రాచలం తదితర విష్ణుమూర్తి క్షేత్రాలలోనూ, తమిళనాడు శ్రీరంగంలో ముక్కోటి ఏకాదశిని ఘనంగా జరుపుతారు. ఈనాడు వైకుంఠ ద్వారాలను తెరుస్తారని, దక్షిణాయనంలో చనిపోయిన పుణ్యాత్ములంతా స్వర్గానికి చేరుకుంటారని ప్రతీతి. ఈ దినం ఏకాదశీవ్రతం చేసి,విష్ణువును పూజించి, ఉపవాస జాగరణలు పాటించడంవల్ల పుణ్యఫలాలు లభిస్తాయి.ఈ రోజు విష్ణుమూర్తి ఆలయాలలో ప్రత్యేక ప్రార్ధనలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విష్ణుపురాణాన్ని అనుసరించి ముక్కోటి ఏకాదశి ఒక్క రోజున ఉపవాసముంటే హిందువుల కలెండర్‌ను అనుసరించి ఆ సంవత్సరంలో మిగిలిన 22 ఏకాదశి అనే రోజు ఎలా ఏర్పడిందో పద్మపురాణం ఇలా వివరిస్తుంది. విష్ణుమూర్తి ముర అనే రాక్షసిని సంహరించి,ఆమె బారి నుండీ దేవతలను రక్షించాడు.పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న మురను చూసి, ఆమె కోసం ఏకాదశి అనే తిథిని ఏర్పరిచాడు. విష్ణుమూర్తి మురపై విజయం సాధించింది. ఈ రోజునే! ఈ రోజున ఎవరైతే ఉపవాసం. జాగారముండి విష్ణు నామ స్మరణతో కాలం గడుపుతారో వారు మరణానంతరం వైకుంఠానికి చేరుకుంటారని వరం ప్రసాదిస్తాడు విష్ణుమూర్తి! అదీ ఏకాదశీ గాథ!. భారతదేశంలో శ్రీ రంగంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు 21 రోజుల పాటు వైభవంగా జరుగుతాయి. శివుడి ఆరాధకులు శివరాత్రిని ఎంతటి పవిత్రమైన రోజుగా భావిస్తారో విష్ణుమూర్తి భక్తులు ముక్కోటి ఏకాదశిని అంత పవిత్ర దినంగా భావిస్తారు. ఈ రోజు విష్ణుమూర్తి పటానికి పండ్లు, తులసి మాలలు, తమలపాకులు, వక్క పలుకులు, ఆకుపచ్చని అరటికాయలు, కొబ్బరికాయలు సమర్పించి పూజించాలని పురాణాలు చెబుతున్నాయి.ముక్కోటి ఏకాదశి ఉదయాన్నే లేచి, తలంటు స్నానం చేసి, ఇంట్లో విష్ణుమూర్తి పటం ఎదుట దీపారాధన చేసి, పైన చెప్పిన విధంగా తులసి మాలలు, అరటి ఆకులు సమర్పించి పూజించాలి, ఏదైనా దేవాలయానికి వెళ్ళి, విష్ణుమూర్తి అవతార విశేషాలని అర్పించాలి. సాయంత్రం కూడా ఉదయం వలె పూజలు చేయాలి. ఆరోజు పూర్తిగా ఉపవాసం, ఉండి జాగరణ చేయాలి.

## ముఖ్యమంత్రే నయం : పవన్



**హైదరాబాద్:** శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ రోగుల విషయంలోనే కాకుండా ఇలాంటి సమస్యలు ఎక్కడున్నా అందుకు జనసేన పోరాడుతూనే ఉంటుందని సినీనటుడు, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. దీనిపై ఆయన శనివారం వరుస ట్వీట్లు చేశారు. కిడ్నీ బాధితుల సమస్య తీవ్రత జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు కంటే మెరుగ్గా సీఎం చంద్రబాబునాయుడుకు అర్థమైందని ట్వీట్లో పేర్కొన్నారు. ఉద్దానం బాధితుల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేవరకూ అన్ని పార్టీల మేనిఫెస్టోలో ఈ అంశం ఉండాలని పిలుపునిచ్చారు. ఉద్దానం సమస్యల విషయంలో ఎంతో తోడ్పాడు అందించిన మీడియాకు బాధితుల తరపు నుంచి కృతజ్ఞతలు చెప్పారు. ఏ చేయూత లేని వారికి ఇదే విధంగా పోరాడటంలో స్ఫూర్తి రగిలించాలన్నారు. ఉద్దానం బాధితులపై ఏపీ ప్రభుత్వం సానుకూల స్పందన రావడంపై హర్షం వ్యక్తంచేశారు. ఉద్దానం కిడ్నీ రోగుల సమస్య పరిష్కారం పట్ల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పవన్ పర్యటన అనంతరం మంత్రి కామినేని శ్రీనివాస్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుందని సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు పడతాయని పవన్ ధీమా వ్యక్తంచేశారు. శ్రీకాకుళం జిల్లాలో పర్యటనలో ఉద్దానం సహా 11 మండల్లాల్లో మూత్రపిండాల వ్యాధి సమస్యను ఘోర విపత్తుగా పవన్ పేర్కొన్న విషయం తెలిసిందే.

## 9న రాయపూడిలో జన్మభూమి కార్యక్రమం

**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** రాయపూడి గ్రామ పంచాయతీ, సీఆర్‌డీఏ ఆఫీసు వద్దగల కోడెల భవనంలో ఈనెల 9 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సోమవారం 4వ విడత జన్మభూమి కార్యక్రమం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి గాదే వెంకటప్పయ్య తెలిపారు. సంక్రాంతి సంబరాల సందర్భముగా అదేరోజు కోడెల భవనం వద్ద స్టేడియంలో మహిళలకు ముగ్గులు, వంటపోటీలు జరపనున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## ఈవారం రాజధాని

- 7,8 తేదీల్లో ముఖ్యమంత్రి శ్రీలంక పర్యటన
- రాష్ట్రంలో పూర్తికాకుండా ఉన్న ప్రాజెక్టులన్నిటికీ మోక్షం : ముఖ్యమంత్రి చంద్రబాబు
- మౌలిక వసతులు అభివృద్ధికి సహకరించండి :కేంద్రానికి మంత్రి నారాయణ వినతి
- విజయవాడలో ఈ నెల 12న విమానయాన సదస్సు ఏర్పాటు : కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు
- ఫిబ్రవరిలో శాసనసభ సమావేశాలు : కోడెల శివప్రసాదరావు
- అవనిగడ్డ నుంచి తెనాలి విజయవాడకు బస్సులు ప్రారంభం: బుద్ధ ప్రసాద్
- ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం: కమిషనర్ వి.వి పాండురంగారాజు
- గన్నవరం నుంచి హజ్‌యాత్ర ప్రారంభించాలి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సరీర్ అహ్మద్ గులాంరసూల్
- 27,28 తేదీల్లో ఐసీబీఈ కాన్ఫరెన్స్ : డైరెక్టర్ ఆర్. శివశంకర ప్రసాద్
- తుళ్ళూరులో ఇళ్ల అపార్ట్‌మెంట్లు అద్దెకు ఇచ్చేవారు మండల కార్యాలయంలో వివరాలు ఇవ్వాలి: సుధీర్ బాబు

## బాల మేధావులు ఈ అక్కా చెల్లెళ్లు...

### పసి ప్రాయంలోనే అవార్డులు .. రివార్డులు



చిన్నారిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)



జీనియస్ బుక్‌ఆఫ్ రికార్డు పురస్కారమందుకుంటూ... (ఫైల్)

**కంచికచర్ల:** చిన్నప్పటి నుంచే మేధాశక్తిలో ప్రతిభాపాటవాలు కనపరుస్తున్న అక్కా చెల్లెళ్ల తీరుకు మేధావులు సైతం అబ్బురపడుతున్నారు. వీరిలోని జ్ఞాపక శక్తికి పసిగట్టిన తల్లిదండ్రులు తగిన శిక్షణ ఇచ్చారు. దాని ఫలితంగా చిరు ప్రాయంలోనే తమ జ్ఞాపక శక్తి చాటుతుండటంతో వీరిద్దరిని ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. వీరిలో ఏడేళ్ల వయసున్న పెద్ద పాప వీక్షిత మేథా శక్తిని పసిగట్టిన పసిగట్టిన స్కూల్ ప్రిన్సిపాల్ ఏకంగా మొదటి తరగతి నుంచి నాల్గవ తరగతికి ప్రమోట్ చేశారు. కృష్ణాజిల్లా కంచికచర్ల సమీపంలోని మున్నలూరి నుంచి 2002లో ఉద్యోగరీత్యా నగరానికి వలస వచ్చిన బోడేపూడి రామారావు, నాగస్వప్నలు కుత్బుల్లాపూర్ సర్కిల్ గణేష్‌నగర్ సమీపం లోని కల్పనా సొసైటీ (చింతల్)లో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కూతుళ్లు వీక్షిత (7), మౌనిక శ్రీ (4)లు ఉన్నారు. పాపయ్య యాదవ్‌నగర్‌లోని రెయిన్‌బో హై స్కూల్‌లో పెద్దమ్మాయి నాలుగో తరగతి, చిన్నమ్మాయి ఎల్‌కేజీ చదువుతున్నారు. అయితే వీక్షిత చిన్నప్పటి (రెండేళ్ల) నుంచే టీవీలలో వచ్చిన చిత్రాలు, దృశ్యాలు గుర్తుపట్ట గల మేథాశక్తిని సంపాధించుకుంది. ఇది తల్లిదండ్రులు గమనించి ఆ దిశగా ఆ చిన్నారిని ప్రోత్సహించారు.వారి శ్రమ ఫలితంగా రామాయణ, మహాభారత ఇతిహాసాలు, భగవద్గీత పారాయణం, శ్లోకాలు,సుప్రభాతం తదితర గీతాలతో పాటు సామాజిక స్పృహ కలిగిన వర్తమాన సంబంధిత విషయాలలో అవగాహన అండ్ క్యాపిటల్స్, కేంట్రీస్ అండ్ క్యాపిటల్, మ్యాథ్స్ షేప్స్ అండ్ సింబల్స్ ,ఓషన్స్,అబ్రివేషన్స్,భగవద్గీత శ్లోకాలను అనర్గళంగా తడబాటు లేకుండా చెప్పి తన ప్రతిభను చాటుకుంది.

**సాధించిన అవార్డులు .. రివార్డులు**

మేథాశక్తిలో వీక్షిత కనబర్చిన ప్రతిభను కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ తన ఇంటికి పిలుచుకొని అభినందించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర్‌రావు వీక్షితను అభినందించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మల్లారెడ్డి అభినందించారు. ఇటీవల హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన వీక్షితకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రశంసా పత్రం అందజేశారు.

**అక్క బాటలో చెల్లి ..**

వీక్షిత చెల్లెలు మౌనిక శ్రీ, అక్కను అనుసరిస్తూనే జ్ఞాపక శక్తిలో చక్కని ప్రతిభను చాటుకుంటుంది. ఈ పాప ఇప్పటికే జ్ఞాపక శక్తి పోటీలలో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ కిడ్స్ రికార్డ్స్‌లను అందుకుంది. వీరి జైత్ర యాత్ర కొనసాగాలని రాజధాని వార్తలు ఆశీర్వదిస్తోంది.

## విద్యార్థులకు శ్రీనాథ్ చౌదరి వితరణ




రాయపూడిలోని ముస్లిం పిల్లలతో మాట్లాడుతున్న మల్లెల శ్రీనాథ్ చౌదరి



రగ్గులు, పండ్లు పంపిణీ చేసిన తర్వాత చిన్నారులతో మల్లెల

**రాజధాని ప్రతినిధి, రాజధాని :** విద్యా దాత, తాడికొండ సమితి మాజీ అధ్యక్షుడు మల్లెల శ్రీనాథ్ చౌదరి రాయపూడి గ్రామంలోని మదర్సా మదీనతుల్ ఉలూమ్ గుల్షనే ఇమామే అహ్మద్ రజాలోని 70 మంది విద్యార్థులకు, మరో 50 మంది వృద్ధులకు నూతన సంవత్సరము సందర్భంగా మిఠాయిలు,రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు సేవా గుణం అలవరుచుకోవాలని, శాంతి సహనాలతో అందరితో కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు విద్య నభ్యసించి, సేవా గుణంలో అలవరచుకోవాలని మనసారా ఆకాంశిస్తూన్నానన్నారు. వితరణను అందుకున్న విద్యార్థులు, వృద్ధులు శ్రీనాథ్ చౌదరి నూతన సంవత్సర అభినందనలు తెలియజేస్తూ.. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.బాల దీవెనలే బ్రహ్మదీవేనలని ప్రతి సంవత్సరం విద్యార్థులకు తనవంతు విద్యాభివృద్ధికై పాటుబడతానని శ్రీనాథ్ చౌదరి తెలిపారు. చలికాలంలో తమకు రగ్గులు ఇచ్చి ఆదుకున్న శ్రీ మల్లెల శ్రీనాథ్ చౌదరి గారికి వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.



# మోగిన ఎన్నికల నగారా

**న్యూఢిల్లీ :** దేశంలో ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపూర్ రాష్ట్రాలకు ఎన్నికల నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నసీం అహ్మద్ జైదీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల నియమావళి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల్లోనూ మార్చి 11న ఓట్ల లెక్కింపు చేపట్టి. ఫలితాలు అదేరోజు ప్రకటించనున్నారు. పెద్ద నోట్లను చేసి... ఈ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ ఉవ్విళ్లూరుతుండగా.. ఇదే అంశంతో దేశంలోని కోట్లాది మంది ప్రజలు పడిన నరకయా తనను తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రతి పక్షాలు ఎదురు చూస్తున్నాయి. ఎంత తొందరగా ఎన్నికలు నిర్వహస్తే అంత మంచిదని, అటు అధికార పక్షం, ఇటు విపక్షం తొందరపడుతున్న వైనాన్ని గుర్తించిపట్టే.. చడీచప్పుడు లేకుండా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ స్థితిలో ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ ఎన్నికలు అధికార ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నింటికీ కీలకంగా మారాయి. దేశవ్యాప్తంగా మారుతున్న నాజకీయ సమీకరణల నేపథ్యంలో ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఐదు రాష్ట్రాల్లో మొత్తం 690 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 403 స్థానాలున్నాయి. ఆ తర్వాత స్థానంలో పంజాబ్ అసెంబ్లీ 117, ఉత్తరాఖంఢ్ 70, మణిపూర్ 60, గోవా 40 స్థానాలున్నాయి. ఉత్తప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ 27 మే 2017 నాటికి పూర్తవుతుంది. ఉత్తరాఖంఢ్ శాసన సభ 26 మార్చి 2017 నాటికి ముగుస్తుంది. మిగిలిన మూడు రాష్ట్రాలను18 మార్చి 2017తో పూర్తవుతుంది. పదవీ కాలం పూర్తయ్యే ఆరు నెలల్లోగా ఎన్నిక ప్రక్రియ ముగించాల్సిన తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం తాజా షెడ్యూలును ప్రకటించింది.

- జనవరి 11న పంజాబ్, గోవాలో, జనవరి 20న ఉత్తరాఖండ్‌లో.. ఫిబ్రవరి 11న యూపీలో, మార్చి 4న మణిపూర్‌లో ప్రారంభం
- మార్చి 11న ఓట్ల లెక్కింపు
- మహిళలకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లు
- తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు

**ఎన్నికల షెడ్యూల్ ఇలా..**

**ఉత్తర్‌ప్రదేశ్ 403 స్థానాల్లో 7 విడతలుగా పోలింగ్**

ఫిబ్రవరి 11న తొలి విడత (73స్థానాలు), ఫిబ్రవరి 15న రెండోవిడత (67 స్థానాలు), ఫిబ్రవరి 19న మూడో విడత (69స్థానాలు), ఫిబ్రవరి 23న నాలుగో విడత (53స్థానాలు), ఫిబ్రవరి 27న ఐదో విడత (52స్థానాలు) మార్చి 4న ఆరోవిడత (49స్థానాలు), మార్చి 8 ఏడో విడత (40 స్థానాలు )లో ఎన్నికలు జరుపుతారు.

**పంజాబ్‌లో నోటిఫికేషన్ తేదీ:**
**జనవరి 11 పోలింగ్ తేదీ :** ఫిబ్రవరి 4
**గోవాలో నోటిఫికేషన్ తేదీ:** జనవరి 11,
**పోలింగ్ తేదీ :** ఫిబ్రవరి 4

మణిపూర్‌లో రెండు విడతల్లో పోలింగ్ జరుగుతుంది. మార్చి 4న (38స్థానాలు), రెండో విడత మార్చి 8న (22స్థానాలు)ల్లో పోలింగ్ జరుగుతుంది. ఉత్తఖాండ్‌లో జనవరి 20న నోటిఫికేషన్ జారీ చేస్తారు, జనవరి 20న పోలింగ్ జరుపుతారు.

**ముఖ్యంశాలు**

- మొత్తం ఐదు రాష్ట్రాల్లోని 690 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- మొత్తం ఓటర్లు 16 కోటల్లు మంది
- లక్షా 85వేల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఓటర్ స్లిప్పులను ఎన్నికల సంఘమే పంపిణీ చేస్తుంది.
- కొత్త ఒటర్లకు కూడా ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- అన్ని రాష్ట్రాలోనూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వినియోగం
- ఓటరు ఒవరికి ఓటు వేశారో తెలుసుకునే వెనులుబాటు
- అభ్యర్థుల అఫిడవిట్‌లో కొన్ని మార్పులు
- ఎన్నికల ప్రచారంలో పర్యావరణ హిత సామాగ్రినే వాడాలి.
- ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో అభ్యర్థుల ఖర్చు పరిమితి రూ.28లక్షలు, గోవా, మణిపూర్‌లో అభ్యర్థులు ఖర్చు పరిమితి రూ.20లక్షలు. ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోగా వివరాలు తెలియజేశారు.
- అభ్యర్థుల విరాళాలు రూ.20వేలు దాటితే చెక్కు రూపంలో స్వీకరించాలి.

**బడ్జెట్‌కు ఈసీ బ్రేక్..!?**

**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషనర్ నగారా మోగించింది. ఈ కీలక ఎన్నికలకు ముందు ఈ మాసాంతంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనుకున్న కేంద్ర ప్రభుత్వానికి నిరాశ తప్పటం లేదు. ఫిడ్రవరి 1 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం యోచించి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు బడ్జెట్‌కు అనుమతి ఇవ్వరాదని తమకు ప్రతి పక్షాలనుంచి అభ్యంతరాలు అందాయన్ని ఎన్నికల కమిషన్ ఛైర్మన్ నసీం జైదీ మీడియాకు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదును పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. దీంతో బడ్జెట్ సమర్పణ మార్చి 11 తారువాతకు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఎన్నికల తేదీలు తదితర కీలక ఘట్టాలకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. మార్చి 11న ఐదు రాష్ట్రాల కౌంటింగ్‌ను నిర్వహించనున్నారు. తాజా సుప్రీంకోర్టు తీర్పును తాముకట్టుబడి ఉన్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. హిందుత్వ కేసులో తీర్పుపై మత, పేరులో ఓట్లు అడగడం అవినీతి కిందికి వస్తుందన్న సుప్రీం తీర్పును కచ్చితంగా పాటిస్తామని, ప్రతీ అభ్యర్తి సోషల్ మీడియా ఖాతాల వివరాలను సమర్పించాలని ఈసీ కూడా కోరింది. ఈ ఆదేశాలను పాటించాల్సిందిగా అన్ని పార్టీలకు కూడా విజ్ఞప్తి చేసింది. మరోవైపు నిబంధలనలను మరింత కఠినంతరం చేసిన ఈసీ అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చునూ నమోదు చేయాలని, దాన్ని నిత్యమూ అధికారులకు అందించాలని సూచించింది.ఒక్క రూపాయి నగదు ఖర్చును అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. ప్రతి అభ్యర్థీ విధిగా ఎన్నికల ఖాతాను ప్రారంభించాలని, దాన్నుంచే కేటాయింపులు జరపాలని ఆదేశించింది. సదరు ఖాతాలోని వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఈసీకి అందించాలని, ఒకవేళ బ్యాంకుల ద్వారా కాకుండా చెల్లింపులు జరపాల్సి వస్తే, చెక్కులు జారీ చేయాలని సూచించారు. రూ.20 వేల కన్నా అధిక మొత్తంలో డొనేషన్లు వస్తే, అది చెక్కులు లేదా డీడీల రూపంలో మాత్రమే ఉండాలని పేర్కొంది. రాజకీయ పార్టీలు తమ ఖర్చులపై పూర్తి వివరాలతో కూడిన డిక్లరేషన్‌ను ఎన్నికలు ముగిసిన 30 రోజుల్లోగా ప్రకటించాలని ఆదేశించింది.

# రాజధాని వార్తలు
కలం

## జీవితం-నటన-రాజకీయాలు

పవన్‌కల్యాణ్ రెండు,మూడు సినిమాల్లో నటించిన తర్వాత మీడియా సమావేశంలో అల్లు అరవింద్ మాట్లాడుతుంటే పవన్‌గురించి చెప్పండని అభిమానులంతా అరిచారు. దాంతో చిరునవ్వు చిందించిన అల్లుఅరవింద్ అసలు పవన్‌కల్యాణ్ ఎప్పుడు ఏం చేస్తాడో ఎవ్వరికీ తెలియదన్నాడు. అది నిజమే అని పిస్తుంది. ఎందుకంటే అన్న చిరంజీవిపాటు ప్రజారాజ్యం పార్టీలో ఉన్నాడంటే అనుకోవచ్చు. ఆయనే దాన్ని కాంగ్రెస్‌లో కలిపేసి, కేంద్రమంత్రిపదవిని చేపట్టి ఆనక రాష్ట్ర విభజనతో 2014లో జరిగిన ఎన్నికల్లో తెరమరుగయ్యారు. ఈ పరిస్థితిలో మళ్లీ ఆ కుటుంబం నుంచి పవన్ రాజకీయాల్లోకి వస్తారని ఎవరూ అనుకోలేదు. అయితే మీడియా మొఘల్‌గా పేరుగాంచిన వ్యక్తి తన స్టుడియోలో అనేక దఫాలుగా పవన్‌కల్యాణ్‌తో చర్చించి, ఒప్పించారని అదే రంగానికి చెందిన వారు చెబుతున్నారు. దీనికోసం భారీ మొత్తాన్ని సమకూర్చారట కూడా. అయితే ప్రశ్నిస్తా, అవినీతిని కడిగేస్తా అంటూ గొంతు సవరించిన పవన్ తన అభిమానులను నిరాశపరిచారనడంలో సందేహంలేదు. మూడు పంటలు పండే భూమిని బలవంతంగా లాక్కుంటే ఊరుకునేది లేదని అప్పుడెప్పుడో ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పి వెళ్లిపోయారు. ఇంతవరకు దానిపై స్పందించింది లేదు. అబ్బిరాజుపాలెం, బోరుపాలెం, కృష్ణాయపాలెం, ఐనవోలు నాలుగు గ్రామాల్లో భూసేకరణకు మళ్లీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. మరో నాలుగు గ్రామాలు శాఖమూరు, వెంకటపాలెం, పిచికలపాలెం, మందడం1లో భూసేకరణకు గుంటూరు కలెక్టర్ కాంతిలాల్ దండే సంతకం చేశారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అయినా దీనిపై ఆయన స్పందన ఏమిటో ఇంతకీ తెలియలేదు. ఆ తర్వాత రెండు సార్లు ప్రత్యేక హోదా కావాలని కాకినాడ, అనంతపురాల్లో సభలు నిర్వహించారు. హోదాకోసం కేంద్రాన్ని నిలదీశారు. వెంకయ్యానాయుడు, అరుణ్‌జైట్లీలు పార్లమెంటులో మాట్లాడిన మాటలను గుర్తుచేశారు. వీటిపై వెనకడుగు వేసేది లేదని తేల్చి చెప్పారు. అయితే మొన్న శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దండం వెళ్లి కిడ్నీ బాధితులను కలుసుకొని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. రెండు రోజుల సమయంలో దీనిపై స్పందించాలని అల్టిమేటం కూడా ఇచ్చారు. దీంతో కాస్త ప్రభుత్వం దిగివచ్చినట్లు కనిపించింది. బాధితులకోసం డయాలిసిస్ సెంటర్లు నెలకొల్పుతామని, దివ్యాంగులకు కల్పించే పింఛన్‌ను వారికి అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నిజానికి ఉద్దానం సమస్య ఇప్పుడే వెలుగులోకి వచ్చిందికాదు. ఇప్పటివరకు ప్రభుత్వం దీన్ని పట్టించుకొన్న పాపాన పోలేదు. పవన్‌కల్యాణ్ రాకతోనే ఈ సమస్యకు పరిష్కారం వచ్చినట్లు వెంటనే తన మాటను ఖాతరు చేసినట్లు ఉండటం కోసమే ఈ పక్కా ప్రణాళిక అనిపించేలా చేస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నింటికీ టీడీపీ వెనుక ఉందని తెలియడానికి పెద్దగా కష్టపడక్కర్లేదు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలోని ఉద్దండం వెళ్లటానికి పవన్ సన్నిహితుడు రాఘువయ్య కోరిక మేరకు యలమంచిలి ఎమ్మెల్యే వాహనాలను ఇచ్చారనడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే అధికార పార్టీపై గుర్రుగా ఉన్న ప్రజలు ఈ విషయం తెలిసి బిత్తర పోతున్నారు. ఎప్పుడో ఒకసారి షూటింగ్ గ్యాప్ వచ్చినప్పుడు గుర్తుకు వచ్చిన అంశంపై మాట్లాడి ఆపై మరొక విషయానికి వెళ్లటం ప్రజలను, అభిమానులను వేధిస్తోంది. ప్రసుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను బలవంతంగా రుద్దుతున్నాయి. ఈ సమస్యలపై గొంతెత్తడానికి పూర్తికాల రాజకీయాల్లోకి వస్తే బావుంటుంది. అలా కాకుండా ఆరంభ శూరత్వం ప్రదర్శించి మళ్లీ వెళ్లి పోవడం కంటి తుడుపు చర్యమాత్రమే.. నిజానికి ఎన్నికల వాగ్దానాలతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే కాదు, పవన్‌కూడా వెన్నుపోటు పొడిచారనే అనిపిస్తోంది, ఇప్పటికైనా సమయం మించి పోలేదని , రాష్ట్ర పరిస్థితులను దృష్టిలోఉంచుకొని సమస్యలపై పోరాడాలని అభిమానులు ఆశిస్తున్నారు.

రాజకీయాల్లో కలసి పనిచేయడానికి రెడీ అంటూ వైసీపీ మొదట ప్రయత్నించినప్పటికీ ఆపై తెలుగుదేశంతో ఆయనకున్న అనుబంధాన్ని చూసి వెనకడుగువేశారు. చెగొవిరా నా ఆదర్శ నాయకుడని పవన్ ప్రకటించడంతో వామపక్షాలు దగ్గరవడానికి ప్రయత్నిస్తున్నాయి. నిజానికి ఒక సిద్ధాంతం, నిబద్ధత, నిజాయితీ కలిగి దశాబ్దాల చరిత్రకల ఆ పార్టీ పవన్‌దగ్గరకు వెళ్లటం ఆత్మహత్యా సదృశ్యమే.. ఎప్పుడో ఒకసారి ప్రజలముందుకొచ్చే ఆయన, నిరంతరం ప్రజల్లో ఉండే ఎర్రదండు కలవడం ఆశ్చర్యార్థకమే...ఏది ఏమైనా నిజంగా ప్రజలకోసం ఏమైనా చేస్తారా ? వ్యక్తిగత జీవితమా, సినిమాలా, లేదా రాజకీయాలా ఏదో ఒకటి పవన్ ఎన్నిక చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నుకున్న రంగంలో నిబద్ధత, నిజాయితీతో కృషి చేయాలని రాష్ట్ర ప్రజలు పవన్‌కల్యాణ్‌ను కోరుకుంటున్నారు.

## సీజేగా ఖెహార్ ప్రమాణ స్వీకారం



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జగదీష్ సింగ్ ఖెహార్ (64) పదవీ స్వీకారం చేశారు. ఖేహార్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులున్న ధర్మాసనంలో జాతీయ న్యాయవాదుల నియామక మండలి (ఎన్‌జేఏసీ) చట్టం వివాదాస్పదం అయిన నేపథ్యంలో ఈ నియామకం జరగడం గమనార్హం. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి భవన్‌లోని సీనియర్ జడ్జి, టీఎస్ ఠాకూర్ పదవీ విరమణ చేయగా, గత నెల్లో ఈయన పేరును సిఫారసు చేశారు. సిక్కు వర్గం నుంచి మొదటిసారిగా ఎన్నికైన ఖెహార్ ఈ పదవిలో (ఏడు నెలలు) కొనసాగుతారు. ఆగస్టు 27తో ఆయన పదవీకాలం ముగుస్తుంది. ఖెహార్ నేతృత్వంలోని ధర్మాసనం అరుణాచల్‌ప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లను రెండు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన సహారా అధిపతి సుబ్రతారాయ్ కేసును ఈయన ఆధ్వర్యంలోనే విచారించి, జైలు శిక్ష విధించింది. జస్టిస్ ఖెహార్ ఆధ్వర్యంలోని ధర్మాసనం "ఒకేపనికి ఒకే జీతాన్ని" నిర్ణయించింది. దీంతో రోజువారీ పనివారికి, ఒప్పంద కార్మికులకు లాభించింది. రాజ్యాంగ దినోత్సవం నవంబరు 26న, ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలపై కేంద్ర ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆ క్రమంలో న్యాయవ్యవస్థ లక్ష్మణరేఖ పరిధిలోనే పనిచేస్తుందని ఖెహార్ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీకి తీవ్రంగా బదులిచ్చారు. న్యాయవ్యవస్థ దేశప్రజలకు, విదేశీయులకు రక్షణ వివక్షకు లోనుకానీకుండా చూస్తుందని మరో సారి ఘాటుగా స్పందించారు. దేశ ప్రజలకు సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంఅందించేది న్యాయవ్యవస్థేనని పలు సందర్భాల్లో ఖెహార్ పేర్కొన్నారు.

## తెలుగుతేజం 'ఫోర్బ్స్' లో మెరిశాడు

**కామెర్ల నిర్ధారణ పరికరం తయారీకిగాను కొప్పర్తి వివేక్‌కు విశ్వ గౌరవం**

**ఆకివీడు:** ప్రతిష్ఠాత్మకమైన ఫోర్బ్స్ సూపర్ అచీవర్స్ జాబితాలో ఆంధ్రా కుర్రాడు చోటు దక్కించుకొన్నాడు. నూత్న ఆవిష్కరణలతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకి చెందిన కొప్పర్తి వివేక్‌కి (27) 'ఫోర్బ్స్' స్థానం కల్పించింది. 30 ఏళ్లలోపే.. ప్రపంచ గతిని మార్చివేసే ఆలోచనలు చేసిన 600 మందికి ఫోర్బ్స్ 2017 ఎడిషన్‌లో స్థానం కల్పించగా, మనదేశానికి చెందిన వివేక్ సహా 30 మందికి చోటు లభించింది. చాలాకాలంగా అమెరికాలో ఉంటున్న వివేక్.. మరికొందరితో కలిసి నియోలైట్ సంస్థని స్థాపించారు. కామెర్ల వ్యాధిని నిర్ధారించే ఫోటో థేరఫీ పోర్టబుల్ పరికరాన్ని ఈ సంస్థ అభివృద్ధి చేసింది. ఈ కృషినే ఫోర్బ్స్ గుర్తించి.. అరుదైన గౌరవం అందించింది. తండ్రి ఉద్యోగం రీత్యా చెన్నైలోనే పుట్టిపెరిగిన వివేక్.. అమెరికాలో ఎంబీ ఏ చేశాడు.

**మార్చిలో వివేక్ పెళ్లి..**

వచ్చే మార్చి 18న వివేక్ ఒక ఇంటివాడు అవుతున్నారు. దానికోసం కాకినాడలో వివాహ వేదిక సిద్ధమవుతోంది. ఫిబ్రవరి మొదటి వారంలో ఆయన తల్లిదండ్రులతో కలిసి వివేక్ ఆకివీడు వస్తున్నారు. వివేక్‌ను గ్రామ పంచాయితీ తరపున గతంలో సన్మానించిన విశేషాలను సర్పంచ్ గొంట్లా గణపతి గుర్తుచేసుకొన్నారు.

## సమాన ప్యాకేజీ ఇవ్వాలి

- లంక పట్టా భూములతో సమాన ప్యాకేజీ ప్రకటించాలి
- రాజధాని సీపీఐ శాఖ తుళ్ళూరు నేతలు

**రాజధాని ప్రతినిధి-తుళ్ళూరు :** రాజధానికి భూములిచ్చిన లంక రైతులకు పట్టా భూములతో సమానంగా ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ రాజధాని ప్రాంత సీపీఐ నేతలు తుళ్ళూరు మండలంలోని పలువురు లంక భూముల సాగుదారులతో కలసి పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ మేరకు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని సీఆర్‌డీఏ డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పచ్చల సాంబశివరావు మాట్లాడుతూ సుమారు 7 దశాబ్దాలుగా రాయపూడి సొసైటీల సుమారు 750 ఎకరాల లంక భూములు వున్నాయని వీటిని సాగుచేసుకుని జీవించే లబ్ధిదారులు సుమారు 2000 మంది వుంటారని తెలిపారు. వీరందరకీ సీఆర్‌డీఏ ఇంత వరకు ప్యాకేజీ పై స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. ఇంతవరకు ప్లాట్లు ఇవ్వక, కౌలు చెక్కులు ఇవ్వక పోవడంతో లంక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాయపూడి అంబేద్కర్ సొసైటీలో 160 ఎకరాలు, లెనిన్ సొసైటీలో 200 ఎకరాలు, హరిజన కోఆపరే టీవ్ జాయింట్ ఫారం సొసైటీలో 300 ఎకరాలు ఇవి కాక బోరుపాలెం లంక సుమారు 90 ఎకరాలు ఉందన్నారు. ఇప్పటికే మూడు సార్లు సర్వేలు చేసిన అధికారులు లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు బాధితులకు అధికారులు ఏమాత్రం న్యాయం చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని సీపీఐ నాయకులు చింతరాల కోటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, జివి, రాజు, దేవునిదయ పాల్గొన్నారు.

## వేగంగా అసెంబ్లీ నిర్మాణ పనులు

**వెలగపూడిలోనే తదుపరి సమావేశాలు!**
**పనులను పరిశీలించిన కోడెల**



**రాజధాని ప్రతినిధి-అమరావతి :** అమరావతి నవ్యాంధ్ర రాజధాని అమరావతిలోని వెలగపూడి సచివాలయం ఆవరణలో నిర్మిస్తున్న అసెంబ్లీ భవనంలోనే శీతాకాల, బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు తెలిపారు. ఆయన నిర్మాణంలో ఉన్న శాసనసభ, శాసనమండలి సమావేశ మందిరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ భవన నిర్మాణం పూర్తి అయిన దాన్ని బట్టి సమావేశాలు నిర్వహిస్తామని కోడెల తెలిపారు. జనవరి నెలాఖరు కల్లా భవన నిర్మాణం పూర్తి చేస్తే, ఫిబ్రవరి మొదటి వారంలో శాసనసభ శీతాకాల సమావేశాలు, మొడో వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. అసెంబ్లీ భవవ నిర్వాణ పూర్తి కాకపోతే శీతాకాల, బడ్జెట్ సమావేశాలు కలిపి నిర్వహిస్తామని స్పీకర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

## జన్మభూమి సభను బహిష్కరించిన నాయకులు

**రాజధాని ప్రతినిధి-కొయ్యలగూడెం, అన్నంరెడ్డిసుబ్బారావు :** 6వ తేదీశుక్రవారం కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో జన్మభూమి-మాఊరు గ్రామసభను ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ ఎం.పి.టి సి.మల్లాబత్తులవీర్రాజు, సొసైటి అధ్యక్షుడు కోనే శ్రీనివాస్, కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్ ముప్పిడి వెంకటేశ్వరావులు బహిష్కరించి సభనుంచి నిష్క్రామించి వెళ్లిపోయారు. ఉభయసభ ప్రారంభమైన తర్వాత ప్రార్ధన్, ప్రతిజ్ఞ పూర్తయిన అనంతరం గడచిన జన్మభూమిసభలో అర్జీలు ఇచ్చిన సమస్యల పరిష్కారం గురించి, గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లుల చెల్లింపు సమస్య గురించి కొత్తరేషన్ కార్డులు, కొత్త పెన్షన్‌ల మంజూరు గురించి ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులను ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు అధికారులనుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో ప్రజాసమస్యలు పరిష్కారం కానప్పుడు, తమ ప్రజలకు జవాబు చెప్పుకోలేమని, తామసభలో ఉండలేమని చెప్పి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తమస్థానాలలో నుంచి లేచి వెళ్లి పోయారు. అయితే అప్పటికే సభావేదికపై కూర్చొనిఉన్న ఎం.పి.టి. అయిన పర్తిచందన శ్రీదేవి, జడ్.పి. ఉపాధ్యక్షుడురాలు చింతల వెంకట రమణ చేసేది ఏమిలేదని అక్కడినుంచి సరిపెల్లిలో జరిగే గ్రామసభకు వెళ్లిపోయారు. పరిస్థితిని మండల ఇ.ఓ.పి.ఆర్ అండ్ ఆర్.డి. సత్యనారాయణ మండల ప్రత్యేకాధికారి కె.కమలాకరశర్మకు ఫోన్ ద్వారా తెలపటంతో ఆయన హుటాహుటిన రామానుజపురం చేరుకొని గ్రామాసభకు వచ్చిన పరిస్థితిని ఆరాతీసారు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పరిమి రాంబాబు ఎం.పి.టి.సి. సభ్యుడు వీర్రాజుసోసైటి అధ్యక్షుడు శ్రీనివాస్‌ల దగ్గరకు ప్రత్యేకాధికారి కమలాకరశర్మ ఎస్.బి.పవన్ కుమార్‌లు వెళ్లి వారితో చర్చించారు. దాదాపు అర్ధగంటసేపు చర్చల తర్వాత ప్రత్యేకాధికారి కోరికమేరకు వారంతా మధ్యాహ్నం1.గంటకు సభాస్థలికి వచ్చారు. అయితే వారెవరు వేదికపైన కూర్చొవటానికి ఇష్టపడక, సభకులమధ్యలోనే కూర్చున్నారు. వేదిక పై అధికారులు కూర్చుని సభను ప్రారంభించిన కొద్దిసేపటికి టి.నర్సాపురం మండలంలో ఎమ్మెల్యే తోపాటు జన్మభూమి సభలో సాల్గొన్న ఎ.ఎం.సి. ఛైర్మన్ పారేపల్లి రామారావు, సరిపల్లి వేల్లిన ఎం.పి.పి, జడ్.పి.ఉపాధ్యక్షుడు అక్కడికి చేరుకొని స్థానిక నాయకులను ప్రజాప్రతినిధులకు నచ్చచేప్పి వేదికపైకి తీసుకువెళ్ళారు. తర్వాత మధ్యహ్నం 1:20 గంటకనుంచి జన్మభూమిసభ, ప్రారంభిమయింది. మరుగుదొడ్లకు బిల్లులు చెల్లింపులో జాప్యం అధికారుల ఆన్‌లైన్ కబుర్లు, రేషన్‌కార్డులు పంపిణీలపై నాయకులు పెద్దలతో అసంతృప్తి వ్యక్తమయింది. ఎ.ఎం.సి.ఛైర్మన్, రామారావు, జడ్.పి. ఉపాధ్యాక్షుడితో ఎం.పి.పి, పరిమిరాంబాబు తదితరులు ప్రసంశించారు.

## రాయపూడిలో బాలయేసు మరియమాత ఊరేగింపు



**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** రాయపూడి గ్రామంలోని ఆర్సీఎం చర్చిలో నూతన సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించారు. 10 సంవత్సరాలకు నుంచి నిర్వహిస్తున్న ఈ వేడుకలను ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో చేస్తారు. క్రీస్తు పుట్టినప్పుడు ఆకాశంలో నక్షత్రం ఆధారంగా ముగ్గరు జ్ఞానులు పశువులు పాకను సందర్శించి కానుకలు సమర్పించిన సందర్భంగా ఈ పండుగను జరుపుతారు. తుళ్లూరు విచారణ గురువులు ఫాన్సిస్ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో దివ్య పూజాబలి నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు బాలయేసు, మరియమాత, ప్రతిమలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్‌ఫ్రాన్సిస్,ఫాదర్ సావిర్ రెడ్డి, సిస్టర్‌లు చర్చి ఉపదేశి ప్రసాద్, సంఘపెద్దలు ఎన్ ఆదాం కె. శ్రీను కె.బాజి సి.హెచ్ కోటేశ్వరరావు కె.ఇమ్మామేలులు పాల్గొన్నారు.

## 40 అంతస్తులకు మించితే ఏఏఐ అనుమతి తప్పనిసరి

**సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్**

**రాజధానిప్రతినిధి,విజయవాడ :** రాజధాని అమరావతిలో 40 అంతస్తులకు మించిన నిర్మాణాలు చేపట్టాలంటే తప్పనిసరిగా ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వద్ద నుండి ఎన్ఓసీ తీసుకోవాల్సి ఉంటుందని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ ) కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలో సముద్ర మట్టానికి 150 మీటర్ల ఎత్తు వరకూ నిర్మాణాలకు అనుమతి అవసరం లేదన్నారు.

# గ్రామాల అభివృద్ధి కోసమే జన్మభూమి – మా ఊరు

**యర్రంపేట జన్మభూమి సభలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు**

**అన్నంరెడ్డి సుబ్బారావు, రాజధాని ప్రతినిధి,కొయ్యలగూడెం :** కుటుంబ వికాసం కోసం, సామాజిక వికాసం కోసం.. తద్వారా గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి– మన ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు అన్నారు. 4 వ విడత జన్మభూమి– మన ఊరు కార్యక్రమం సందర్భంగా 3 వ తేదీన మండలంలోని యర్రంపేట, గవరవరం గ్రామాలలో జరిగిన సభలలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలలో అవసరమైన వ్యక్తిగత సమస్యలు, సామాజిక సమస్యలను,మౌళిక సదుపాయాల కల్పన అంశాల గురించి గ్రామ సభల్లో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని ఎమ్మెల్యే తన ప్రసంగంలో వివరించారు. చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తోందని,జన్మభూమి సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎర్రంపేట పంచాయితీలోని గ్రామాలన్నింటిలో వివిధ పథకాల ద్వారా రూ.60 లక్షల నిధులతో సి.సి. రోడ్ల నిర్మాణం జరిగిందని మరో రూ.15 లక్షలతో సి.సి. రోడ్లు,రూ.7.50 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం జరగవలసి ఉందన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ జన్మభూమి కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు, ఇన్‌ఛార్జి అధికారి బిస్వాస్ మాట్లాడుతూ జన్మభూమి గ్రామ సభలలో వచ్చిన వినతి పత్రాలు, సూచనలు ఆధారంగా రూపొందించిన ప్రణాళికల ఆధారంగానే ఆయా గ్రామల అభివృద్ధికి కార్యచరణి నిధులు మంజూరు జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్.డి.ఓ లవన్న మాట్లాడుతూ అందరికీ సామాజిక బాధ్యత ఉన్నప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగి మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. గ్రామ సర్పంచ్ కిరణ్మయి సభకు అధ్యక్షత వహించారు. ఎం.పి.డి.ఓ.ఎం.రాజు సభను నిర్వహించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. మహిళలు ముగ్గులు వేసారు. బోగి మంటలు కూడా వేసారు. ఎం.ఎం.సి. చైర్మన్ పారేపల్లి రామారావు, ఎం.పి.పి. అయునపర్తి చందన శ్రీదేవి, జడ్.పి.వైస్‌పర్సన్ చింతల వెంకటరమణ స్థానిక ఎం.పి.టి.సభ్యులు ఎం. నాగవెంకటలక్ష్మీ పాల్గొన్నారు. గ్రామ సభకు ముందు ఎమ్మెల్యే తదితరులు పంచాయతీ పరిధిలోని కనకాద్రిపురంలో ఎస్.డి.ఎఫ్.నిధులు రూ.5లక్షలతో నిర్మించే సి.సి. రోడ్డుకు, ఎం.పి. తోట సీతారామ లక్ష్మీ, ఎం.పి. ల్యాడ్స్ నిధులు రూ.7.50 లక్షలతో నిర్మించే సామాజిక భవనానికి శంకుస్థాపనలు చేసారు. అనంతరం గవరవరంలో జరిగిన జన్మభూమి గ్రామసభలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. గవరవరం సర్పంచ్ మద్దిపాటి.రాజ్‌కుమార్ అధ్యక్ష వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గవరవరంలో సి.సి. రోడ్ల నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. అక్కడ చంద్రన్న సంక్రాంతి కానుకలు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేసారు. స్థానిక ఎం.పి.టి.సి. సభ్యులు పరిటాల శ్రీదేవి. నల్లూరి ఏసుమణి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పారేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. తాహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి సభను నిర్వహించగా మండల ప్రత్యేకాధికారి కె.కమలాకర శర్మ పర్యవేక్షించారు. కన్నాపురంలో జరిగిన జన్మభూమి సభకు సర్పంచి మడకు వెంకటేశ్వరరావు, మంగపతి దేవి పేటలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ శ్రీనివాసరావు, పొంగుటూరు గ్రామ సభకు ఉపసర్పంచ్ పసుసులేటి వెంకటరమణ, రాజవరం జన్మభూమి సభకు సర్పంచ్ చీర్ల కమల సూర్యం, బయ్యనగూడెం గ్రామసభలో సర్పంచ్ జి. చంచయ్య,అచ్యుతాపురం సబకు సర్పంచ్ మర పట్ల నాగచంద్ర అధ్యక్షత వహించారు. ఎం.పి.పి. చందనశ్రీదేవి,జడ్.పి.ఉపాధ్యక్షురాలు వెంకటరమణ, ఎ.ఎం.సి. చైర్మన్ రామారావు స్థానిక ఎం.పి.టి.సి. సభ్యులు పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమాలలో గర్భిణీలకు సీమంతాను ప్రజాప్రతినిధులు జరిపారు. ముగ్గుల పోటీలు, గ్రామీణ క్రీడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేసారు.

## బ్యాంకుకు తాళం వేయడం మర్చిపోయారు




**మెల్‌బోర్న్ :** నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోయిన బ్యాంకు సిబ్బంది విధులు ముగిసిన అనంతరం బ్యాంకుకు తాళాలు వేయడం మర్చిపోయి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. బ్యాంకుకు తాళం వేసి లేదని గమనించిన ఓ స్థానికుడు లోనికి వెళ్లి కలియ తిరిగిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. సాధారణంగా ఆదివారం మధ్యాహ్నం అంటే బ్యాంకులకు తాళాలు వేసి ఉంటాయి. కానీ మెల్‌బోర్న్ శివారులోని హాంప్‌షైర్ రోడ్డులో ఉన్న సన్‌షైన్ కామన్‌వెల్త్ బ్యాంకు శాఖ తెరిచి ఉంది. ఎవరన్నా ఉద్యోగులు పని చేసుకునేందుకు తెరిచి ఉంచారేమో అనుకుంటే తప్పులో కాలేసినట్లే. బ్యాంకు తెరిచి ఉండటాన్ని గమనించిన సేయర్ అనే స్థానికుడు లోపలికి ప్రవేశించి.. పరిసరాలను వీడియో తీస్తూ.. ఇక్కడ ఏటీఎం ఉంది, బ్యాంకు కూడా తెరిచే ఉంది, ఎవరూలేరు, లోపలికి వెళ్లాలనుకుంటున్నారా..అంటూ వ్యాఖ్యానించాడు. అనంతరం ఆ వీడియోను తన ట్విట్టర్‌లో పోస్టు చేశాడు. పోస్టు చేసిన కొద్దిసేపటికే ఆ వీడియోకు ఎన్నో వ్యూస్ లభించాయి. ఇదిలా ఉండగా ఏటీఎంలో డబ్బు కోసం వెళ్ళిన ఓ మహిళ బ్యాంకుకు తాళాలు వేసిలేవని గుర్తించి విక్టోరియా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బ్యాంకుకు బయలుదేరారు. తాము వచ్చేవరకు ఆ మహిళను అక్కడే ఉండమని పోలీసులు కోరారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు విచారణ చేపట్టగా.. వారాంతంలో సిబ్బంది విధులు ముగించుకుని వెళ్తూ తాళాలు వేయడం మరిచిపోయినట్లు గుర్తించారు. బ్యాంకులో ఎలాంటి దోపిడీ, నష్టం జరగకపోవడంతో సిబ్బంది, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## గ్రూప్-2 విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ

**చిలకలూరిపేట :** డీఆర్‌డీఏ, వెలుగు, స్వర్ణాంధ్ర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రూప్-2 సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నెల 7 నుంచి ఉచిత ఆన్‌లైన్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటెరి డాక్టర్ శైలజ తెలిపారు. నగదు రహిత లావాదేవీలపై స్థానిక సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్లో అవగాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగదు రమిత లావాదేవీలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ సహకారంతో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తరగతులు రెండు నెలలపాటు కొనసాగుతాయని ఇప్పటికే 40మంది వరకు నమోదు చేసుకున్నారన్నారు. స్వర్ణాంధ్ర ఫౌండేషన్ కార్యదర్శి పేర్ని వీరనారాయణ మాట్లాడుతూ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, మద్దిరాల చౌదరయ్య కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్ మస్తాన్‌రావు, రమణి, శ్రీనివాసరావు, ఈదర గిరీష్‌బాబు, పాఠశాల హెచ్‌ఎం ఉప్పలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రప్రథమ మహిళా గురువు

ఆమె

### సావిత్రిబాయికి మహిళానివాళి

దేశంలో మహిళాచైతన్యానికి అవిరళ కృషి చేసిన సావిత్రిబాయి జన్మదినం జనవరి 3ను ఘనంగా జరుపుకున్నారు. భర్త వద్ద విద్యాభ్యాసం చేసి, ఓ పాఠశాలను స్థాపించి, మహిళలను విద్యా వంతుల్ని చేయడానికి ఎంతో శ్రమించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి. మానవతా మూర్తి సావిత్రి బాయి పూలే 186వ జయంతి కార్యక్రమాన్ని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వామపక్షాలు దాసరి భవన్‌లో నగర జరిగాయి. అణగారిన వర్గాల్లో చైతన్యానికి,మహిళలను విద్యావంతుల్ని చేయడానికి, సామాజిక విప్లవాన్ని తీసుకురావడానికి జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతులు అవిరళ కృషి చేశారు.

ఆనాటి సమాజిక కట్టుబాట్లు , బ్రాహ్మణవాద సాంప్రదాయాలను దిక్కరించి స్త్రీల విద్యావ్యాప్తికి కృషి చేశారు. సాంఘిక దురాచారాలు అమితంగా సమాజాన్ని ఏలుతున్న నేపథ్యంలో వితంతువులను కన్నబిడ్డలుగా చూసిన మహానుభావులు సావిత్రిబాయి పూలే దంపతులు. మనుధర్మశాస్త్రం రాజ్యమేతులున్న ఈ రోజుల్లో మహిళలు, వితంతువులు, శూద్రుల సామాజిక చైతన్యానికి సావిత్రిబాయి పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకం.మహిళలకు చదువునేర్పుతున్నారన్నదుగ్ధతో సంప్రదాయవాదులు,






మనువాదులు ఆమెపై పేడనీళ్లు, బురద చల్లేవారు. దీంతో ఆమె మరో జత బట్టలను సంచిలో తీసుకువెళ్లేవారు.

**గూగుల్ ఘన నివాళి**

గూగుల్ డూడుల్‌లో సావిత్రిబాయ్ పూలేకు గౌరవం దక్కింది. ఆమె జయంతి సందర్భంగా గూగుల్ సంస్థ తన డూడుల్‌లో ఆమెను ఫోటోను ఉంచి నివాళులర్పించింది. కాగా, సావిత్రి బాయ్ పూలే 1831లో జనవరి 3 జన్మించిన విషయం తెలిసిందే. సామాజిక కార్యకర్త, కవి అయిన తన భర్త జ్యోతిరావ్ పూలేతో కలిసి ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారత దేశంలో ఆమె తొలి మహిళ గురువు. మహిళలకు చదువు చెప్పేందుకు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నారు. అవమానాలు, దాడులు భరించారు. ఇంతటి మహిమాన్వితకు గూగుల్ నివాళి అర్పించి మహా గౌరవం ఇవ్వటం... భారతీయ మహిళలకు గర్వకారణం.

# ముస్లింలు దేశాన్ని పూజించరు.. ప్రేమిస్తారు !

### ఆచార్య లక్ష్మీశంకరాచార్య



**సంభాల్ :** ముస్లింలు 'భారత్ మాతాకీ జై' 'వందేమాతరం' నినాదాలను ఎందుకు పాటించరనే సందేహాల్ని చాలామంది లేవనెత్తుతుంటారు. కొందరైతే ఆ నివాదాల్ని పలకనివారికి ఈ దేశంలో ఉండే హక్కులేదనీ, వారు పాకిస్తాన్‌కు వెళ్లి పోవాలని హెచ్చరిస్తుంటారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టిచే ఉద్దేశమున్నవాళ్లు దీనిపై రాద్ధాంతం సృషిస్తూ వుంటారు. ఉదార స్వభావమున్నవారికి ఈ అపోహల్ని సులభంగా దూరం చేయచ్చు. కానీ సంకుచిత స్వభావ మున్నవారిని మార్చడం క్లిష్టమైన పనే.ప్రముఖ హిందూ ధర్మ గురువు స్వామి లక్ష్మీశంకరాచార్య సంభాల్‌లో జరిగిన ఒక సమావేశంలో ప్రసంగిస్తూ ముస్లింల మనోభావాలను కుండబద్దలు కొట్టినట్టు వివరించారు. వారి ప్రసంగం ఇలా వుంది.

'వందేమాతరం పేరుతో ముస్లింల దేశభక్తిని శంకించడం కన్నా. వారి మనోభావాల్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది 'వందే' అనే పదానికి 'మోకరిల్లడం' అనే అర్థం వుంది మనం ఎవరినైతే పూజిస్తామో వారికే మోకరిల్లతాం, వారికే వందనం చేస్తాం. ఎవరినైతే పూజించమో వారికి వందనం చేయం. ప్రతి పదార్థంలోనూ దైవాన్ని చూపే హిందువులు దేశాన్ని తల్లితో పోల్చుతూ 'వందేమాతరం' అని నినదిస్తారు. కానీ ముస్లింలు తమ ధార్మిక విశ్వాసాల మూలంగా ఈ నినాదాలను పాటించకపోవచ్చు, ఇస్లాం ధర్మాన్నిపాటించే ముస్లింల ప్రధాన విశ్వాసం 'అష్హదు అన్‌లా ఇలాహ ఇల్లల్లాహ్, వ అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్' అనే కలిమావాక్యాలు. దానికర్థం ఏమింటే సృష్టికర్త అయిన అల్లాహ్ తప్ప ఎవరూ పూజ్యనీయుడు కాదు, ముహమ్మద్(స) ఆయన ప్రవక్త ఈ విశ్వాసం మూలంగా ఒక ముస్లిం అనేవాడు సృష్టికర్త అయిన దైవాన్ని తప్ప ఎవరినీ పూజించడు. మరే ఎవరిముందూ సాష్టాంగపడడు, మోకరిల్లడు.తనకిష్టమైనవారినెవరినైనా ప్రేమిస్తాడు.గౌరవిస్తాడు, అభిమానిస్తాడు. కానీ పూజించడు, ముస్లింలు అల్లాహ్ తర్వాత ముహమ్మద్ ప్రవక్త (స)ను అందరికంటే ఎక్కువగా ప్రేమిస్తారు. కానీ ఆయన్ని కూడా పూజించరు. "తల్లి పాదాలకింద స్వర్గముందని" ఇస్లాంలో చెప్పబడింది. తల్లిని గౌరవిస్తారు, ప్రేమిస్తారు, ఆమెకు సేవ చేస్తారు. కానీ ఆమెను పూజించరు. కోట్లాదిమంది భారతీయ ముస్లింలు దేశాన్ని ప్రేమిస్తారు. కానీ దైవంతో సమానంగా పూజించరు. దేశం కోసం ఎప్పుడు అవసరమొచ్చినా తలలు అర్పించడానికీ, ప్రాణత్యాగం చేయడానికి ముస్లింలు సిద్దంగా వున్నారు. కానీ దేశాన్ని పూజించరు. వందనం అనేది కేవలం దైవానికి మాత్రమే పరిమితం"

# పేదల కోసమే 'దివ్య దర్శనం'



**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** పేదల కలలు నిజం చేయాలనే లక్ష్యంతోనే దివ్యదర్శనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. మంగళవారం స్థానిక దుర్గాఘాటు వద్ద ప్రారంభించిన దివ్య దర్శనం తీర్థయాత్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,రాష్ట్రంలోని అన్ని మతాలను గౌరవించడానికి వారి మత విశ్వాసాల ప్రకారంగా ఆయా దేవాలయాలకు వెళ్లి పూజలు చేస్తారన్నారు. హిందువులు దేవతలను పూజిస్తే, ముస్లింలు మసీదుల్లో, క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థన చేస్తారని తెలిపారు. వారి మత విశ్వాసాల ప్రకారం పూజలు చేయడం వల్ల ప్రజలకు ఉల్లాసంతో పాటు ఉత్సాహం కూడ వస్తుందన్నారు. అందుకే మన పూర్వీకులు భజనలు చేస్తూ తీర్థ యాత్రలు చేసేవారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పేద వారి కోసం దివ్య దర్శనం కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. దీని ద్వారా దేశంలోని ప్రముఖ హిందూ దేవాలయాలకు ప్రతి మండలంలో 200 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసి పంపనున్నట్లు వెల్లడించారు. దేశంలోని పేద హిందువులకు మొదటి తీర్థయాత్రను రాష్ట్రంలో తీసుకురావడం సంతోషంగా ఉందని చెప్పారు. 4 నుంచి 5 రోజుల పాటు ఈ దివ్య దర్శనం తీర్థయాత్ర కొనసాగుతుందని, దీనిలో పాల్గొనే హిందు భక్తులకు ఉచితంగా అన్ని వసతులు కల్పించి దేవాలయాల దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క కుటుంబం నుంచి 5 గురు తీర్థయాత్రల్లో పాల్గొనే అవకాశం వుందన్నారు. ప్రతి మతం సామరస్యం కోసం పాటుపడాలని అప్పుడే లౌకిక వాదానికి అర్థం చేకూరుతుందన్నారు. దివ్య దర్శనం కార్యక్రమానికి ఆర్టీసీ నుంచి అద్దె ప్రాతిపదికన 52 బస్సులు తీసుకుని ప్రతి మండల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 30 వేల మందికి ఈ తీర్థయాత్రల్లో అవకాశం కల్పిస్తున్నామన్నారు.18 నుంచి 70 సంవత్సరాల లోపు ఉన్నవారు ఈ తీర్థయాత్రలకు వెళ్లవచ్చని ప్రకటించారు. దివ్యదర్శనం యాత్రకు తీసుకు వెళ్లే వారిలో 90 శాతం వరకు ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేద హిందు భక్తులు ఉంటారని, మిగిలిన 10 శాతం అగ్రవర్ణాల్లోని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తీర్థయాత్రల్లో పాల్గొనే భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించాలని, వారి నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులకు సీఎం సూచించారు.మన ఇంటికి బంధువులు వస్తే ఏవిధంగా మర్యాదగా చూస్తామో, యాత్రల్లో పాల్గొనే వారిని కూడా అలాగే ఆదరించి వారికి ఇదొక మధురస్మృతిగా మిగిలేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే ఈ తీర్థయాత్రల అనుభవాలను మీ ఊరిలో మిగిలిన వారికి చెప్పాలని యాత్రికులకు సూచించారు. ముందుగా ముఖ్యమంత్రి తీర్థయాత్రల్లో పాల్గొనే నిరుపేద భక్తుల చేత దీక్షా ప్రమాణం చేయించారు. అనంతరం దివ్యదర్శనం యాత్రికులు వెళ్లే నాలుగు బస్సులకు లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి జేవీఎస్ ప్రసాద్, కమిషనర్ అనురాధ, దుర్గగుడి ఇవో సూర్యకుమారి, ఆర్టీసీ ఎండీ మాల కొండయ్య సీఎంవో అధికారి ప్రద్యుమన్న , ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి

### ఎమ్మెల్యే ఆనందరావు



**రాజధానిప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమలుచేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతీ కుటుంబం ఏదోరకమైన ఆర్థిక లబ్ధిని పొందుతుందని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. జన్మభూమి మావూరు కార్యక్రమం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ మండలాల్లో ఏర్పాటుచేసిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 90శాతం మంది ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్నప్పటికీ తాము పొందుతున్న లబ్ధిగురించి చెప్పకుండా మౌనంగా వుంటం తగిన ప్రచారం ఉండటం లేదని చెబుతూ గ్రామసాయిలో నాయకులు ప్రభుత్వ సంక్షేమపథకాలు గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ పేదవాడికి అండగా ఉండే ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం అన్న విషయాన్ని ప్రజల్లోకి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. కాలనీలోను మెరకచేసి నిరుపేదలకు పట్టాలు ఇస్తామని, జన్మభూమిలో ఎంపిక చేసిన పెన్షన్ దారులకు ఫిబ్రవరి 1 నుండి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని, అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఇందుపల్లిలో 121 పొదుపు సంఘాలు వుండగా వీరందరికీ రుణమాఫీలో భాగంగా రూ.3వేలు వారి ఖాతాలో వేయడంతోపాటు, సంక్రాంతి పండుగను ఆందోత్సవాలతో జరుపుకొనేందుకు చంద్రన్నభీమా పథకమని, కేవలం రూ.15లు ప్రీమియంతో చంద్రన్న భీమా పథకంలో చేరవచ్చని, భర్తలేని నిరుపేద కుటుంబం నిరాశ్రయులు కాకూడదనే ఉద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రన్నభీమా పథకాన్ని ప్రవేశపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, జెడ్‌పిటిసి అధికారి జయవెంకట లక్ష్మి, మల్లుల పోలయ్య, పొలమూరి ధర్మపాల్, ఉప సర్పంచ్ బొంతు గోవిందు శెట్టి, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు ఎంపిపి బి ఈశ్వరరావు, ఎంపిపి చింతా ఝాన్సిలక్ష్మి, జెడ్‌పిటిసి వేగిరాజు ప్రవీణ, ఎఎంసి ఛైర్మన్ జి చినబాబు, ఎంపిడిఓలు ఎ శారారాణి, వి శాంతమణి తదితరులు పాల్గొన్నారు.

**పట్టణంలో 10వ వార్డులో జన్మభూమి గ్రామసభ:** పట్టణాభివృద్ధిలో భాగంగా మౌళిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని ఎంపి పండుల రవీంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ఎంపి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం త్రాగునీరు, రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలుకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తిస్థాయిలో సమకూర్చుతామన్నారు. అనంతరం ఎంపి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు కలిసి రేషన్‌కార్డులు, చంద్రన్న కానుకలు, స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మెట్ల రమణబాబు, మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్, తిక్కిరెడ్డి నేతాజీ, కమిషనర్ సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రద్ధతో చదివితే మంచి భవిష్యత్తు



**రాజధాని ప్రతినిధి,కోనసీమ, జిఎన్ రావ్ :** సావిత్రిభాయ్ పూలే జయంతి సందర్భంగా మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజిక వేత్త బిఎస్ రాధమ్మ పాల్గొని మాట్లాడుతూ భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలికి ఇన్నాళ్ళకు ఈ ఘనత దక్కడం ఆనందంగా ఉందన్నారు. బాలికలు శ్రద్ధతో చదువుకుంటే అందరూ మంచి భవిష్యత్‌ను సాధించగలుగుతారన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయిని ఎస్‌ఎల్‌వి బాలను రాధమ్మ దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం హెచ్‌ఎం బాల మాట్లాడుతూ సావిత్రి భాయ్ అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, మానసిక ధైర్యం, మనోనిబ్బరం కలిగి ఉంటే సత్ఫలితాలు సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఎస్.రాజేశ్వరి, ముక్తేశ్వరరావు, సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో 'సర్ సి.వి.రామన్' విద్యార్థులకు పతకాలు



చిత్రలేఖన పోటీల్లో సర్.సి.వి.రామన్ విద్యార్థులు

**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** ఇటీవల హైదరాబాద్ శ్రీ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో సర్ సి.వి.రామన్ విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చి పతకాలను సాధించారు. వి.మణికంఠ, బి.దీరజ్, ఎం.శ్రీచరణ్, ఎన్.యువకిరణ్‌గణేష్,ఎం.మోక్షితలు స్వర్ణపతకాలు, బి.పవన్‌కుమార్, సిహెచ్.డి.ఎస్.హెచ్.సుభాష్, ఎస్.సుశృతి, ఎస్.చరణ్‌తేజ్, ఎ.అనువంశిత, బి.మనీష్ సూర్య, జి.సాయికార్తీక్, ఎ.సాయిగణేష్, ఎ.అక్షయ్‌లు రజత పతకాలు, పి.ఆత్మిక, బి.బి.శ్రీవర్ష, ఎస్.హిమశ్రీ, జి.చరణ్, ఎ.గాయత్రి, కె.భార్గవ్ నారనాయణలు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్లు రవణం రాంబాబు, పరసా రాజా, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధానోపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## జన్మభూమితో సమస్యలు పరిష్కారం

**రాజధాని ప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** మండల పరిధిలోని తానేలంక గ్రామంలో పంచాయితీ కార్యాలయం వద్ద నాలుగో విడత చేపడుతున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ముందుగా మా తెలుగు తల్లి గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభించి ప్రతిజ్ఞ, ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు వినిపించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లు, కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను పంపిణీ చేసారు. కొత్తలంక పిహెచ్‌సి ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసారు. అలాగే ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు పట్టణాలతో సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతోముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మారుమూల శివారు ప్రాంతాలు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి ఓ ప్రణాళిక ప్రకారం ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా వృద్ధాప్య పించన్లు ఎన్టీఆర్ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో అండగా ఉంటున్నాయన్నారు. అలాగే డ్వాక్రా మహిళలకు 2వ విడత రుణమాఫీ ఇవ్వడం జరిగిందని, ప్రతీ డ్వాక్రా ప్రతి మహిళకు రూ.6వేలు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గొలకోటి దొరబాబు, ఎంపిపి పితాని సత్యనారాయణ, జెడ్‌పిటిసి శీలం సత్యనారాయణ, ఎంపిడిఓ , ఆయాశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి పాల్గొన్నారు.

## ఘనంగ సావిత్రాభాయి పూలే జయంతి

**రాజధాని ప్రతినిధి,కోనసీమ-జిఎన్.రావ్ :** భారత దేశ తొలి ఉపాధ్యాయిని, సాంఘిక సంస్కర్త సావిత్రిభాయి పూలే జయంతిని ముక్తేశ్వరం కూడలిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైందవ సమాజ మూలాలను ఎదిరించిన వీరవనిత అని ప్రతీ మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తాబత్తుల నాగమణి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చింతా అమ్మాణి, ముత్తాబత్తుల గుణవర్ధనమ్మ, కొట్టాల మంగాయమ్మ, కె జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ధేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి


**ఎమ్మెల్యే పులపర్తి**

**రాజధాని ప్రతినిధి,కోనసీమ-జిఎన్.రావ్ :** నిర్ధేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయడం ద్వారా మరోసారి ప్రజల ఆమోదాన్ని పొందుతామని ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి అన్నారు. జన్మభూమి మా వూరు కార్యక్రమలో భాగంగా పోతుకుర్రు, క్రాప, శంకరాయగూడెం, గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా అవసరాలను గుర్తించి వాటిని ప్రజలకు అందుబాటులో తెస్తుందని ఆయన వివరించారు. ప్రజా రంజకమైన పాలనను ఓర్వలేని వైసిపి అర్థలేని ఆరోపణలను చేస్తుందని ఎద్దేవా చేశారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు, సివిల్ సప్లయి కార్డులు, ఆమ్ ఆద్మీస్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సలాది పుల్లయ్యనాయుడు, జెడ్‌పిటిసి గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ, అయినవిల్లి మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిడిఓ వై లక్ష్మయ్య బాబు, తహశీల్దార్ బి సుస్వాగతం, ఆయాశాఖల అధికారులు సిహెచ్‌శ్రీనివాస్, నేదునూరి వీర్రాజు, సయ్యపురాజు సత్యనారాయణరాజు, తదితరుల పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అమలుకు కృషి

**రాజధానిప్రతినిధి,కోనసీమ-జిఎన్.రావ్ :** ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అమలులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని జెడ్‌పిటిసి నాగిడి నాగేశ్వరరావు అన్నారు.బ్రహ్మసమేధ్యం, పల్లంకుర్రు గ్రామాల్లో సర్పంచ్‌లు సంగాని సూర్యనారాయణ, ఇసుకపట్ల అమ్మాజీ రాంబాబుల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా అధికారులతో ప్రజలకు చేస్తున్న పనితీరును వివరించారు. అర్హులైనవారికి రేషన్‌కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకల కిట్లను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంతోపాటు గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, ఎంపిడిఓ ఎస్ఎస్ శర్మ, తహశీల్దార్ ఎన్ రమేష్, మండల వ్యవసాయ అధికారిణి బి శ్రీవిద్య, మండల జెఇ రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మహిళాశిశు సంక్షేమం హామీలే .. అమలుశూన్యం...!



- అక్కరకు రాని వన్ స్టాప్ సెంటర్లు
- 181 హెల్ప్‌లైన్ ఏదీ..?



**న్యూఢిల్లీ :** మహిళా, శిశు సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. మేనకాగాంధీ నేతృత్వంలోని మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ చాంతాడు పొడవునా హామీలు ఇచ్చినప్పటికీ అమలైన పరిస్థితులు మాత్రం ఎక్కడా కనిపించడంలేదు. సంస్థాపరమైన జాప్యాలు తీవ్రస్థాయిలో కొనసాగుతుండటం ఈ శాఖకు పెద్ద ఎదురుదెబ్బే. ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలల్లోపే మహిళల రక్షణ కోసం పెద్ద ఎత్తున చర్యలంటూ ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదు. లైంగిక నేరాల బాధిత మహిళలకు అండగా ఉండేందుకు నిర్భయ నిధి క్రింద వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ) నిబంధనను 2015వ సంవత్సరంలో ప్రారంభించారు. జిల్లాకొక్కటి చొప్పున 660 కేంద్రాలను దశలవారీగా ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే తొలి దశలో 36 కేంద్రాలను, రెండో దశ 2016, మే నెలలో అదనంగా 150 ఓఎస్‌సీలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ క్రమంలో ప్రతి నెలా ఐదు నుంచి ఆరు కేంద్రాలను ప్రారంభిస్తామని మేనకాగాంధీ తెలిపారు. 2016, డిసెంబరుకు 20 ఓఎస్‌సీలను పూర్తి చేశామన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఒక ప్రశ్నకు సమాధానంగా మహిళా, శిశు మంత్రిత్వ శాఖ వివరించింది. నిర్భయ నిధిక్రింద మరో పథకమైన ఉమెన్ మెల్ప్‌లైన్ అమలు పరిస్థితి కూడా అంతే, బహిరంగ ప్రదేశాల్లో, ప్రైవేటు ప్రాంతాల్లో హింసకు గురయ్యే మహిళందరికీ 24 గంటలు అత్యవసరంగా స్పందించే 181 టోల్‌ఫ్రీ నంబరును దేశవ్యాప్తంగా తీసుకురానున్నట్లు ప్రకటించారు. పార్లమెంటులో సంబంధిత శాఖ వివరించిన సమాచారం ప్రకారం, ఎమెన్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదుల సంఖ్యకు సంబంధించిన వివరాలను తెలియజేసింది.కేవలం ఐదు రాష్ట్రాలు మాత్రమే 200 నెలలక్రితం ప్రారంభించగా 694 ఫిర్యాదులు ఆయా రాష్ట్రాల నుంచి అందాయి. అయితే జాతీయ నేర నమోదు సంస్థ వివరాల ప్రకారం 2015లోనే 1,30,000 లైగిం నేరాలతో పోల్చినపుడు ఫిర్యాదుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం గమనార్హం. హెల్ప్‌లైన్ నిర్వాహణకు రాష్ట్రాలు సరిగా అమలు చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వంగా కూడా ఈ పథకం పై పెద్దగా దృష్టిసారించలేదు. దీంతో అసలు ఇటువంటి పథకాలను ప్రకటించాల్సిన అవసరమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 161 జిల్లాల్లో బాలల నిష్పత్తిల్లో తేడాలను తగ్గించేందుకు మోడీ ఎంతో ఇష్టంగా బేటీ బచావో బేటీ పడావొ ప్రాజెక్టు ప్రతిఫలమేమిటన్నది వచ్చే జనాభా లెక్కింపు సమయంలోగానీ వెల్లడికాదు. 100 జిల్లాలో దీనిని ప్రారంభించగా 2015 -16 ఏప్రిల్ -మార్చి మధ్యలో జన్మించిన లింగ నిష్పత్తిలో మార్పులు 58 జిల్లాల్లో పెరిగినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. మనుషుల అక్రమ రవాణా బిల్లు వంటి కొత్త చట్టాలను మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ తయారు చేసింది. అయితే ఇందులో వేర్వేరు మంత్రిత్వ శాఖలు పాలుపంచుకునే విషయంలో జరుపుతున్న సంప్రదింపులు అసంపూర్తి గానే ఉన్నాయి. హోం, న్యాయ మంత్రిత్వ శాఖలు అభ్యంతరాలు చెబుతున్నాయి. ఫలితంగా శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ఉంచడంలో మేనకాగాంధీ విఫలమయ్యారు. మహిళలకు 12 నుంచి 26 వారాలకు మెటర్నిటి లీవ్‌లు పెంచుతూ మెటర్నిటి ప్రయోజన (సవరణ) బిల్లు ఈ ఏడాది సాధించిన పెద్ద విజయమే. అయితే ఆ బిల్లునూ లోక్‌సభలో ప్రవేశపెట్టలేకపోయారు. ఇదిలాఉండగా, పిల్లల సంరక్షణ మహిళలకు బాధ్యత అని మేనకా గాంధీ పేర్కొనడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. రాజ్యసభలో అను అగా,రజనీ పాటిల్ వంటి ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఇంటర్వ్యూలో మేనకా మాట్లాడుతూ 'పితృత్వ సెలవులనేని కేవలం హాలీడే' వంటివని అనడంపై కూడా విమర్శలు ఎదుర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అనేక మంది మహిళా వినియోగదారులు లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి ఫేస్‌బుక్, ట్విట్టర్ అధికారులను మంత్రిత్వ శాఖ కలిసి చర్చించింది. ఇటువంటి ఫిర్యాదులకు సంబంధించి బాధితులే తనను నేరుగా కలవవచ్చని చెప్పారు. ఈ మేరకు న్యాయ చట్ట సంస్థలు, సామాజిక మాధ్యమ వేదికలతో సమన్వయానికి మంత్రిత్వ శాఖలో సైబర్ సెల్‌ను ఏర్పాటు చేశారు.

# చిరుధాన్యాలతో చలికాలంలో ఆరోగ్యం





ప్రస్తుతం శీతాకాలం చలితో ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఇలాంటి వాతావరణంలో ఆరోగ్యపరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలికాలంలో చిరుధాన్యాలను, ఆకుకూరలను తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రత్యేకించి రాగులు, వరిగలు, మొక్కజొన్నలు, సజ్జలు, నువ్వులు శీతాకాలంలో ఆరోగ్యమైన ఆహారం. మొక్కజొన్నలో కాల్షియం ఉంటుంది. శీతాకాలంలో కండరాలు పట్టేయడం వంటి బాధల నివారణకు జొన్నలు బాగా సహకరిస్తాయి. శీతాకాలంలో శరీరానికి వేడి కావాలంటే రాగిజావ తాగడం ఉత్తమం. రాగిలో ప్రోటీన్లు, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఫాస్ఫరస్ ఉండటం వలన వేడిని కలిగిస్తాయి. చలికాలంలో దాహం ఎక్కువగా లేకపోయినా మంచినీరు తాగడం చాలా అవసరం. అదే విధంగా ఆకు కూరలు కూడా ఆరోగ్యానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్‌లను అందిస్తాయి. ముఖ్యంగా తోటకూర, గోంగూర, బచ్చలకూర, పాలకూరలాంటి ఆకుకూరలను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఆకు కూరల్లో కాల్షియం, ఇనుము ఉంటాయి. ఇవి ఎముకలకు పట్టుత్వాన్ని ఇస్తాయి. ముఖ్యంగా పాలకూరలో ఇనుము, కాల్షియం ఎక్కువగా ఉంటుంది. తోటకూరలో మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. గోంగూర, కరివేపాకును కూడా తీసుకోవడం మంచిది. శీతాకాలంలో గోరువెచ్చని నీటిని తీసుకోవడం ఎంతో అవసరం. ఫ్రిజ్‌లో నీరు, శీతల పానియాలను వాడరాదు. గోరువెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం కలిపి తాగితే చలికాలంలో మలబద్ధకం పోయి ఆరోగ్యంగా ఉండవచ్చు. ఈకాలంలో కొందరికి ఊపిరితిత్తుల సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి వారు ప్రతినిత్యం రెండుమూడుసార్లు ఆవిసెగింజల కషాయం తాగితే దగ్గు, ఆయాసం, గొంతునొప్పిని పోగొట్టి ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఈ రోజుల్లో ఎక్కడ చేసినా బొప్పాయి పండు కనిపిస్తుంటుంది. బొప్పాయి పండును తినడం వలన కడుపునొప్పి, వాంతులు, విరేచనాలను అరికడుతుంది. తాలింపులో ఎక్కువ జీలకర్ర వాడటం శ్రేయస్కరం. దీనివలన శరీరానికి తగిన నీరు లభించి, వేడితోపాటు తేమను కూడా అందిస్తుంది. ఇవేగాక చలికాలంలో చిలకడ దుంపలను ఉడికించి కొద్దిగా మిరియాలపొడి, ఉప్పు చల్లి తీసుకుంటే శరీరానికి శక్తిని సమకూరుతుంది. ఆయుర్వేదం వైద్యంతో అనేక వ్యాధులను తగ్గించుకోచ్చు. ప్రకృతి వాతావరణాన్ని బట్టిలభించే ఆహార పదార్థాలను తినడం శరీరానికి ఆరోగ్యకరం. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని అందరూ గమనించాలి.

**- లక్ష్మి**

## నోట్ల రద్దుపై చత్తీస్‌గఢ్ రైతుల ఆగ్రహం

### ఉచితంగా కూరగాయలు పంచి నిరసన



**రాయ్‌పూర్ :** పెద్ద నోట్ల రద్దు, బ్యాంకుల్లో నగదు లావాదేవీలపై ఆంక్షలపై మధ్య ప్రదేశ్ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ నిర్ణయాన్ని నిరసిస్తూ... తాము పండించిన కూరగాయలను పౌరులకు ఉచితంగా పంచారు. నోట్ల రద్దు, నగదు కొరతతో చిల్లర వ్యాపారం తీవ్రంగా దెబ్బతింది. అదే విధంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాయి గిట్టుబాటు కాదు, కనీసం మద్దతు ధర కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో యువ ప్రగతీశీల్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. రాయపూర్ బుద్ధాతలబ్ సమీపంలోని ధర్నాస్థల్‌కు వంద లాది మంది రైతులు చేరుకున్నారు. దాదాపు 30,000 మందికి లక్ష కిలోల కూరగాయలను పంచి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చత్తీస్‌గడ్ యువ ప్రగతీశీల్ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు హితేష్‌వారు మాట్లాడుతూ, ప్రధాని మోడీ కార్పొరేట్ శక్తుల కోసం పెద్ద నోట్లను రద్దు చేసి రైతులు, పేదలను బలి చేశారని విమర్శించారు.

## నోట్ల రద్దుకు వ్యతిరేకంగా గుజరాత్‌లో రైతు గర్జన

వ్యవసాయరంగం కుదేలు నాలుగు చట్టాల రద్దుకు డిమాండు

**అహ్మదాబాద్ :** వ్యవసాయ రంగాన్ని కుదేలుపరిచిన పెద్ద నోట్ల రద్దును వ్యతిరేకిస్తూ గుజరాత్‌లో రైతులు 20 రోజులు పాదయాత్ర నిర్వహించారు. 450 కిలోమీటర్లు పాదయాత్ర జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పొలాల్లో పనిచేస్తున్న రైతులను కలుసుకొని కష్టనష్టాలను తెలుసుకున్నారు. గుజరాత్ ఖేదత్ సమాజ్, సాగర్ రబారి సభ్యులు పినాకిన్ ధమాలియా, రూపేష్ నాయకత్వంలో వందలాది మంది రైతులు ఈ యాత్రలో పాల్గొన్నారు. యాత్ర గిర్ సోమనాథ్, జునాఘడ్, రాజ్‌కోట్, బోటాడ్,అహ్మదాబాద్ జిల్లాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా రైతులు తెలియ జేసిన బాధలను, డిమాండ్లను సాగర్ రబారి రికార్డు చేశారు. యాత్ర గిర్ సోమనాథ్ జిల్లాలోని వెరావల్ నుంచి ప్రారంభమై, గాంధీనగర్‌కు చేరుకున్న తర్వాత ముఖ్యమంత్రిని కలుసుకొని డిమాండ్లపై మెమోరాండం ఇచ్చేందుకు రైతులను పోలీసులు అనుమతించలేదు. దీంతో రైతులు తమ విజ్ఞాపన పత్రాన్ని అధికారులకు అందజేశారు. ముఖ్యమంత్రి విజయ్‌రూపాని త్వరలో రైతులకు అపాయింట్‌మెంట్ ఇస్తారని పోలీసులు చెప్పారు. నిరసన యాత్రలో పాల్గొన్న వారిని ఆయా ప్రాంతాలలో రైతులు కలుసుకొని ప్రధాని నరేంద్ర మోడీ పెద్దనోట్లను రద్దు చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. తాము పండించిన పండ్లు, కూరగాయల ధరలు కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదని తెలిపారు. రైతు వ్యతిరేకమైన

నాలుగు చట్టాలను రద్దు చేయాలని, తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇప్పించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. భూసేకరణ (సవరణ) చట్టం - 2015, ఎస్ఐఆర్ (ప్రత్యేక ప్రాంతీయ పెట్టుబడి చట్టం - 2009 లో గుజరాత్‌లో చేసిన చట్టం), ఇరిగేషన్ మరియు డ్రైనేజీ చట్టం, పట్టణాభివృద్ధి ప్రణాళికా చట్టాలను రద్దు చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. రైతు రుణాలను పూర్తిగా రద్దు చేయాలని కోరుతున్నారు. అలాగే కనీసం మద్దతు ధరను రెట్టింపు చేయాలని, ప్రతి ఐదు గ్రామాలకు ఒక శీతల గిడ్డంగిని నిర్మించాలని, కల్పసర్ ప్రాజెక్టుపై శ్వేత పత్రం విడుదల చేయాలని తదితర డిమాండ్లను విజ్ఞప్తి పత్రంలో పొందుపరిచారు. తక్షణం వ్యవసాయ విధానాన్ని ప్రకటించాలని, రైతులకు 24 గంటలూ విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆ పత్రంలో పేర్కొన్నారు.

## పేదల మనోభావాలను టీడీపి ఎప్పుడూ గౌరవించలేదు - సీపీఐ

**రాజధానిప్రతినిధి,కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** నగర పంచాయతీ 19,20వార్డులకు సంబంధించి మట్టడి పాలెం సత్తెమ్మ గుడివద్ద ఛైర్‌పర్సన్ చెల్లి శాంతి అశోక్ ఆధ్వర్యంలో కమిషనర్ పి. రవివర్మ ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు గ్రామసభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటర్నిటీ , హెల్త్‌క్యాంపులు నిర్వహించారు. అలాగే మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి , గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలునిర్వహించారు. అయా వార్డుల సమస్యలపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలపై మాట్లాడేందుకు సిపిఐ నాయకులకు అవకాశం ఇవ్వకుండా నిరాకరించారు. దీనిపై ఎఐటియుసి నాయకులు వనచర్ల వెంకటరావు స్పందించి మాట్లాడుతూ స్థానిక టీడీపి నాయకులు ప్రోద్భలంతో కమిషనర్ పేదల సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు, రైతులు , మధ్యతరగతి ప్రజల మనోభావాలను టీడీపి ఎప్పుడూ గౌరవించలేదని, ఇది ప్రజా స్వామ్యానికే విరుద్ధమన్నారు. రానున్న రోజుల్లో టీడీపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ డి. మహాలక్ష్మి, కౌన్సిలర్లు యల్లమిల్లి సీతాలక్ష్మి, పిల్లి నాగరాజు, ములపర్తి బాలకృష్ణ, దొమ్మేటి రమణకుమార్, వీరాస్వామి, సిపిఐ నాయకులు శీలం వెంకటేశ్, కాండ్రేగుల కృష్ణారావు, కాండ్రేగుల సత్యనారాణ, చప్పిడి శ్రీరాములు, మట్టపర్తి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


# మద్యం మత్తులో రాక్షస క్రీడ

పోలీసుల సమక్షంలోనే యువతులపై సామూహితక లైంగిక దాడి



**బెంగుళూరు :** కొత్త సంవత్సర వేడుకల్లో మహిళలు, యువతులపై సామూహిక లైంగిక దాడి జరిగింది. బెంగుళూరు నగరం నడిమధ్యన డిసెంబరు 31 వ తేదీన అర్ధరాత్రి మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో సంబరాలు జరుపుకుంటున్నారు. ఇదే అదునుగా మద్యం మత్తులో ఉన్న కొంతమంది యువకులు మహిళలు, యువతులపై సామూహికంగా లైంగిక దాడులకు తెగబూనారు. అక్కడ పోలీసుల సమక్షంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. పోలీసుల నిర్లక్ష్యంపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతుండగా, ఈ ఘటన 'పాశ్చాత్య పోకడ'లను తెలియజేస్తోందని యువతకు విమర్శిస్తూ రాష్ట్ర హోం మంత్రి వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. అయితే జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ లలితా కుమార మంగళం స్పందిస్తూ హోం మంత్రి పరమేశ్వర వ్యాఖ్యాలను, పోలీసుల నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. ఈ ఘటనలపై పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం నుంచి వేర్వేరు నివేదికలను రాష్ట్ర మహిళా కమిషన్‌తో పాటు ఎన్‌సీడబ్ల్యూ కోరింది. పోలీసులు మాట్లాడుతూ కొత్త సంవత్సరం వేడుకల కోసం వేలాది మంది గుమికూడిన ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డుల కూడళ్లలో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుందని, నిందితులకు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. జన సమూహాన్ని నియంత్రించేందుకు 1,500 పోలీసులను మోహరించామన్నారు. డిసెంబరు 31 అర్ధరాత్రి ధనికులు నివసించే ఈ ప్రాంతానికి దుండగులు వచ్చి మహిళలు, యువతులపై లైంగిక దాడులకు పాల్పడ్డారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. అయితే మహిళా పోలీసుల రక్షణ సాయం కోరడం మినహా యువతులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని, ఈ సందర్భంలో తమ స్నేహితురాళ్లతో కలిసి వచ్చిన కొంతమంది పురుషులు దుండగులు బారి నుంచి వారిని కాపాడటం కష్టమైందని సాక్షులు వివరించారు. హోం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ' ఇది మంచిది కాదు. ఈ సంఘటనను తప్పకుండా పరిశీలిస్తాం, పునరావృతం కాకుండా చూస్తాం' అని చెప్పారు. ఒక టీవీ చానల్‌తో మాట్లాడుతూ 'ఎంజీ రోడ్డు , బ్రిగేడ్ రోడ్డు, కమర్షియల్ స్ట్రీట్‌ల్లో న్యూ ఇయర్ వంటి రోజుల్లో ఏం జరుగుతుంది. పెద్ద సంఖ్యలో యువత గుమ్ముకూడతారు. వీరంతా దాదాపు పాశ్చాత్య పోకడలతో వ్యవహరిస్తారు. వస్త్రధారణ కూడా అదేవిధంగా ఉంటుంది.' అని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై ఎన్‌సీడబ్ల్యూ తీవ్రస్థాయిలో విమర్శిస్తూ అటువంటి వ్యాఖ్యలు చేసినందుకు దేశ మహిళలకు క్షమాపణ చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండు చేసింది.'హోం మంత్రి వ్యాఖ్యలు ఆమోదనీయం కాదు. మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి. మహిళలకు మంత్రి క్షమాపణ చెప్పాలి' అని కుమార మంగళం పేర్కొన్నారు. అయితే కొత్త సంవత్సర వేడుకల్లో భారీ సంఖ్యలో బలగాలతోపాటు అనేక చోట్ల సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా ఆవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నగర సాయుధ బలగాలతోపాటు కర్నాటక రాష్ట్ర రిజర్వు పోలీసులు పర్యవేక్షించారని పోలీసులు తెలిపారు. 'దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం ' అని కర్ణాటక డీజీపీ ఓం ప్రకాష్ తెలిపారు. ఇదిలా ఉండగా లైంగిక దాడులకు సంబంధించి మహిళలెవరి నుంచి తమకు ఫిర్యాదులు రాలేదని పోలీసులు వివరించారు. ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ కుమార మంగళం మాట్లాడుతూ ఈ ఘటనను తాము సుమోటోగా స్వీకరిస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు ప్రధానధికారి, హోం మంత్రికి నోటీసులు పంపించామన్నారు. వెంటనే సమాధానం చెప్పాలని, సంతృప్తికరంగా లేకపోతే ఒక బృందాన్ని పంపి విచారణ జరుపుతామని పేర్కొన్నారు. కర్ణాటక మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మీ పీటీఐతో మాట్లాడుతూ ఘటనకు సంబంధించి పోలీసుల నుంచి నివేదిక కోరామన్నారు. తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని రాత్రి 2 గంటల వరకు పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లు తెరిచి ఉంచేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు.

## 2016లో ఇరాక్‌లో ఉగ్రదాడులకు 7వేలమంది బలి



**బాగ్దాద్ :** ఇరాక్‌లో టెర్రరిజం, సాయుధ సంఘర్షణలవల్ల 2016లో 7వేల మంది పౌరులు బలయ్యారని ఐక్యరాజ్యసమితి తెలియ జేసింది. ఉనామి అనే సంస్థ ఉగ్రదాడులను, ఆ దాడుల్లో గాయపడిన, మృతిచెందినవారి సంఖ్యను నమోదు చేసింది. 2016లో 19266మంది పౌరులు గాయపడ్డారు. వీరిలో 6878 మంది చనిపోగా, 12388 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారని ఐక్యరాజ్యసమితి సహాయ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. గత సంవత్సరం మే, జులై,ఆగస్టు, డిసెంబర్ నెలల్లో గాయపడినవారి సంఖ్య ఆరోగ్యశాఖ వెల్లడించనందువల్ల వారి సంఖ్యను ఇందులో చేర్చలేదు.గత నెలలోనే 385 మంది పౌరుల చనిపోయారు. చనిపోయిన పోలీసుల సంఖ్య ఇంకా వెల్లడించలేదు. నవంబరులో దాదాపు 1000 మంది, అక్టోబరులో 1000 మందికిపైగా పౌరులు మృతిచెందారు. డిసెంబరులో గాయపడిన వారి సంఖ్య 1060 అని ఇరాక్ వ్యవహారాల ఇన్‌ఛార్జి జాన్‌కుబిస్ తెలిపారు. సంవత్సరం చివరికి వచ్చేటప్పటికి ఉగ్రదాడులు పెరిగాయి. తాజాగా బాగ్దాద్ మార్కెట్ వద్ద జరిగిన ఆత్మాహుతి ఉగ్రదాడిలో35 మంది చనిపోగా 60 మంది గయాపడ్డారు. నగరంలో మరోచోట కారుబాంబు పేలి 7గురు మృతిచెందారు. అలాగే జవదీర్ ఆసుపత్రి సమీపంలో జరిగిన పేలుడులో 11 మంది చనిపోయారు. ఇవన్నీ ఉగ్రవాదులు జరిపిన దాడులేనని కుబిస్ తెలిపారు. 2014 మధ్యకాలంనుంచి ఇరాక్ హింసాయుత ఘటనలతో తల్లడిల్లిపోతోంది. ఐఎస్ ఉగ్రవాదులు దేశంలోని విశాల ప్రాంతాలను తమ స్వాధీనంలో ఉంచుకొని దాడులకు పాల్పడుతున్నారు. 2003లో అమెరికా ఇరాక్‌పైన దాడి జరిగినప్పటినుంచి దేశంమంతటా ఏర్పడిన కల్లోల పరిస్థితులు ఇంకా తగ్గనేలేదు.

# ఆర్బీఐ స్వయం ప్రతిపత్తిని కోల్పోతుందా?

- ఆందోళన చెందుతున్న ఆర్థిక నిపుణులు
- పెరిగిన పాలకుల జోక్యం




**స్పెషల్ కరస్పాండెంట్ :** ఇటీవలి కాలంలో కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ జోక్యం పెరగడంతో ఆర్బీఐ స్వయంప్రతిపత్తి ప్రమాదంలో పడిందని పలువురు ఆర్థికవేత్తలు, నిపుణులు ఆందోళన చెందుతున్నారు. సెంట్రల్ బ్యాంకర్లు సాదారణంగా అన్ని విషయాలలో తామే మాస్టర్లమని భావిస్తుంటారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత ఆర్థిక రంగ చరిత్రలో ఈ అంశం ఏ సమయంలోను రుజువు కాలేదు. సెంట్రల్ బ్యాంకర్లు ప్రత్యేకించి పశ్చిమ దేశాలు అభివృద్ధి చెంతుదున్న ఆర్థిక వ్యవస్థలలో అసంబద్ధమైన విధానాలను అనుసరించడం పెరిగింది. బ్యాంకర్లు అనుసరించిన విధానాల వల్ల ఈ దేశాలో ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా కాపాడలేకపోయారు. అభివృద్ధి చెందిన దేశాలలో సెంట్రల్ బ్యాంకుల పైన రాజకీయ పెత్తనం పెరిగింది. వారి అజమాయిషీ, క్రమబద్ధీకరణ అధికారులు అధికమయ్యాయి. ఇప్పుడు సెంట్రల్ బ్యాంకులు తమ ప్రభావాన్ని పెంచుకునేందుకు ఆర్థిక విధానాలను రూపొందిచడంలో సహకరించేందుకు తమకున్న అధికారాలకు మించి ప్రయత్నిస్తున్నాయి. అనేక దేశాలలో సెంట్రల్ బ్యాంకులు ద్రవ్యపరమైన పున:పంపిణీ కార్యకలాపాల పైన తమ ప్రభావాన్ని పెంచుకునేందుకు ప్రయతిస్తున్నాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకులో కూడా జరిగింది. ఇదే ఆయా దేశాలలో పన్ను చెల్లింపుదారులు, లబ్ధిదారులకు ప్రభుత్వం చేయవలసిన వ్యయాన్ని పున:పంపిణీ చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రత తగ్గిన తర్వాత సంప్రదాయ లేదా సంప్రదాయేతం ద్రవ్య విధానం చాలా పేలవం గా ఉంది. కొన్ని సమయాలలో జీరో శాతమే. చాలా సెంట్రల్ బ్యాంకులు తాము ధరలు ఆర్థిక మార్కెట్లలో అవసరమైన కరెన్సీని నిర్ణయించగలమన్న భ్రమలో ఉన్నాయి. ఇవి అనేకసార్లు సమాచారాన్ని అందించడంలోను, సరైన మార్గదర్శనంలో విఫలమవుతున్నాయి. మార్కెట్లలో డిమాండ్ పెంచగలమని తమను తాము ఎక్కువగా ఊహించుకుంటున్నాయి. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల మధ్య సమన్వయం కుదురపడడంలోను సెంట్రల్ బ్యాంకులు పూర్తిగా విఫలమవుతున్నాయి. ఉదాహరణకి ప్రపంచంలో రిజర్వ్ కరెన్సీ కలిగిన అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా విస్తరిస్తున్న మార్కెట్లలో ప్రముఖ సెంట్రల్ బ్యాంకుల మధ్య సమన్వయం కుదర్చలేకపోయింది. విధానపరమైన తప్పులు చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థలో సెంట్రల్ బ్యాంకులపై గణనీయంగా విశ్వాసం సడలిపోతుంది. అప్పుడవి కేవలం సమాచారాన్ని ఆర్థిక మార్కెట్లకు అందజేస్తూ మౌనంగా ఉండిపోతాయి. అయితే సమర్థవంతమైన సమాచారం అందిస్తే సరిపోతుంది. మార్కెట్లలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం భారతదేశంలో పెద్ద నోట్ల రద్దు ఆర్థికవ్యవస్థపై కలిగించే ప్రభావాన్ని విశ్లేషకులు అంచనా వేయలేకపోతున్నారు. కార్పొరేట్ రంగం ఆదాయం పైన వినియోగదారుల సెంటిమెంట్, అలాగే క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. ఈ దశలో సెంట్రల్ బ్యాంకు తగిన కార్యాచరణను ప్రకటించాలి. అయితే అది మౌనంగా ఉంటూ తీవ్ర గందరగోళ పరిస్థితిలో ఉంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో మౌనం సెంట్రల్ బ్యాంకు కు శత్రవు లాంటిదే. అ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు, ఆ బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ నోట్ల రద్దు వల్ల కలిగిన ప్రజల కష్టాలను తీర్చేందుకు తగిన కార్యాచరణకు చేపట్టాలి. లేనట్లయితే అది ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది.

# 'సైకిల్' గుర్తు మాదే

- 90 శాతం ప్రజల మద్దతు ఉంది
- నిజమైన సమాజ్‌వాది మాదే
- ఎన్నికల సంఘానికి విన్నవించిన అఖిలేష్ వర్గం



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్ అధికార పార్టీ సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ)లో సంక్షోభం కొనసాగుతూనే ఉంది. పార్టీ ఎన్నికల గుర్తు 'సైకిల్' తమదేనని ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ శిబిరం ఎన్నికల సంఘం (ఈసీ)కి విన్నవించింది. ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం కాదని, ప్రస్తుతం పార్టీ తమ నాయకత్వంలో నడుస్తోందని అఖిలేష్ వర్గం ఈసీకి వివరించింది. ఇదిలాఉండగా ఈసీ ప్రధాన కార్యాలయం నిర్వచన్ సదన్‌కు ములాయంసింగ్ స్వయంగా వెళ్లి పార్టీకి తన నాయకత్వమే కొనసాగుతున్నట్లు ఎన్నికల సంఘానికి తెలిపారు. ఎస్పీ నిబంధనలకు విరుద్ధంగా అసమ్మతి వర్గం ద్వారా తన కుమారుడు అఖిలేష్ అధ్యక్షుడు అయ్యాడని వివరించారు. అఖిలేష్ అనుకూల వర్గం నాయకులు రాంగోపాల్ యాదవ్, నరేష్ అగర్వాల్, కిరణ్మయో నందాలు ఎన్నికల సంఘం అధికారులను కలిసి ఎస్పీ తమ నాయకత్వంలో ఉందని, సైకిల్ గుర్తు కూడా తమదేనని చెప్పారు. ములాయంచే పార్టీ నుంచి బహిష్కృతులైన ఈ ముగ్గురు అఖిలేష్ తరపున ఈసీని కలుసుకున్నారు. '90 శాతం మంది ప్రజలు మాకే మద్దతు ఇస్తున్నందున నిజమైన సమాజ్‌వాది పార్టీ మాదే' అని కుటుంబలో అఖిలేష్‌కు మద్దతుగా నిలిచిన, ములాయం సోదరుడు రాంగోపాల్ యాదవ్ ఈసీతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. తమ గుర్తు, పార్టీ విషయంపై ఈసీకి తెలియజేశాం, ప్రస్తుతం బంతి ఎన్నికల సంఘం కోర్టులో ఉందన్నారు. కాగా ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల తేదీలను ఏ రోజైనా ప్రకటించే అవకాశం ఉన్నందున ఈ సమస్యను పరిష్కరించడానికి ఈసీకి తక్కువ సమయమే ఉంది. అయితే మధ్యంతరం చర్యల్లో భాగంగా సైకిల్ గుర్తును ప్రస్తుతం నిలిపివేసే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఎన్నికల వరకు రెండు వర్గాలు కొత్త పేరుతో, కొత్త గుర్తులపై పోటీ చేయాలని కోరవచ్చు.

అటు తర్వాత సమాజ్‌వాది పార్టీ, సైకిల్ గుర్తుకు ఎవరు అధీకృతులనే విషయాన్ని తేల్చేందుకు తుదిగా ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా ఢిల్లీలో ఉన్న ములాయం సింగ్ యాదవ్ తన అత్యంత సన్నిహితుడు ఆజంఖాన్‌తో కలిసి లక్నో వెళ్లిపోయారు. ఖాన్ మాట్లాడుతూ స్నేహ సంబంధాల పునరుద్ధరణకు ఆయన ఏదొకటి చేయవచ్చన్నారు. 'ఏదైనా జరగవచ్చు. పార్టీ నుంచి బహిష్కరణలను రద్దు చేయవచ్చు' అని ఇక్కడ విలేకరులతో తెలిపారు. పార్టీలో సంక్షోభం తలెత్తిన సమయంలో ములాయంకు సన్నిహితుడు అమర్ సింగ్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుడగా, పార్టీకి ముస్లిం నాయకుడిగా ఉన్న ఆజంఖాన్ ప్రజల్లో తటస్థంగా వ్యవహరిస్తున్నారు. ఆజంఖాన్ మాట్లాడుతూ రెండు శిబిరాల మధ్య పరిస్థితులు సరిదిద్దే అవకాశం ఉందని, ఇరు శిబిరాలు ఏకంకావచ్చని చెప్పారు. ఈ ప్రచ్ఛన్న యుద్ధం ముస్లిం ఓటర్లపై ప్రభావం చూపదా అనే ప్రశ్నకు ఆజంఖాన్ మాట్లాడుతూ ఎస్పీ ప్రభుత్వం అధికారంలో నుంచి వెళ్లిపోవాలని వారు ఎప్పటికీ కోరుకోరని, బీజేపీని అధికారంలోకి రానీయకుండా పని చేస్తారన్నారు. ప్రత్యర్థి శిబిరం ములాయంను తొలగించడంపై ప్రశ్నించగా ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు తనకు తెలియవని పేర్కొన్నారు. పార్టీ గుర్తు సైకిల్ తమదేనంటూ రెండు కర్గాలు ఈసీని కలిసి విజ్ఞప్తి చేశాయి. అయితే దీనిపై తుది ఆదేశం ఇవ్వడానికి నాలుగు నెలల సమయం పడుతుందని ఎన్నికల సంఘం వర్గాలు తెలియజేశాయి.

## ములాయంను కలిసిన అఖిలేష్

**లక్నో :** అధికార పోరు తీవ్రమైన సమయంలో ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తన తండ్రి ములాయం సింగ్ యాదవ్‌ను ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. ముఖ్యమంత్రి వెనక్కి తగ్గడం ద్వారా ప్రత్యర్థి శిబిరాలు రెండూ ఏకం కావచ్చన్న ఊహాగానాల నేపథ్యంలో తండ్రీకొడుకుల కలయిక చర్చనీయాశంమైంది. అసమ్మతి శిబరం నుంచి సమావేశానికి సంబంధించి ఎటువంటి అధికారం ప్రకటన రాలేదు. అయితే అఖిలేష్ సన్నిహితులైన కొంతమంది సీనియర్ నాయకులు మాత్రం అలాంటిదేమీ లేదని, ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని తెలిపారు. 'సైకిల్' గుర్తు తమదే నంటూ పేర్కొంటూ ఎన్నికల సంఘానికి వివరించి ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత అఖిలేష్ ఇక్కడ ములాయంనివాసానికి వచ్చారు. తండ్రీకొడుకులు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. అటుతర్వాత ములాయం సోదరుడు శివపాల్ యాదవ్ కూడా వీరితో కలిశారు. విమానాశ్రయం వద్ద ఈ సమావేశానికి సంబంధించి అడిగినపుడు శివపాల్ మాట్లాడుతూ సమావేశం గురించి తనకు తెలియదన్నారు. నేతాజీ (ములాయం) పిలిస్తేవెళతానని చెప్పారు. కాగా సమావేశం తర్వాత సీనియర్ పార్టీ నాయకుడు, అఖిలేష్‌కు సన్నిహితుడొకరు పీటీఐతో మాట్లాడుతూ ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది. ఏ పరిష్కారానికి అవకాశం లేదు. ఎస్పీకి చెందిన సైకిల్ ఎవరిదనేది ఈసీ నిర్ణయిస్తుందన్నారు.

# శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహనే లక్ష్యం

- నేడు చిల్డ్రన్, ఉమెన్ సైన్స్ కాంగ్రెస్‌లు ప్రారంభం
- దేశవ్యాప్తంగా వెయ్యి మంది బాలల రాక



**రాజధాని ప్రతినిధి-తిరుపతి :** ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ఈ నెల 4వ తేదీ 'చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్'ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. చిన్నారుల్లో సైన్స్‌పై అవగాహన, శ్రద్ధ, భాగస్వామ్యం పెంపొందించాలన్న లక్ష్యంతో పాఠశాల విద్యతో పాటు శాస్త్రీయ వేదికను ఉపయోగిస్తున్నారు. పిల్లల ఆలోచన దృక్పథం వారి ఆసక్తిని బహిర్గతం చేసేందుకు దోహదపడం, వారికి సైన్స్ రంగాల్లో అవకాశాలు, ఆవిష్కరణలను వివరించనున్నారు. దేశ వ్యాప్తంగా 10-17 సంవత్సరాలలో 1000 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రదర్శనశాలలు సిద్ధం చేవారు. వీటితో పాటు క్విజ్, సైన్స్ చిత్రాల ప్రదర్శన, ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయ మంత్రి వై. సుజనాచౌదరి, రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వి. నారాయణరావు, ప్రముఖ శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ ముఖ్య సాంకేతిక సలహాదారులు డాక్టర్ ఆర్. చిదంబరం, డీఆర్డీవో కార్యదర్శి డాక్టర్ అశుతోష్ శర్మ నోబుల్ అవార్డు గ్రహీత ఆచార్యతకాకి కజితా, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వి. దుర్గాభవాని, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఆవు దామోదరం హాజరుకానున్నారు.

**6వ మహిళా సైన్స్ కాంగ్రెస్**

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా 6వ మహిళా సైన్స్ కాంగ్రెస్‌కు ఎస్వీయూ ఆతిథ్యం ఇవ్వనుంది. జాతీయ అభివృద్ధిలో మహిళా శాస్త్రవేత్తల పాత్ర, శాస్త్ర-సాంకేతిక రంగాల్లో మహిళలకు అవకాశాలు అనే అంశాలపై చర్చలు జరగనున్నాయి. సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న కార్యక్రమంలో డీఆర్డీవో డైరెక్టర్ డాక్టర్ థేస్సీ థామస్, ఐఐఎస్‌సీ, బెంగళూరు ప్రతినిధి ఆచార్య హెచ్. ఎస్. సావిత్రి, ఎన్ఐసీ న్యూఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ నీతావర్మ, డీఆర్డీవో కార్యదర్శి డాక్టర్ అశుతోష్ శర్మ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఆవుదామోదరం, డైరెక్టార్ ఆచార్య మచ్చా భాస్కర్, రిజిస్ట్రార్ ఆచార్య మేడసాని దేవరాజులు, సదస్సు సమన్వయకర్త ఆచార్య డి. ఉషారాణి, సహాయ సమన్వయకర్తలు ఆచార్య డి. భారతి, ఆచార్య రమాశ్రీ పాల్గొననున్నారు.

# అత్యాచారం కేసులో దోషికి యావజ్జీవం

**బెజవాడ కోర్టు సంచలన తీర్పు**

**రాజధాని ప్రతినిధి-విజయవాడ (గవర్నర్) :** అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. విజయవాడలో కొందరు యువకులు బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డారు. మత్తుమందు ఇచ్చి వారి వద్ద ఉన్న నగదు, నగలు దోచుకున్నారు. సెల్ ఫోన్లలో అసభ్యదృశ్యాలను చిత్రీకరించారు. ఈ ఘటనలపై 2014 ఆగష్టు 23న విజయవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఏ1 నిందితుడు నిమ్మకూరి సాయిరామ్‌కు ప్రత్యేక న్యాయస్థానం జీవితఖైదు విధించింది. మిగిలిన నిందితులు దీపక్, అభిలాష్‌కుమార్, అబ్దుల్ ఖాదర్‌లకు 20ఏళ్ల చొప్పున, దుర్గాప్రసాద్‌కు ఎనిమిదేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఇదే కేసులో ఉన్న ఆరో నిందితుడు మైనర్ కావడంతో అతని కేసు జువనైల్ కోర్టుకు బదిలీ అయింది. అప్పటి విచారణాధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

## ముక్కోటికి ముస్తాబవుతున్న మంగళగిరి



**రాజధాని ప్రతినిధి ,(మంగళగిరి) :** ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించేందుకు మంగళాద్రి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం ముస్తాబవుతోంది. ఈ నెల 7,8 తేదీల్లో ఇక్కడ వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహించనున్నారు 7వ తేదీ రాత్రి స్వామివారిని జగన్మోహిని రూపంలో అలంకరించి పుష్పక విమానంపై ఊరేగిస్తారు. అదే రోజు అర్ధరాత్రి దాటిన తరువాత తిరువంజనోత్సవం నిర్వహిస్తారు. 8వ తేదీ తెల్లవారుజామున నాలుగు వంజనోత్సవం నిర్వహిస్తారు. 8వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి శ్రీ స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి బంగారం గరుడ వాహనంపై ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారిని దర్శించిన భక్తులకు బంగారు దక్షిణావృత శంకుతీర్థం ప్రసాదిస్తారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ముక్కోటి సందర్భంగా జాగరణ, భజన కార్యక్రమాలు వుంటాయి. స్వామివారు దర్శనమిచ్చే ఉత్తర ద్వారం వైపు, తూర్పు రాజగోపురం ముందు, ఉత్సవ గ్రౌండులో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు శంకుతీర్థం స్వీకరించేందుకు దేవస్థానం ఆ వరణలో తాత్కాలిక క్యూలైన్లు నిర్మిస్తున్నారు. మంగళాద్రి క్షేత్రం ఇప్పటికే ముక్కోటి శోభను సంతరించుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి మండెపూడి పానకాలరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## చేనేత కార్మికుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** చేనేత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిందని విజయవాడలోని కేంద్ర ప్రభుత్వ సమాచారశాఖ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 1800-208-9988 టోల్ ఫ్రీ నెంబరుకు వారంలో ఏడురోజుల పాటు రోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 6గంటలవరకు అందుబాటులో ఉంటుంది. దేశంలోని అన్ని ప్రాంతాల చేనేత కార్మికులు దీనిని వినియోగించుకోవచ్చు. ముడిసరుకు లభ్యత, నాణ్యత, మార్కెటింగ్, సాంకేతికత, రుణసౌకర్యం, చేనేత కార్మికులకు సంబందించిన పథకాలు తదితరాలను గురించి తెలుసుకోవచ్చు. బంకర్ మిత్ర పేరిట ఈ హెల్ప్‌లైన్ పనిచేస్తుంది. సాంకేతికత, యువత, సంప్రదాయం అనే మూడు అంశాలతో చేనేతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భూసేకరణ చట్ట సవరణపై అఖిలపక్షం వేయండి

**సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ**



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** భూసేకరణ చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నందున తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. పార్లమెంటులో ఆమోదం పొందిన భూసేకరణ చట్టం-2013లో సవరణలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ చేపట్టడం వలన సాగుభూములు, నివేశనాస్థలాలు కోల్పోయి నిర్వాసితులైన వారికి సరైన నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల ఫ్యాక్టరీల ఏర్పాటుకై అవసరానికి మించి భూమిని కేటాయించడంతో ఆయా ప్రాంతాలలో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన విషయం మీకు విదితమే. భూసేకరణ చట్టటంలో మార్పులు చేయడం ద్వారా సాగుభూములను సైతం కార్పొరేట్ సంస్థలకు, పరిశ్రమలకు కట్టబెట్టే యోచన చేయడం సరైందికాదు. భూసేకరణ చట్టంలో సవరణలు చేయదలచినప్పుడు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తద్వారా అభిప్రాయాలు,సూచనలు, ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవటం మంచిదని భావిస్తున్నాము. దేశ వ్యాపితంగా నిర్వాసితులు జరిపిన పోరాటాల ఫలితంగా భూసేకరణ చట్టం-2013 పార్లమెంటులో ఆమోదించారు. గతంలో అమలులో ఉన్న భూసేకరణ చట్టం 1894 వలన నిర్వాసితులు లక్షల సంఖ్యలో తీవ్రంగా నష్టపోయారు. ఫలితంగా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో నిర్వాసితుల ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్వాసితులకు అన్యాయం జరుగకుండా చూడటానికి నూతన చట్టాన్ని 2013లో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ చట్టం వలన భూములు కోల్పోతున్న రైతులనే కాకుండా వారిపై ఆధారపడి జీవిస్తున్న ఇతర బడుగువర్గాల వారికి కూడా రక్షణ కల్పించినట్లయింది. అయితే దురదృష్టవశాత్తూ అటు తెలంగాణాలోను, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రభుత్వాలు భూసేకరణ చట్టం-2013కు తూట్లు పొడిచే విధంగా సవరణలకు పూనుకోవడం శోచనీయం. పై విషయాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం సవరణలు జరపే క్రమాన్ని విరమించుకోవాలని కోరుతున్నాము. ఈ అంశాలపై చర్చించడానికి తక్షమే అఖిలపక్ష సమావేశాన్ని రామకృష్ణ కోరారు.

# నేడే మారథాన్

**కలెక్టర్ కాంతిలాల్ దండే**




**రాజధాని ప్రతినిధి,(గుంటూరు) :** విజయవాడలో ఈ నెల 8వ తేదీన అమరావతి మారథాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసామని, జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే పిలుపునిచ్చారు. మారథాన్ నిర్వహణపై స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిలయన్స్ జియో సహకారంతో డీప్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ అమరావతి మారథాన్‌ను నిర్వహిస్తోందన్నారు. గత సంవత్సరం నిర్వహించిన మారథాన్‌లో సుమారు 10 వేల మంది పాల్గొన్నారని, వారిలో గుంటూరు నుంచి సుమారు 4000 మంది పాల్గొన్నారని, ఈసారి ఇంకా ఎక్కువ మంది పాల్గొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియం నుండి ఉదయం5 గంటలకు ప్రారంభమై ప్రకాశం బ్యారేజి మీదుగా వెంకటపాలెం వద్ద ఉన్న మంతెన సత్యనారాయణ రాజు ఆసుపత్రి వరకు వెళ్ళి తిరిగి ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటుదన్నారు. ఈ మారథాన్ కార్యక్రమంలో 3కె,5కె,10కె,12కె కేటగిరీలుగా ఉంటాయని, పాల్గొన్న వారందరికి టీ-షర్టు, స్నాక్స్ ఏర్పాటు చేస్తారన్నారు. గుంటూరు అర్బన్ ఎస్పీ సర్వశ్రేష్ట త్రిపాఠి మాట్లాడుతూ మారథాన్‌లో ఎక్కువ సంఖ్యలో పాల్గొన నూతన రాజధాని అమరావతికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రిలయన్స్ జియో ఆంధ్రప్రదేశ్ సీఈవో ఎం.మహేస్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన సమాజానికి మారథాన్ కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. గుంటూరు. జిల్లా శలపాడు గ్రామవాసి, దాదాపు దేశవ్యాప్తంగా 50 మారథన్‌లలో పాల్గొన్న కిరణ్మయి మాట్లాడుతూ మారథాన్‌లో పాల్గొని మరింతమందికి స్ఫూర్తి నివ్వాలని కోరారు. అనంతరం మారథాన్‌కు సంబంధించిన టీషర్టును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదికారి కె.నాగబాబు, జడ్పీ సీఈఓ ఎన్. వెంకటసుబ్బయ్య, డిఈఓ కె.వి శ్రీనివాసులురేడ్డి, డీప్ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 2018 నాటికి 'పోలవరం' పూర్తికి కృషి

**ఎంపీ కేశినేని శ్రీనివాస్**



**రాజధాని ప్రతినిధి- కంచికచర్ల :** పోలవరం జాతీయ ప్రాజెక్టును 2018 నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేసినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. నాలుగో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని మండలంలోని గండేపల్లిలో నిర్వహించారు. ఎంపీడీవో కె. అనూరాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు విడుదల చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వీటితో ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తిరవుతాయని చెప్పారు. గుంటూరు జిల్లా రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 36 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధిని వైఎస్ జగన్, కాంగ్రెస్ పార్టీలు అడ్డుకుంటున్నా సీఎం ముందుకు సాగుతున్నారని తెలిపారు. సందిగామ నియోజకవర్గంలో దేవినేని వెంకట రమణ చేపట్టిన పనులు చిరస్మరణీయంగా ఉన్నాయన్నారు. ఆయన చేపట్టిన పనులు ఎత్తిపోతల పథకాలు రైతులకు శ్రీరామరక్షగా నిలిచాయన్నారు. గండేపల్లి ప్రాంతంలోని సెంటినీ ఫ్యాక్టరీవల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రజల వద్దకు పరిపాలన నినాదంతో ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలకు వెళ్లి సమ్యసలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## నోబెల్ అవార్డు గ్రహీతలకు బంగారు పతకాలు

**రాజధాని ప్రతినిధి-తిరుపతి :** ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు తీసుకొచ్చిన నోబెల్ అవార్డు గ్రహీతలకు 104వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వేదికపై ప్రధామంత్రి నరేంద్రమోడీ 'ఇస్కా బంగారు పతకాలు' ప్రధానం చేశారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రముఖ శాస్త్రవేత్తలు, నోబెల్ అవార్డు గ్రహీతలతో ఆయన ముచ్చటించారు. 6 మంది నోబెల్ అవార్డు గ్రహీతల్లో జపాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టోక్యో భౌతికశాస్త్ర విభాగానికి చెందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ తకాకి కజితా, స్టాన్‌ఫోర్ట్ వర్సిటీ (అమెరికా) రసాయన విభాగం శాస్త్రవేత్త ప్రొఫెసర్ మోయినర్ విలియమ్ ఎస్కో, సీర్ అండ్ మేయిర్ క్యూరీ యూనివర్సిటీ (ఫ్రెంచ్) భౌతికశాస్త్రం విభాగం శాస్త్రవేత్త ప్రొఫెసర్ సెర్గ్ హారోజ్. వెజ్‌మన్




ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఇజ్రాయిల్) రసాయనశాస్త్రం శాస్త్రవేత్త ప్రొఫెసర్ మెహ్మద్ యూనస్, ఫ్రెంచ్‌లోని ఇన్సిటీట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ ఇన్ టోలోస్ ఆర్థికరంగ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జీన్ టైలర్‌లకు ప్రధాని బంగారు పతకాలు అంజేశారు. వీరితోపాటు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆవులదా మోదరానికి బంగారు పతకం ప్రధానం చేశారు.

## రాజధాని ప్రాంతంలో ప్రపంచబ్యాంక్ పథకాలు

**రాజధాని ప్రతినిధి - అమరావతి :** నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిధిలో ప్రపంచబ్యాంకు రుణంతో పలు పథకాలు చేపట్టనున్నారు. రహదారులు, కాలువలు తదితర నిర్మాణ పనులను రాజధాని ప్రాంతంలో చేపట్టనున్నారు. ఇందుకోసం జరపతల పెట్టిన స్థల సేకరణకు పున: పరిష్కార విధాన ముసాయిదా పత్రం, అలాగే అమరావతిలో పర్యావరణ, సామాజిక మదింపు, పర్యావరణ సామాజిక నిర్వహణకు సంబంధించిన ముసాయిదా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) విడుదల చేసింది ఈ పత్రాలను ప్రజల సందర్శనార్థం ఆ సంస్థ వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ పనులకు సంబంధించి స్థల సేకరణకు సంబంధించి పున: పరిష్కారం (రీ సెంటిల్ మెంట్) ప్రక్రియ, పర్యావరణంపై ప్రభావాలకు సంబంధించి ఈ ముసాయిదా పత్రాలను రూపొందించింది.వెలగపూడి సచివాలయం పోస్టల్ కోడ్ 522238 : ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని పాలనా కేంద్రం అమరావతి సచివాలయానికి కొత్త పోస్టల్ కోడ్ ఏర్పాటు చేశారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకునేందుకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు. మండల పరిధిలోనే కర్లపూడి గ్రామంలో గ్రామ సర్పంచ్ వి. ఏడుకొండలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన 4వ విడత జన్మభూమి గ్రామ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన 15 సూత్రాల మౌలిక సదుపాయం ప్రతి ఒక్కరికి అందాలన్నారు. ఈకార్యక్రమంలోని అంశాలను అన్ని వర్గాల ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం అధికారులు, ప్రజా ప్రతినిధులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. అనంతరం చంద్రన్న కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి మండల ప్రత్యేక అధికారి రాఘవయ్య, ఎంపీపీ పెనుముచ్చు శివకుమారి, అమరావతి మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పి.రామకృష్ణ, తహశీల్ధార్ భాస్కరరావు, ఎంపీడీఓ వై. రాజగోపాల్ పాల్గొన్నారు. లేమల్లెలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు.

## కూచిపూడి బాలికకు ప్రతిభాపురస్కారం

**కూచిపూడి :** పిన్న వయస్సులో కూచిపూడి నాట్యాన్ని అభ్యసిస్తూ ప్రదర్శనల్లో ప్రతిభ చూపుతున్న వై.ఎస్.ఎస్.వైష్ణవిని 'బాల ప్రతిభా పురస్కార్' వరించింది. ఈ చిన్నారిని ఆశీర్వదిస్తూ విజయవాడ కార్పొరేషన్ ప్రథమ పౌరులు (మేయర్)కోనేరు శ్రీధర్ విజయవాడలో పురస్కారాన్ని అందించి ప్రశంసించాడు. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ (విజయవాడ) సారథ్యంలో ఈ పురస్కారాలను పొందిన 24 మందిలో కూచిపూడి నాట్యానికి ఈ విద్యార్థి ఎంపికకావడంపై పలువురు అభినందించారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**రాజధాని ప్రతినిధి-గుంటూరు (జిల్లాపరిషత్) :** సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్-2016 రిక్రూట్‌మెంట్ కోసం ఉచిత శిక్షణ అందించేందుకు గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ టి.సూర్య నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 8వ తేదీలోగా గుంటూరు బీసీ స్టడీసర్కిల్‌లో అందజేయాలని కోరారు. ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులని, డిగ్రీలో వచ్చిన మార్కుల మెరిట్ ప్రతిపదికపై అభ్యర్థులను ఎంపికచేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఈ నెల 10వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు స్టైఫండ్, స్టడీమెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల బయోడేటాతోపాటు 10, డిగ్రీ మార్కులిస్టులు, ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించిన నకలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోను జతపరచి స్థానిక రాజాగారితోటలోని బీసీ స్టడీసర్కిల్‌లో అందజేయాలని కోరారు. వివరాలకు 0863-2358071లో సంప్రదించాలని కోరారు.

## బీసీ ఆవిర్భావ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** (గాంధీనగర్) : స్వాతంత్రం సిద్ధించి 70 సంవత్సరాలు గుడస్తున్న దేశ జనాభాలో ఆత్యధికంగా 85 శాతం ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలు రాజ్యాధికారం సాధించక పోవడంతో పాటు అధిపత్య కులాల చేతుల్లో అణచివేతకు గురవుతున్నారు. రాబోయే కాలంలో ఈ వర్గాంల ప్రజలు ఏక త్రాటిపైకి వచ్చి వారి హక్కులు సాధించండంతో పాటు రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా ముందుకు సాగడానికి అన్ని వర్గాల ప్రజలతో ఈ నెల 8వ తేదిన నగరంలోని అంబేద్కర్ భవన్‌లో బీసీ సామాజిక విప్లవ సంఘం ఆవిర్భావ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటి నాయకులు బొక్కా సత్యనారాయణ, చింతపల్లి గురుప్రసాద్‌లు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిర్భావ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడూతూ పాలకులు తమ స్వార్ధ రాజకీయం కోసం సామాజికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఒక కలంను బీసీ జాబితాలొ చెర్చడానికి ప్రయత్నాలు చెయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ఇప్పటికే బీపీ జాబితాల్లో 140కులాలు పైగా ఉన్నాయని అందులో కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే న్యాయం జరిగిందన్నారు. సభకు ముఖ్య అతిధిగా డాక్టర్ కత్తి పద్మారావు,ఇతర నాయకులు విచ్చేయన్నారని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బాయిన శేఖరబాబు,చంద్రగిరి రాధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

## 75 తాళ్ళూరులో స్వాస్థ విద్యావాహిని

**పెదకూరపాడు :** వినూత్న రీతిలో విద్యావాహిని అంటూ మండల పరిధిలోని 75 తాళ్ళూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో స్వాస్థ విద్యావాహిని వారి సౌజన్యంతో మెడిసిన్ విద్యార్థులతో పిల్లల ఆరోగ్యంపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుహాసిని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు స్వాస్థ విద్యావాహిని విసూత్న రితిలో ఆరోగ్యంపై మొదటి రోజు హ్యాండ్‌వాష్‌పై అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ అధికారి జొన్నలగడ్డ శ్రీవల్లి, డా॥రోహిణి, 75 తాళ్ళూరు ఆరోగ్య వైద్యాధికారి డా॥సుబ్బరాయన్,వైద్యశాల అభివృద్ధి కమిటి కొల్లి వెంకటరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్ సర్పంచ్ మేకల అమరకుమారి కృపానందం, హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల పాల్గొన్నారు.

## ఆకలి లేని భారతావనే లక్ష్యం

### వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్



**తిరుపతి (ఎస్వీయూ) :** ఆకలి లేని భారతదేశాన్ని రూపొందించడమే లక్ష్యంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 104వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఆయన ప్రసంగించారు. "ఆహారం, ఔషధాలు-అనుసంధానం" అనే అంశంపై స్వామినాథన్ ప్రసంగిస్తూ హరిత విప్లవంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే దిశగా కృషి జరుగుతుందన్నారు. సముద్ర మట్టం పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన సమస్యగా మారుతున్నాయని వెల్లడించారు. కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పోషకాహార సమస్య ప్రధానంగా ఉందన్నారు.పోషకాహార లోపాలను అధిగమించే దిశగా నూతన ఆవిష్కరణల కోసం కృషి చేయాలన్నారు. గ్రామీణ స్థాయిలో ఇప్పటికీ పోషకాహారంపై సరైన అవగాహన లేదన్నారు. గ్రామీణ ప్రజలకు పోషకాహారం ఆవశ్యకతను తెలియజేసేవిధంగా పలు కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. ఆకలి రహిత సమాజం కోసం యువ పరిశోధకులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. సంపూర్ణ ఆహార భద్రత కలిగిన దేశంగా భారత్‌ను రూపొందించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.వ్యవసాయ రంగ సమస్యలను అధిగమించడంలో మహిళ పాత్ర కీలకమన్నారు. కృషీవలుడు, సంరక్షకుడు, ఉత్పాదకుడు వంటి నివాదాలతో ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ఆహారం, ఆరోగ్యం భద్రతకు జన్యు వినాశనం కీలకంగా మారిందని పేర్కొన్నారు.పోషకాహార సవాళ్లను ఎదుర్కొనేందుకు నూతన జన్యు మార్పిడి వంగడాలు సహకరిస్తాయని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున అధునిక, నూతన ఆవిష్కరణల దిశగా శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. అవపాతం, ఉష్ణోగ్రత పెంపు వంటి అంశాలు నేడు వ్యవసాయ రంగంలో పెను సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధనల్లో సంస్కరణలు తప్పనిసరి అని పేర్కొన్నారు. హరిత విప్లవం ద్వారా దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినా, పోషక విలువలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆహార భద్రతను కల్పించాలనే లక్ష్యంతో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశంలో అనేక వ్యవసాయ విశ్వవిద్యాలయాలను స్థాపించారని వెల్లడించారు.

## సంక్రాంతికి ఎయిర్‌షో

### జనవరి 12 నుంచి 14 వరకు నిర్వహణ



**న్యూఢిల్లీ :** రాజధాని ప్రాంతం విజయవాడలో ఈ నెల 12 నుంచి 14 వరకు విమానయాన ప్రదర్శన, సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఫిక్కీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈమేరకు తన నివాసంలో ఎయిర్‌షో, ఏవియేషన్ సమ్మిట్‌లను సంబంధించిన బ్రోచర్లను కేంద్ర మంత్రి విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలో బెంగళూరు, హైదరాబాద్‌ల్లో మాత్రమే ఎయిర్‌షో, సదస్సులు జరుగుతున్నాయని.. తొలిసారిగా విజయవాడలో భారతదేశ నాయకత్వాన్ని బలోపేతం చేయటం, విమానాల నిర్వహణ, మరమ్మతులు (ఎంఆర్‌ఓ)రంగాలను ప్రోత్సహించేందుకు విజయవాడ సదస్సులో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 12వ తేదీన వీటిని ప్రారంభిస్తారని అన్నారు. గన్నవరం విమానాశ్రయంలో నిర్మించిన తాత్కాలిక టెర్మినల్‌కు ప్రారంభోత్సవం, రన్‌వే విస్తరణకు శంకుస్థాపనలు కూడా అదే రోజు జరుపుతామని తెలిపారు. ఏపీతోపాటు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఈ సదస్సుకు భాగస్వామ్యం వహిస్తున్నాయని చెప్పారు. 200 మంది జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారు. లండన్, ఫ్రాన్స్, నెదర్లాండ్ దేశాల నుంచి ప్రతినిధుల బృందాలు రానున్నాయని తెలిపారు. దేశంలో ప్రాంతీయ అనుసంధానతను పెంచటంపైన కూడా సదస్సులో చర్చిస్తామన్నారు.విజయవాడలోని భవానీ ద్వీపం,పున్నమి ఘాట్‌ల వద్ద కృష్ణా నది నీటిపై జరిగే ఎయిర్‌షో ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణ అని చెప్పారు. ఈ వైమనిక ప్రదర్శనను లక్షలాది మంది ప్రజలు తిలకించేందుకు అవకాశం ఉందన్నారు. కాగా, భోగాపురంలో విమానాశ్రయం నిర్మాణానికి 80 శాతం భూసేకరణ పూర్తయ్యిందని అశోక్ గజపతి చెప్పారు. రాజమండ్రి విమానాశ్రమ విస్తరణకు చర్యలు తీసుకున్నామన్నారు. కడపవిమానాశ్రయం నుంచి విమానాల రాకపోకల్ని పెంచేందుకు ప్రాంతీయ అనుసంధాన పథకంలో చేర్చామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం రెసిడెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్,ఫిక్కీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కృష్ణానది కరకట్టపై ఒక్క ఇంటిని కూడా తొలిగించం



**కృష్ణలంక :** కృష్ణానది వెంబడి ఉన్న ఇళ్లలో ఒక్క ఇంటిని కూడా తొలగించేది లేదని అక్కడ నివాసితులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పని లేదని ఎమ్మెల్యే గద్దె రామమోమనరావు స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం మొదటి దశలో ఉందని తెలిపారు. కృష్ణలంక రాణిగారితోట 15వ డివిజన్‌లోని సిద్దె కృష్ణారెడ్డి కమ్యూనిటీ హాలులో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. కృష్ణలంకలో సబ్‌వే నిర్మాణం పూర్తి అయిన తరువాత రాణిగారితోట సమీపంలోని నేతాజీ బ్రిడ్జి వద్ద మరో సబ్‌వే నిర్మాణం చేపడతామన్నారు. ఇళ్ల పట్టాలులేని వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ కావాటి దామోదర్ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమంలో పలువురికి రేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, టీమ్ లీడర్ ఈఈ సిహెచ్ ధనుంజయ, పౌరసరఫరాలు శాఖాధికారి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లెక్క తేల్చేదెలా?



- బ్యాంకుల్లో 97 శాతం పాత నోట్లు జమ
- నల్లధనం సంగతేంటీ?
- ఆర్బీఐ వెబ్‌సైట్ మూసివేత
- చిరువ్యాపారాలు ఛిద్రం-సేద్యం కుదేలు
- ఉలుకు లేని ఉర్జిత్
- రూ.1.11 లక్షల కోట్ల పెట్టుబడుల నష్టం
- కమలనాథుల్లో కంగారు

**న్యూఢిల్లీ :** "పెద్ద నోట్ల రద్దు ఓ సాహసోపేత నిర్ణయం. నల్లకుభేరుల భరతం పట్టినట్టే. ఉగ్రవాదుల ఆర్థిక మూలాలను నాశనం చేసినట్టే. ఆర్థికాభివృద్ధికి పునాది పడింది. యాభై రోజుల పాటు ప్రజలు పడిన కష్టాలు తాత్కాలికమే. రాబోయే రోజుల్లో దేశం సుసంపన్నమవుతుంది. అభివృద్ధి ఫలాలన్నీ పేదలకు దక్కుతాయి". సామాన్యుల అష్టకష్టాను పట్టించుకోని అపర మేధావులు, ప్రధాని మోడీని కీర్తించే కమలనాథుల ప్రవచనాలు, భజన కీర్తనలు మార్మోగుతున్న వేళ... ఐదు రాష్ట్రాల్లో రాజకీయ ప్రయోజనం, ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను దెబ్బతీయటం అనే లక్ష్యంతో వెయ్యి, ఐదొందల నోట్లను రద్దు చేసి...."ఇదిగో నల్లధనాన్ని వెలికి తీస్తున్నా... అదిగో ఆ డబ్బంతా పేదలకే పంచేస్తా" అంటూ జన సభల్లో ఊగిపోయిన ప్రధాని మోడీ కథ అడ్డం తిరిగింది. ఆయన చెప్పినట్టు ఒక్క రూపాయి కూడా నల్లధనం బయటకు రాలేదు. చెలామణిలో ఉన్న 97 శాత నోట్లు బ్యాంకులకు చేరాయి. ఇక ప్రవాస భారతీయులు, ఇతరులు మార్చి 31లోపు మిగిలిన మూడు శాతం జమ చేస్తే... మరి లెక్కలేని నల్లధనం ఏమైపోయినట్టు. పేదలకే ఇచ్చేస్తామన్న ప్రధాని మోడీ వాగ్దానం వాగాడంరమేనా? ఈ విషయాన్ని తలుచుకుని బీజేపీ శ్రేణులు కంగారు పడుతున్నాయి. కేవలం నోట్ బందీ ట్రంప్ కార్డుతో యూపీ గద్దెను కైవసం చేసుకోవటమే కాదు, నోట్ల రద్దుపై ప్రతిపక్షాల రాద్ధాంతాన్ని తిప్పికొట్టొచ్చనే ఆశ అడియాశ కాబోతుందనే ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. రద్దు చేసిన నోట్లను మార్చుకునేందుకు డిసెంబర్ 30 వరకూ గడువు ఇచ్చిన రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా... ప్రస్తుతం ఎంత డబ్బు బ్యాంకులకు చేరిందో వివరించటానికి సీతారాము ఇష్టపడటం లేదు. దేశంలో చలామణిలో ఉన్న రూ. 15.4 లక్షల కోట్ల వెయ్యి, ఐదొందల నోట్లల్లో సుమారు నాలుగైదు లక్షల కోట్లు నల్లధనం ఉన్నట్టు మోడీ ప్రభుత్వం ఊహించింది. సుప్రీం కోర్టు ప్రశ్నించినప్పుడు 10 నుంచి 11 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులకు జమ అయ్యే అవకాశం ఉందని అటార్నీ జనరల్ ముఖుల్ రోహత్గీ సమాధానం ఇచ్చారు. దీంతో మిగిలిన 4 నుంచి 5 లక్షల కోట్లు నల్లధనం కావచ్చనే ప్రచారం ఊపందుకుంది. ఐతే, డిసెంబర్ 10 నాటికి రూ. 12.44 లక్షల కోట్ల పాత నోట్లు బ్యాంకులకు చేరాయి. దీంతో ఆర్బీఐ అంచనాలు తల్లకిందులయ్యాయి. తుది గడువుకు 20 రోజుల్లో ఎంత డబ్బు జమ అవుతుందో అర్థం కాని స్థితి. ఐతే, డిసెంబర్ 30 నుంచి ఆర్బీఐ తన వెబ్‌సైట్‌ను మూసేసింది. ఇంతక ముందు ఏ రోజు కారోజు ఎంత సొమ్ము డిపాజిట్ అయ్యింది, ఎన్ని వేల కోట్ల విలువ చేసే కొత్త నోట్లను బ్యాంకులకు పంపిణీ చేసింది... తదితర వివరాలన్నీ ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండేది. చిత్రంగా గత వారం రోజులుగా ఆర్బీఐ వెబ్‌సైట్ పని చేయటం లేదు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులను ఆర్బీఐ తిరస్కరిస్తోంది. అభ్యర్థులు కోరే సమాచారాన్ని ఇస్తే దేశ అంతర్గత భద్రతకే ముప్పు అని సమాధానం ఇస్తోంది. ఈ విషయాన్ని పక్కన పెడితే... ఇప్పటికే రూ.15.4 లక్షల కోట్లల్లో రూ.14.94 లక్షల కోట్లు బ్యాంకులకు చేరినట్టే. ఇంకా రూ.50వేల కోట్లు జమ కావాలి. ప్రధాన భారతీయులకు, ఇతరులకు మార్చి 31 వరకూ అవకాశం ఇచ్చారు. అమెరికాలో 31.5 లక్షల మంది, యూరోప్‌లో రూ.14.61 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. వీరంతా తమ లాకర్లలోని నగదును బయటకు తీసి, ఒక్కొక్కరూ హీన పక్షంలో రూ.2 లక్షల చొప్పున ఆర్బీఐకి జమ చేస్తే... రూ.1.38 లక్షల కోట్లు లెక్కలోకి వస్తాయి.

ఇక వ్యాపారులు, ఇతరులు చివరి నిముషంలో మరో రూ.50వేల కోట్లు జమ చేస్తే? దేశంలో రూ.16.82 లక్షల కోట్లు అంటే... రమారమీ రూ. 17లక్షల కోట్ల నగదు చలామణిలోకి వస్తుంది. ఇదంతా చట్టబద్ధ నగదే. ఈ లెక్కలను పరిశీలిస్తే... అసలు నల్లధనమే లేదనిపిస్తోంది. ఉన్నా నాలుగైదు లక్షల కోట్లు కాదు... చాలా స్వల్పంగా ఉన్నట్టు భావించాలి. మరి నల్లధనం ఎక్కడ? ఎమైంది? విదేశాలకు తరలిన ధనం సంగతి వదిలిస్తే... నగదు ఏ రూపంలోకి మారింది? రియల్ ఎస్టేట్, బంగారం, విదేశీ పెట్టుబడుల్లో చేరిపోయింది. ఈ రూపంలో నల్లధనాన్ని వెలికి తీసే విషయంలో సాధ్యాసాధ్యాలను కూడా పక్కన పెడితే... పెద్ద నోట్ల రద్దుతో మోడీ దేశానికి చేసిన మేలు కంటే నష్టమే ఎక్కువగా కనిపించింది. వంద కోట్ల మంది భారతీయులు బ్యాంకుల ముందు పడిగాపులు పడ్డారు. కనీస అవసరాలు తీర్చు కోటానికి నానా గడ్డి తిన్నారు. చిరు వ్యాపారులు ధ్వంసమయ్యాయి. కూలీనాలీ బతుకులు ఛిద్రమయ్యాయి. కార్పొరేట్ కంసెనీలు లాభపడ్డాయి. ఆర్థికాభివృద్ధి అచేతన దశకు చేరింది. 2016 డిసెంబర్ 30 నాటికి రూ.1,11,000 కోట్ల పెట్టుబడులు తగ్గాయి. నిజానికి రూ.2,36,000 కోట్ల పెట్టుబడి రావాలి, కానీ రూ.1,25,000 కోట్ల పెట్టుబడ్డి వచ్చింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సమాచారం మేరకు అక్టోబర్ 1 నుంచి నవంబర్ 8 వరకూ అంటే నోట్ల రద్దుకు ముందు 39 రోజుల్లో.. సగటున రూ.2,097 కోట్లు చొప్పున కొత్త పెట్టుబడులను ప్రకటిస్తే... ఆ తరువాత రోజుకు సగటున రూ.824 కోట్లు ప్రకటించారు. ఇలా ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన మోడీ జరిగిన పొరబాటును సరిదిద్దుకునేందుకు పడిపోయిన ఆర్థికాభివృద్ధి శాతాన్ని పెంచుకునేందుకు ఋణాల వడ్డీ రేట్లను తగ్గించేందుకు ఆర్బీఐపై వత్తిడి తీసుకువచ్చారు. స్వయం ప్రతిపత్తిని కోల్పోయిన ఆర్బీఐ కూడా విచక్షణ రహితంగా వడ్డీ రేట్లను తగ్గించింది. ఇలా దేశ జనాభాను అప్పుల ఊబిలోకి లాగేశారు. ఓట్ల కోసం దేశ ప్రగతిని దెబ్బతీస్తున్నామనే స్పృహను కోల్పోయి.... కోట్లాది మంది దేశ ప్రజలకు నరకం చూపించిన మోడీకి... రాబోయే ఐదు రాష్ట్రాల ప్రజలు ఎంతవరకూ మద్దతు తెలుపుతారో? వేచి చూడాల్సిందే.

# మంత్రి హామీ ఇచ్చి యేడాది

**రాజధాని ప్రతినిధి-కొయ్యలగూడెం-అన్నంరెడ్డిసుబ్బారావు :** కొయ్యలగూడెం మండలం ఆరిపాడుదిబ్బలు (ఎన్.ఏ.రోడ్డు) నుంచి యర్రంపేట గ్రామం వరకు గల రెండున్నర కిలోమీటర్ల పంచాయితీరాజ్ రహదారి అభివృద్ధికి నాబార్డు నిధులు మంజూరు చేసి, ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తొలగిస్తానని జిల్లాఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామిణాభివృద్ధి శాఖామంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చిన సరిగ్గా యేడాదిగడిచింది. 2016 జనవరిలో నాటి జన్మభూమి-మన ఊరు కార్యక్రమం సందర్భంగా యర్రంపేటలో జరిగిన సభకు రాష్ట్ర మంత్రులు అయ్యన్నపాత్రుడు, పీతలసుజాత, జిల్లాపరిషత్ ఛైర్మన్ మళ్లపూడి బాపిరాజు, పోలవరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యురాలు, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ జి.కిరణ్‌మయి, జడ్.పి.ఛైర్మన్ బాపిరాజులు ఆరిపాడుదిబ్బలు-యర్రంపేట రోడ్డుదుస్థితిని ఈ రహదారిపై ప్రయాణానికి ప్రజలు అనుభవిస్తున్న నరకాన్ని సభాముఖంగా జిల్లాఇన్‌ఛార్జీ మంత్రి, అయ్యన్నపాత్రుడుకు వివరించారు. శిధిలమైన ఈ రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచటానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈ రహదారిపై నేతామంత్రి ఇక్కడికి వచ్చామని, రోడ్డుదుస్థితిని ప్రజల అవస్థలను తనకు అనుభవపూర్వకం తెలియచెప్పటానికి ఎమ్మెల్యే తనను ఈ రహదారిపైనే కారులో తీసుకువచ్చి ఉంటారని చమత్కరించారు. నాబార్డు పథకంలో 2016-17 సంవత్సరం నిధులతో యర్రంపేటరోడ్డును అభివృద్ధి పరచటంతోపాటు ఆమార్గంలో ఉన్న శిధిలకల్వర్టు స్థానంలో కొత్త రహదారి వంతెన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు ఇస్తానని మంత్రి హామి ఇచ్చారు. మంత్రి హామీ ఇచ్చిన యేడాది గడచినా నిధులు మంజూరు కాలేదు. రహదారి, వంతెనలు అభివృద్ధికి నోచూకోలేదు. ఈ నెల 3న యర్రంపేటలో జరిగిన 4వ విడత జన్మభూమి సభలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎర్రంపేట రహదారి అభివృద్ధికి రహదారి వంతెన నిర్మాణానికి నాబార్డు-17 పథకాలు ప్రతిపాదనలు అందచేయటం జరిగిందని, ఏ కారణం వల్లనో నిధులు మంజూరు జాప్యం జరిగిందని వెల్లడించారు. ఈ విషయంపై తాను కృషిచేస్తున్నానని ఆయన అన్నారు. రెండున్నర కిలోమీటర్లు (రెండువేల అయిదు వందలు మిటర్లు) పొడవున్న ఈ రహదారిపై రెండువేల గోతులు, గుంటలు ఉన్నాయంటే ఆశ్చర్యపోనక్కరలేదు. జన్మభూమి సభకు హాజరు కావటానికి ముందు ఆరిపాటి దిబ్బల మీద కనకాద్రిపురం గ్రామంలో సి.సి రోడ్లు, సామాజిక భవనం నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జడ్.పి.ఉపాధ్యక్షురాలు, ఎం.పి.పి, ఎ.ఎం.సి. ఛైర్మన్‌లు ఎర్రంపేటకు ఈ రహదారిపై వెళ్లటానికి ఇష్టపడక, వెనక్కి వెళ్లి పొంగుటూరు మీదుగా చుట్టుతిరిగి యర్రంపేట చేరుకున్నారంటే ఈ రహదారి దుస్థితి, ప్రజల అవస్థలు అర్థంచేసుకోవచ్చు. ఇప్పటికైనా మంత్రి అయ్యనపాత్రుడు ఈ రహదారి, వంతెనల నిర్మాణానికి నాబార్డు-17 పథకాలో నిధులు మంజూరు చేసి హామీ నిలుపుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ 2.50 కిలోమిటర్ల రహదారి అభివృద్ధికి, రహదారి వంతెన నిర్మాణానికి రూ.1.70 కోట్ల అంచనాలతో అధికారులు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు.

# హోరా... హోరీగా ఫుట్‌బాల్ జిల్లా లీగ్

### సెమి ఫైనల్‌కి చేరిన జంగారెడ్డిగూడెం జట్టు

**అన్నంరెడ్డి సుబ్బారావు,రాజధాని ప్రతినిధి,కొయ్యలగూడెం :** గ్రామీణ స్థాయి నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహించి ప్రపంచ స్థాయిలు మేటి ఆటగాళ్లుగా తీర్చిదిద్దవలసిన అవసరం ఎంతో ఉందని పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు అన్నారు. మాజీ మంత్రి,ప్రముఖ నాయకుడు దివంగత కోటగిరి విద్యాధరరావు స్మారకార్థం ఆయన కుమారుడు కోటగిరి శ్రీధర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటు చేసి, జిల్లా స్థాయిలో గ్రామీణ క్రీడా కారులతో ఫుట్‌బాల్ లీగ్ (ఫో2017) పోటీలు నిర్వహించటం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఫుట్‌బాల్ జిల్లా పోటీలలో భాగంగా కొయ్యలగూడెం బాలుర ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 3న.8వ లీగ్ పోటీని నిర్వహించారు. జంగారెడ్డి గూడెం,నర్సాపురం జట్లు మధ్య ఆద్యంతం రసవత్తరంగా,తీవ్ర ఉత్కంఠగా జరిగిన ఈ పోటీలో 1.0 గోల్‌స్కోర్‌తో జంగారెడ్డి గూడెం జట్టు విజయం సాధించింది.ఎమ్మెల్యే శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని తొలుత ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఈ ప్రాంత ప్రముఖులు,నాయకులతో కలిసి ఆయన ఫుట్‌బాల్ పోటీని ఆద్యంతం తిలకించారు. క్రీడాకారులను అభినందించారు. జిల్లా లీగ్‌లో మొత్తం 17 చోట్ల ఫుట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయని.ఇప్పటి వరకు జరిగిన పోటీలలో జంగారెడ్డిగూడెం జట్టు 3.జట్ల పై గెలుపొంది 3 వ తేదిన గెలుపుతో సెమిఫైనల్‌కు చేరిందని కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు.జంగారెడ్డి గూడెం జట్టు కెప్టెన్,మరో ముగ్గురు క్రీడాకారులు కొయ్యలగూడెం పట్టణానికి చెందిన వారే కావటం విశేషం. నిర్ణీత సమయంలోగా ఇరు జట్లు గోల్స్‌చేయలేకపోవటంతో రిఫరీ కొంత అదనపు సమయం ఇచ్చారు. అదనపు సమయం ముగిసే దశలో జంగారెడ్డి గూడెం జట్టు చివరి నిమిషంలో చాకచక్యంగా గోల్‌చేసి 1.0 స్కోర్‌తో గెలుపు సాధించింది. ఇరుజట్లు క్రీడాకారులను, ఏకైక గోల్ చేసి విజయం సాధించి సెమి ఫైనల్‌కి చేరిన జంగారెడ్డి గూడెం జట్టు ఆటగాళ్లకు అతిథులు అభినందించారు. ఈ పోటీలో ఒక జట్టు తరపున నైజీరియా దేశానికి చెందిన క్రీడాకారులు కూడా పాల్గొన్నారు.ఎ.ఎం.సి. ఛైర్మన్ పారేపల్లి రామారావు,జడ్.పి. ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ,ఎం.పి.పి. అయినపర్తి చందన శ్రీదేవి, ఎపె డామా జీ డైరెక్టర్ జి.ఇ.సి. విద్యాసాగర్,కొయ్యలగూడెం వర్జీనియం పొగాకు రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల సూర్యప్రకాశరావు, సొసైటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎ.పి. మహిళా సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి, జ్యేష్ఠ సుబ్బారావు స్థానిక ఎస్.ఐ. పవన్ కుమార్ పలువురు మండల ప్రముఖులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## కత్తులు తీసుకెళ్లవచ్చు : డీఎంసీ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ ఓ ప్రతిపాదన తెచ్చింది. మెట్రో రైళ్లలో ప్రయాణించే యువతులు తమ రక్షణ కోసం నాలుగు అంగుళాల కత్తులు,లైటర్లు, అగిపెట్టెలు తీసుకెళ్లేందుకు అనుమతించిది. రక్షణ కోసం కత్తులు దగ్గర పెట్టుకోవడానికి అనుమతించినా ప్రయాణికులైవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకునే హక్కు అధికారులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులు కొన్ని నియమాలు సడలించారు. కార్మికులు తమ వృత్తికి సంబంధించిన పనిముట్లు తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు. ఢిల్లీ మెట్రోల్లో రోజులు 30 లక్షల మంది ప్రయాణిస్తున్నారు.


## నగదు రహిత లావాదేవీల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ

### తాహశీల్దారు కృష్ణజ్యోతి

**అన్నంరెడ్డి సుబ్బారావు, రాజధానిప్రతినిధులు, కొయ్యలగూడెం :** కొయ్యలగూడెం మండలంలో ఉన్న మొత్తం 23,200 తెలుపురంగు రేషన్ కార్డు లబ్దిదారులకు జనవరి నెల నుంచి నగదు రహిత లావాదేవీల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ చేయటం జరుగుతుందని మండల తహాశీల్దార్ ఆకుల కృష్ణజ్యోతి చెప్పారు. రాజవరంలో జన్మభూమి సభ అనంతరం ఆమె స్థానిక సర్పంచ్ చీర్ల కమసూర్యం ఇంటివద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. మండలంలో మొత్తం 42 చౌకదుకాణాలు ఉన్నాయని చౌకదుకాణ డీలర్లు అందరితో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకోవటం జరిగిందని ఆమె వివరించారు. రేషన్‌కార్డుదారులందరూ ఇకపై తమ డెబిట్,క్రెడిట్ కార్డుల ద్వారా ఈ యంత్రాల ఆధారంగా నగదు చెల్లింపులు లేకుండా నిత్యావసర సరుకులు తీసుకువెళ్ళవచ్చునని ఆమె తెలిపారు. ప్రస్తుత జనవరి నెలలో మాత్రమే కాకుండా ఇక నుంచి ప్రతి నెలా నగదు రహితంగానే,సరుకులు పంపిణీ జరుగుతుందని తాహాశీల్దార్ కృష్ణజ్యోతి పేర్కొన్నారు.

























# సంక్రాంతికి 'స్టార్‌వార్స్'




సినిమా

- ఒకేసారి నాలుగు సినిమాలు విడుదల
- ఖైదీ నెంబరు 150, గౌతిమీపుత్ర థియేటర్లలో స్వైపింగ్ మిషన్లు

ఇద్దరు సీనియర్ హీరోలకు చెందిన సినిమాలు సంక్రాంతికి విడుదల కానున్నాయి. సినీ నిర్వాతలు, దర్శకులే కాకుండా అభిమానులు సైతం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున సంక్రాంతికి స్టార్‌వార్ జరగనుందని భావిస్తున్నారు. దాదాపు 8 సంవత్సరాల విరామం తర్వాత మెగాస్టార్ చిరంజీవి 150వ చిత్రంగా 'ఖైదీ నెంబర్ 150' వస్తోంది. అలాగే యువరత్న నందమూరి బాలకృష్ణ 100వ చిత్రంగా 'గౌతమీ పుత్ర శాతకర్ణి' రాబోతోంది. ఈ రెండు సినిమాలకు కమర్షియల్ హిట్ దర్శకులు వీవీ వినాయక్, క్రిష్‌లు దర్శకత్వం వహిస్తున్నారు. దీంతో ఈ రెండింటిపై సినీ మార్కెట్లో భారీ అంచనాలున్నాయి. వీటితోపాటు వరుస విజయాలతో జోరుమీద ఉన్న శర్వానంద్ నటించిన 'శతమానం భవతి' మాస్ హీరో ఆర్. నారాయణమూర్తి నటించిన 'కానిస్టేబుల్ వెంకట్రామయ్య' సినిమాలు కూడా సంక్రాంతికి సందడి చేయబోతున్నాయి. అయితే పెద్దనోట్ల తర్వాత దేశవ్యాప్తంగా అన్ని రంగాలు అతలాకుతలమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలపై కూడా ఆ ప్రభావం ఏమేరకు పడుతుందో అన్నదే ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ముఖ్యంగా అగ్ర హీరోలకు చెందిన చిరంజీవి, బాలకృష్ణ సినిమాలను నిర్మాతలు భారీ వ్యయంతో పోటాపోటీగా నిర్మించారు. వీరిద్దరి సినిమాలు బాక్సాఫీస్ రికార్డులను అధిగమిస్తాయనేది సినీ వర్గాల అంచనా, సహజంగా సినీరంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడేవారంతా సంక్రాంతి పండుగను సినీ పండుగగా భావిస్తారు. ఈ పండుగకు విడుదలయ్యే సినిమాలు ఎక్కువశాతం హిట్టవుతుంటాయి. మిగిలిన సినిమాలు కలెక్షన్లు కూడా బాగా వస్తాయి. తెలుగు ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే ఈ పండుగకు విద్యాసంస్థలు కనీసం పది రోజులకు తగ్గకుండా సెలవులు ప్రకటిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు మూడు రోజులు సెలవులుంటాయి. మరోప్రక్క వ్యవసాయరంగంలో అన్నిరకాల పంటలు దిగుబడులు రావడం, ఎక్కడెక్కడో వుండే కుటుంబసభ్యులు, బంధువులంతా తమ స్వస్థలానికి చేరుకుంటారు. దీంతో పల్లెలు, పట్టణాలు కళకళలాడతాయి. అన్ని రకాల వ్యాపారాలతో పాటు అందరికీ అందుబాటులో వుండే ప్రధాన ఎంటర్‌టైన్‌మెంట్ అయిన సినిమా హాల్స్ కూడా ప్రేక్షకులతో కిక్కిరిసిపోతుంటాయి. అందువల్ల సంక్రాంతి పండుగను సినిమా సీజన్‌గా భావిస్తారు. అయితే ఈ సారి పెద్దనోట్ల రద్దు ఎఫెక్ట్ సినిమాపై కొంతైనా పడుతుందని డిస్ట్రిబ్యూటర్లు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల విడుదలైన చిరంజీవి కుమారుడు రామ్‌చరణ్ సినిమా 'ధృవ'పై కూడా నోట్లరద్దు ప్రభావం పడిందని డిస్ట్రిబ్యూటర్లు చెబుతున్నారు. ఒక్క కృష్ణా జిల్లాలోనే సుమారు 50లక్షల కలెక్షన్ తగ్గినట్లు వారు అంచనా వేశారు. ప్రస్తుతం కొంత మెరుగుపడినందున, పెద్ద హీరోలకు చెందిన సినిమాలపై ఈ ప్రభావం పడకపోవచ్చని భావిస్తున్నామని గీతా ఆర్ట్స్ కంపెనీ మేనేజర్ జొన్నలగడ్డ లక్ష్మణరావు చెప్పారు. దీనిని అధిగమించేందుకు దాదాపు మా కంపెనీ పరిధిలోని అన్ని థియేటర్లలో స్వైపింగ్ మిషన్లు కూడా అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తున్నామని, మరోప్రక్క ప్రభుత్వం కూడా నగదు రహిత సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నందున ఇబ్బంది వుండకపోవచ్చునని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్షన్లు రికార్డు స్థాయిలో ఉంటాయా ?**

చాలాకాలం తర్వాత చిరంజీవి సినిమా వస్తున్నందున ప్రేక్షకాదరణ పెద్దఎత్తున వుంటుందని వారు ఆశిస్తున్నారు. అలాగే నందమూరి బాలకృష్ణ నటించిన చారిత్రాత్మక నేపథ్య చిత్రమైన గౌతమిపుత్ర శాతకర్ణిపై కూడా డిస్ట్రిబ్యూటర్లు గంపెడాశతోవున్నారు. గతంలో బాహుబలికి కృష్ణాజిల్లాలో 6కోట్లు, శ్రీమంతుడికి 4కోట్లు, జనతా గ్యారేజీకి మూడున్నర కోట్ల కలెక్షన్స్ వచ్చాయని, ఆస్థాయిలో ఈ రెండు సినిమాలకు వచ్చే అవకాశం వుందని వారు అంచనా వేస్తున్నారు.

– బోస్

## కాళ్ళ పగుళ్ళకు ఇంటి వైద్యం!



కాళ్ళ పగుళ్ళు చాలామంది ఎదుర్కొనే సమస్య. గరుకుగా మారిన, పగిలిన కాళ్ళు చూడడం కొంచెం కష్టమే. చూడడానికి ఇబ్బందిగా ఉంటే మరి వాటితో బాధపడేవారి పరిస్థితి పాదాలు చాలా బాధిస్తాయి. కాళ్ళ పగుళ్ళతో బాధపడేవారు నలుగురిలోకి వెళ్ళేందుకూ బిడియపడుతుంటారు. కావాలనుకున్న, ఇష్టమైన శాండిల్స్ వేసుకోవడమూ కుదరదు. ఇందుకు ఒక అద్భుతమైన పరిష్కారం ఉంది. దీనికోసం మార్కెట్‌లో దొరికే ఉత్పత్తుల జోలికి అసలు వెళ్ళద్దు. బ్యూటీ పార్లర్ల వంకా చూడనక్కర్లేదు. కాళ్ళను ముఖ్యంగా పాదాలను అందంగా తీర్చిదిద్దుకునేందుకు చాలామంది బ్యూటీపార్లర్‌లకి వెళ్ళి పెడక్యూర్‌లు చేయించుకుంటారు. దీనికోసం లెక్కలేనంత ఖర్చు పెడుతుంటారు. ఏ ఖర్చూ లేకుండానే, ఎక్కడకీ వెళ్ళకుండానే పాదాలను చూడముచ్చటగా మార్చుకోవచ్చు. ఇందుకు ఇంట్లో వాడే రెండు వస్తువులు బాగా ఉపయోగపడతాయి. అవి....పాలు, బేకింగ్ సోడా. అవును ఈ రెండు పదార్థాలే మీ కాళ్ళను ఎవరూ ఊహించనంత, అందరూ ఆశ్చర్యపోయేంత అంతంగా మారుస్తాయి. ఇవి ఎలా వాడాలంటే.... నాలుగు కప్పుల పాలు, మూడు టేబుల్ స్పూన్‌ల బేకింగ్ పౌడర్ తీసుకోండి. ముందుగా పాలు వేడిచేయండి. పాదాల సైజుని బట్టి తగినన్ని పాలు తీసుకోండి. ఇందులో బేకింగ్ పౌడర్ వేయండి. రెండూ బాగా కలియతిప్పాలి. బేకింగ్ సోడా కలిసేందుకు పాలు తగినంత వేడిగా ఉండాలి. ఈ మిశ్రమంలో మీ పాదాలు పెట్టి పది నిమిషాల పాటు అలాగే ఉంచండి. తర్వాత గోరువెచ్చని నీటితో పాదాలను కడిగేసి బాగా పొడిగా అయ్యేలా తుడవండి. వేగంగా మంచి ఫలితాన్ని అందుకోవాలంటే రోజూ క్రమం తప్పకుండా కొన్నాళ్ళు ఇలా చేసి చూడండి. ఈ చిట్కా పాదాలను, అరికాళ్ళను మెత్తగా, మృదువుగా చేస్తుంది. అందంగా మారుస్తుంది.

## విద్యామండలి చైర్మన్ జయరాజుకు అభినందన



**పండా సత్యసావిత్రి, నరసాపురం (రా.వా) :** రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ నాగార్జునా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. జయరాజును గౌరవపూర్వకంగా వైఎన్ కళాశాల పీజి డైరెక్టర్ డాక్టర్ నిమ్మల చింతారావు, పెనుగొండ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ దిరిశాల వెంకటేశ్వరరావు లాంచనంగా కలసి అభినందనలు తెలిపారు. ఎ.పి.ఎస్.సిహెచ్.ఇ. కార్యాలయాన్ని 2018 నాటికి అమరావతికి పూర్తిగా తరలించేందుకు కృషి చేస్తానని జయరాజు అన్నారు. జయరాజు గతంలో వైఎన్ కళాశాలను పలు సందర్భాల్లో సందర్శించారని విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలు విషయాలను విశదీకరించారన్నారు. జయరాజు నియామకం పట్ల కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ యర్రమిల్లి గోపాలకృష్ణమూర్తి అభినందనలు తెలిపారు.

## 14 నుంచి కబడ్డీ కూత

**జాతీయస్థాయిలో 20 టీమ్‌లు... క్యాష్‌ప్రైజ్ రూ.5లక్షలు**



**పండా సత్యసావిత్రి, నరసాపురం (రా.వా) :** నరసాపురంలో ప్రతిష్టాత్మకంగా 20 సంవత్సరాల నుంచి జరుగుతున్న జాతీయస్థాయి మెన్ & ఉమెన్ కబడ్డీ టోర్ని ముహూర్తం దగ్గరపడింది. జనవరి 14 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజులపాటు రుస్తుంబాదాలో కొత్తపల్లి సోదరుల నిర్వహణలో ఈ టోర్నీ ఎంతో ఉత్సాహంగా సాగుతోంది. దేశంనలుమూలల నుండి 15ను పైగా రాష్ట్రాల నుండి జాతీయ అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు వస్తున్నారు. దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు 200 మంది రిఫరీలు సిబ్బందితో గోగులమ్మ గుడి ప్రాంగణం సందడితో నెలకొంటుంది. ప్రైజ్‌మనీగా క్రీడాకారులను రూ.5లక్షల వరకు ఇస్తున్నారు. ఇవికాక ట్రోఫీలు, స్పెషల్ ప్రైజ్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. జాతీయస్తాయిలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రకబడ్డీ అసోసియేషన్ నిర్వాహకులు వస్తున్నారు. వెస్ట్‌బెంగాళ్, ఢిల్లీ, కర్ణాటక, మధ్య ప్రదేశ్, యు.పి. తమిళనాడు, ఒరిస్సా తెలుగు రాష్ట్రాల నుండి కబడ్డీలో ఆరితేరిన క్రీడాకారులు రావడం జరుగుతోంది. టోర్నీ కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు వారి కుటుంబం ఎంతో పట్టుదలగా ఈ పోటీలను వార్షికంగా నిర్వహిస్తున్నారు.

## నరసాపురం నియోజకవర్గంలో జన్మభూమి సభలు

**కంసాలిబేతపూడిలో ఉద్రిక్తత**

**పండా సత్యసావిత్రి, నరసాపురం (రా.వా) :** నరసాపురం నియోజకవర్గంలో గత వారం రోజులుగా జరుగుతున్న జన్మభూమి సభలు ఉత్సాహంగా ముందుకు సాగాయి. ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు నియోజకవర్గంలో నిత్యం నరసాపురం టౌన్, మొగల్తూరు మండల రూరల్ గ్రామాల్లో జరిగే ఐదారు సభల్లో పాల్గొని ప్రభుత్వం యొక్క పథకాలను లక్ష్యాలను వివరించారు. దేశంలో ఎక్కడాలేని అనేక సంక్షేమ కార్యక్రమాలు నవ్యాంధ్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. ప్రధానంగా చంద్రన్న భీమానునిరుపేద కుటుంబాలు ఉపయోగించుకోవాలని రూ.15 లుతో లక్షలాది రూపాయలు భీమాగా పొందే అవకాశం కల్పించారన్నారు. పట్టణంలో ప్రతి వార్డులోనూ ప్రభుత్వం పక్కా రహదారులు డ్రయినేజీలు నిర్మించడం జరిగిందన్నారు. గడచిన రెండు సంవత్సరాల్లోనూ రూ.320 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టి 75 శాతం పూర్తిచేయడం జరిగిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.15 కోట్లు మంజూరయ్యాయని స్వాతంత్ర్యం వచ్చాక సిమెంట్ రోడ్డు అనేది తెలియని అనేక గ్రామాల్లో రోడ్లు వేయడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పసుపులేటి రత్నమాలసాయి మాట్లాడుతూ పట్టణంలో పేదలకు పట్టాలిచ్చేందుకు 15 ఎకరాలను సేకరించేందుకు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. 876 మందికి కొత్తగా రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు. రూ.63 లక్షలతో పట్టణంలో గల రెండు హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా కంసాలిబేతపూడిలో జరిగిన జన్మభూమి సభలో తుందుర్రులోని ఆక్వాఫుడ్‌పార్కుకు వ్యతిరేకంగా కొంతమంది ఆందోళనకు దిగడంతో సిపిఎంకు చెందిన ముచ్చర్ల త్రిమూర్తులు, ఏడుకొండలను పోలీసులు అరెస్టు చేసారు. ప్రత్యేక అధికారి బాలాజి డి మంజుల, కమీషనర్ నాగేశ్వరరావు, ఎంపిడివో కె. కన్నమనాయుడు, ఎఎంసి చైర్మన్ రాయుడు శ్రీరాములు, ఎంపిపి అధ్యక్షులు వాతాడి కనకరాజు, బాలం ప్రతాప్, గుబ్బల నాగరాజు, కత్తిమండ ముత్యాలరావు తదితర నాయకులు పాల్గొని జన్మభూమి సభల్లో మాట్లాడారు.



పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

## రెండో రోజు బంగారం ధగధగ

**ముంబై :** వరుసగా రెండో రోజూ బంగారం ధరలు పెరిగాయి. అంతర్జాతీయ ట్రెండ్‌కు తోడు స్థానిక జ్యూయల్లర్స్ కొనుగోళ్లను పెంచేయడంతో పదిగ్రాముల బంగారం ధర రూ.200 పెరిగి .. రూ.28,550కి చేరింది. ఇక వెండి కూడా రూ.40 వేల మార్క్‌ను దాటింది. కిలో వెండి ధర రూ.650 పెరిగి.. రూ.40,250కి చేరింది. పరిశ్రమ వర్గాలు , నాణేల తయారీదారులు భారీగా వెండి కొనుగోలు చేస్తుండటంతో రజతం ధర జోరు పెంచింది. అంతర్జాతీయంగా కూడా బంగారం ధర పెరిగింది. సింగపూర్‌లో బంగారం ధర 0.38శాతం 1,162.70 అమెరికన్ డాలర్లకు చేరుకోగా, పదిగ్రాముల వెండి ధర 0.83 శాతం పెరిగి 16.41 డాలర్లకు చేరింది. ప్రస్తుతం దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 స్వచ్ఛత కలిగిన బంగారం పది గ్రాముల ధర రూ. 200పెరిగి, రూ. 28,550కి చేరుకోగా, 99.5 శాతం స్వచ్ఛ కలిగిన బంగారం ధర రూ.200 పెరిగి , 28,400కు చేరుకుంది.

## టాటా పవర్ ఛైర్మన్‌గా ఎస్ .పద్మనాభన్

**ముంబై:** టాటా – మిస్త్రీ బోర్డ్ వార్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. టాటా పవర్ ఛైర్మన్‌గా ఎస్. పద్మనాభన్ నియమితులయ్యారు. 34 ఏళ్లుగా టాటా గ్రూప్ తో అనుబంధం ఉన్న పద్మనాభన్ ను ఈ కీలక పదవికి టాటా గ్రూపు నామినేట్ చేసింది. నుంచే ఈ నియామకాలు అమల్లోకి రానున్నట్టు టాటా పవర్ ప్రకటించింది. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో టాటా పవర్ అడిషనల్ డైరెక్టర్ గా ఉన్న పద్మనాభన్ ను నామినేట్ చేసినట్టుగా టాటా పవర్ బిఎస్ఇ ఫైలింగ్ లో చెప్పింది. కాగా గత డిసెంబర్ లో పద్మనాభన్ ను టాటాపవర్ అదనపు డైరెక్టర్ నియమించింది. టాటా పవర్ బోర్డ్ లో చేరక మునుప ఆయన టాటా బిజినెస్ ఎక్సెలెన్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా ఉన్నారు.మరోవైపు ఇటీవల టాటా సన్స్ గ్రూప్ హెచ్ ఆర్ హెడ్ అదనపు బాధ్యతను టాటా అప్పగించిన. సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబర్లో కంపెనీడైరెక్టగా గా స్కెరస్ మిస్త్రీకి ఉద్వాసన పలింకింది టాటా గ్రూపు. అనంతర పరిణామాల నేపథ్యం, తన పోరాటాన్ని మరింత ఉధృతం చేసే యోచనలో టాటా గ్రూపులోని ఆరు లిస్టెడ్ కంపెనీలకు సైరస్ మిస్త్రీ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

## డీఎంకే రధసారధి స్టాలిన్

**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో అధికార పక్షంకా ...విపక్షంగా 48 ఏళ్ల పాటు కీలకపాత్ర పోషించిన డీఎంకే తమ కొత్త నాయకుడిని ఎన్నుకుంది. డీఎంకే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ వ్యవస్థాపకుడు కరుణానిధి కుమారుడు స్టాలిన్ బాధ్యతలు చేపట్టారు. చెన్నైలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో స్టాలిన్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తూ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా, పార్టీ కోశాధికారిగా స్టాలిన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. సర్వసభ్య సమావేశంలో స్టాలిన్ మాట్లాతుడూ తనకు పదవి ముఖ్యం కాదని, పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధానమన్నారు. తనను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు డీఎంకే రాజ్యసభ సభ్యురాలు, కరుణానిధి ముద్దుల కూతురు కనిమొళి, పెద్దకుమారుడు అళగిరి సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు అయ్యారు. ఈ సమావేశంలో అళగిరి సస్పెన్షన్ ఎత్తివేసే అంశం ప్రస్తావనకు రాలేదు. ఇక డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి 93 ఏళ్ల వృద్ధాప్యంతో బాధ పడుతున్నారు. అందుకే గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార బాధ్యతను స్టాలినే మోశారు. తన రాజకీయ వారసుడు అయ్యే లక్షణాలు స్టాలిన్‌కు ఉన్నాయంటూ కరుణానిధి ఇప్పటికే అనేకసార్లు అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కరుణానిధి ఎమ్మెల్యేగా

**కనిమొళి, అళగిరి గైర్హాజరు**



గెలిచినా అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను స్టాలిన్‌కే కట్టబెట్టారు. వారసుడు స్టాలిన్ అని ఇంతవరకు స్పష్టంగా ప్రకటించలేదు. ఇటీవల కాలంలో కరుణానిధి పదే పదే అనారోగ్యానికి గురవుతున్న విషయం తెలిసిందే. దీంతో డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి లేకుండానే డీఎంకే సర్వసభ్య సమావేశం ముగిసింది. అస్వస్థత కారణంగా ఆయన ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు.

**స్టాలిన్ కంటతడి**

డీఎంకే కోశాధికారి ఎంకే స్టాలిన్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన క్షణంలో.... భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. పార్టీ అధినేత, కుర వృద్ధుడైన కరుణానిధి అనారోగ్యం కారణంగా భారమైన హృదయంతో నూతన బాధ్యతలు స్వీకరిస్తున్నానంటూ స్టాలిన్ కన్నీరు పెట్టుకున్నారు. గతంలో కొత్త బాధ్యతలు స్వీకరించినప్పుడు చాలా సంతోషించేవాడినని, నేడు ఆ స్థితిలో లేవని అయన భావోద్వేగంగా మాట్లాడారు. 'మన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి లేదా ఇతర సీనియర్ నాయకులు చూపిన మార్గాన్నే అనుసరిస్తా. మీ అందరి సహాయ సహకారాలతో పార్టీ కార్యకలాపాలను ముందుకు సాగిస్తా. పూర్తి నిబద్ధతతో బాధ్యతాయుతంగా పనిచేస్తానని మాటిస్తున్నా, నని అన్నారు. తనకు పదోన్నతి లభించడం ఆకస్మిక పరిణామం కాదని, పార్టీ సీనియర్లు అన్ని విధానాల ఆలోచించి,సంప్రదింపులు జరిపి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించాలని తనను కోరారని. స్టాలిన్ వివరించారు. విశ్రాంతికే విశ్రాంతి ఇచ్చిన నాయకుడు కరుణానిధి, అని, ఇప్పుడాయన బాగా విశ్రాంతి తీసుకొని త్వరగా కోలుకోవాలని స్టాలిన్ ఆకాంక్షించారు. కేంద్ర మాజీమంత్రులు టీఆర్ బాలూ, ఎ.రాజా, రాష్ట్ర మాజీ మంత్రులు సహా ఐ.పెరియస్వామి, ఈయూ వేలూ, కె.పొన్ముడి, కేఎన్ నెహ్రూ, టీఎం అంబాసారన్, ఎమ్మెల్యేలు, సీనియర్లు అల్‌వార్‌పేట్‌లోని స్టాలిన్ ఇంటికి వెళ్లి పదోన్నతి పొందినందుకుగానూ శుభాకాంక్షలు తెలిపారు.య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్టాలిన్ ఎన్నిక కావడంతో ఆయన సన్నిహితులు, డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగున్ ఆనందభాష్పాలు రాల్చారు. స్టాలిన్‌ని పొగడ్తలతో ముంచెత్తారు. 'తంబి వా తలైమై ఎర్కావా' (తమ్ముడు ... వచ్చి పార్టీనాయకత్వం చేపట్టు) అన్న డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై మాటలను ఆయన వల్లెవేశారు. స్టాలిన్ వర్గీయుల్లో ఆనందం వెల్లివిరిసింది. మిఠాయిలు, బాణాసంచా పేలుళ్లతో సంబరాలు జరుపుకున్నారు.

## నోట్లరద్దుపై ఎవరికీ స్పష్టత లేదు

- నల్లధనం బయటకు రాలేదు
- వస్తే మంచిదే
- ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



**రాజధాని ప్రతినిధి–విజయవాడ :** దేశంలో కరెన్సీని రద్దు చేసే విషయంలో అటు ప్రధానికి, ఇటు ఆర్థిక శాఖ మంత్రికి, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. నోట్ల రద్దు ప్రభావం ఆర్థికాభివృద్ధిపై పడిన మాట వాస్తవమేనని, ఐతే, రెండు శాతం ఉండక పోవచ్చన్నారు. స్వరాజ్య మైదానంలో జరుగుతున్న 20వ పుస్తక మహోత్సవంలో భాగంగా పరుచూరి నరసింహారావు ప్రాంగణంలో 'సమాలోచన' వేదిక పైన " ప్రస్తుత పరిస్థితులలో ఆర్బీఐ' పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుతం రూ.14 లక్షల కోట్ల కరెన్సీ బ్యాంకులకు చేరిందని, దీని ప్రకారం, అసలు నల్లధనం వెలుగులోకి రాలేదన్నారు. నిజంగా నల్లధనం బయటకు వస్తే డీమోనటైజేషన్ వలన మంచి ఫలితాలు ఉంటాయన్నారు. నోట్లరద్దు విజయవంతమైదా లేక విఫలమైందా అనేది ఫిబ్రవరి నెలలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో తేలుస్తుందన్నారు. వాటి ఫలితాలు రావటానికి మాత్రం రెండు, మూడు సంవత్సరాలు మాత్రం పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక నగదు రహిత లావాదేవీల కోసం పేటీఎం, యూబీఎస్, స్నాప్‌డీల్ వంటి కార్పొరేట్ సంస్థలపై ఆధారపడటం మంచిది కాదన్నారు. ఆయా సంస్థలకు డిపాజిట్ చేసిన డబ్బుకు భద్రత ఎంతమేరకు ఉంటుందో గమనించాలన్నారు. నోట్ల రద్దు విషయంలో రహస్యం అవసరమన్నారు. ముందుగానే ఏటీఎంల్లో డబ్బుని నింపితే... నల్లకుభేరులు అప్రమత్తమయ్యే అవకాశం ఉందన్నారు. దేశంలో డబ్బును వివిధ ప్రాంతాలకు తరలించటానికి 4,300 ఔట్‌లెట్‌లు పనిచేస్తుంటాయని తెలిపారు. బ్లాక్ మనీ వైట్‌లోకి మారటం వలన దేశానికి రూ.50 వేల కోట్లు టాక్స్ రూపంలో సమకూరుతుందన్నారు. బంగారం కొనటం డెడ్ క్యాపిటల్‌గా అభివర్ణించారు. వాటి కంటే బ్యాంకులో డబ్బును దాచుకోవటం సరైన విధానమన్నారు. రానున్న కాలంలో డిజిటల్ లావాదేవీలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్లాక్ మనీ పెరగటం వలన జైలు కెళ్లతాను అనే భయం ఉండాలని, అపుడే జీవితం హాయిగా గడపటానికి అవకాశం ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ బోర్డు డిప్యూటీ ఛైర్మన్ సీ. కుటుంబరావు మాట్లాడుతూ గతంలో బ్యాంకులో లోను తీర్చినా సర్‌ఛార్జ్‌లుండేవని వాటిని సుబ్బారావు గవర్నర్ గా వచ్చిన తరువాత వాటిని తీసివేసినట్లు తెలిపారు. డీమోనటైజేషన్ వలన భవిష్యత్తులో అనేక లాభాలు ఉంటాయని ఎవరూ అనుకోవడం లేదన్నారు. తమిళనాడులో 9 వేల బ్యాంకులో రూ.18000 వేల కోట్ల కేటాయిస్తే... కేవలం 900 ప్రైవేట్ బ్యాంకులకు రూ.10వేల కోట్ల విలువ చేసే నోట్లను పంపిణీ చేవారని, మిగిలిన రూ.8000 కోట్లను ప్రభుత్వ బ్యాంకులకు కొత్త నోట్లు సర్దుబాట్లు చేసినట్లు తెలిపారు. సీనియర్ పాత్రికేయులు తుమ్మలకిషోర్ మాట్లాడుతూ ఆర్బీఐ దేశ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచి అన్నారు. కేంద్రం ద్రవోల్బణంను నిర్ణయిస్తుంది. వాటిని ఆర్బీఐ తగ్గించటానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. 2008లో సుబ్బారావు వెళ్లినట్లు తెలిపారు. ఆర్బీఐ స్వయంప్రత్తితో పనిచేయాల్సి ఉంటుందన్నారు. హిందూదినపత్రిక పూర్వ సంపాదకులు డీమోనటైజేషన్ వలన సామాన్యులు ఏటెం వద్ద అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు అని గుర్తు చేసారు. ఏటీఎం అంటే అదానీ, టాటా, మోడీ అనే నిర్ణయానికి ప్రజలు వచ్చినట్లు పేర్కొన్నారు. రూ.15.44 లక్షల కోట్లు తిరిగి వచ్చినాయని మిగిలిన డబ్బు ఎక్కడికి వెళ్లిందో తెలియడం లేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ పాత్రికేయులు జి.వల్లేశ్వర్ మాట్లాడుతూ చాలా దేశాలలో 2008లో ఆర్థిక సంక్షోభం వచ్చినా భారత దేశంలో రాలేదన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో విష్ణు మాట్లాడుతూ పుస్తక మహోత్సవాలలో వివిధ అంశాలపై సమాలోచన అనే విదికను ఏర్పాటు చేసి వివిధ అంశాలపై సమాలోచన అనే విదికను ఏర్పాటు చేసి వివిధ రంగాలలో నిష్టాతులను పిలిచి వారి ఆలోచనలను మనతో పంచుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెస్టివల్ నాయకులు అశోక్, బాబ్జీ, శ్రీనివాస్, నగరంలోని వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆర్బీఐ మాజీ గవర్నర్ దువూరి సుబ్బారావు సమాధానాలిచ్చారు.

# పబ్లిక్ న్యూసెన్స్‌తో తలదించుకునేలా చేస్తున్నారు..



శతాబ్దాల కాలం నుంచి సంస్కృతి సంప్రదాయం గల రాష్ట్రం మనది. ఇక్కడ జరుపుకునే ప్రతి పండుగకి ఒక ధ్యేయం, ప్రజా క్షేమం ఉంటాయి. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే కొత్త సంవత్సరం పేరిట ప్రభుత్వం అల్లరి మూకలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రభుత్వ తీరు ఆక్షేపణీయంగా ఉంది. నిజానికి క్రైస్తవులంతా నూతన ఏడాదిని భక్తిభావంతో చర్చిల్లో జరుపుకోవాలనుకుంటారు. క్రైస్తవేతరులు కూడా హాజరవుతారు. అయితే చాలా మంది హిందూ గుడులకు, లేదంటే పూజల్లో ఉంటారనుకుంటారు. లేదంటే తల్లిదండ్రులు తమ పిల్లలను కొత్త ఏడాది నుంచి కొత్త తీర్మానాలు చేసుకొని బాగా చదువుకోవాలని కోరుతూ వాటిని అమలు చేయమంటారు. అలా ఎవరి ఇంట్లో వారు పండుగలు చేసుకోవడం ఇక్కడి ఆచారం. దానిని అతిక్రమిస్తూ ప్రభుత్వమే అన్ని పండుగలూ చేస్తూ, యువతరం బలహీనతలతో ఆడుకోవడం సరైన చర్యకాదు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ నూతన సంవత్సర వేడుకలు జరపాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏముంది ?

సిటీ పోలీస్ కమిషనర్ డీ గౌతం సవాంగ్ ఏడాది చివరి రోజు పత్రికలతో మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో అమ్మాయిల నృత్యాలు, చట్టవిరుద్ధ కార్యక్రమాలు జరపటానికి వీలులేదని ఆదేశిస్తూ ప్రజలెవరికీ ఇబ్బంది కలుగని రీతిలో నూతన ఏడాది ఉత్సవాలను జరుపుకోవాలని పురజనులను కోరారు. మద్యం దుకాణాలు సమయాన్ని మించి తెరిచి ఉంచకూడదని, నూతన సంవత్సరానికి సంబంధించి ఏదైనా కార్యక్రమాన్ని జరుపుకోవాలంటే ఖచ్చింతంగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఇంతే కాకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇప్పటికే 294 మందికి జైలు శిక్ష పడిందని, 2,769 మందికి అపరాధ రుసుం చెల్లించవలసి వచ్చిందన్నారు. తాగి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని కూడా తెలిపారు. అయితే తెల్లారే సరికి నిబంధనలన్నీ సడలించారు. ఎన్నడూలేని విధంగా బందరు రోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం బయట స్టేజి నిర్మించారు. డిసెంబరు 31 సాయంత్రం నుంచి నగర పోలీసులు వాహనదారులకు నరకం చూపారు. ఆరుబయట యువతలంతా నృత్యాలు చేయడంతో అల్లరి మూకలు చేరాయి. పోలీసులు చేష్టలుడిగి చూస్తుండటం తప్ప ఏమీ చేయలేకపోయారు. ఇంకా చెప్పాలంటే వారు కూడా ఆ ఆటపాటలను చూస్తూ మైమరచి పోయారు. ఆడవారు, పిల్లలు రోడ్డు మీదకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఆరోజంతా నగరంలో బార్లన్నీ బార్లాగా తెరిచారు. బళ్లేసుకొని యువకులంతా తాగి తందనాలాడి ఎవరిని ఏమి చేస్తున్నారో తెలియ లేదు. ఒకటే కేకలు, అరుపులు. సైలెన్సర్లు పీకి, బైక్ స్టాండులను రోడ్లను తాకుతూ స్పీడుగా వెళుతుంటే నిప్పులు రేగుతూ ఒకటే కోలాహలం. దీంతో చర్చిలకు వెళ్లేవారికి, అక్కడి నుంచి వచ్చేవారికి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఆకతాయిలకు అనుగుణంగా, పట్టణవాసులకు వ్యతిరేకంగా పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ ఆఫీసు వద్ద కూడా యువకులు ఏమాత్రం తగ్గలేదు. అంతా రచ్చరచ్చ చేశారు. అడిగే నాధుడే లేకుండా పోయారు. ఇంతకుముందెన్నడూ ఇలా జరగలేదు. ఎక్కడా ఇద్దరు ముగ్గురు






కన్పించినా పోలీసులు చర్యలు చేపట్టేవారు. చెప్పాలంటే విజయవాడను ఆకతాయిలవాడగా, తాగుబోతులతో నింపేశారు. పెద్దనోట్ల రద్దు తర్వాత ఎక్సైజ్ రెవెన్యూ తగ్గడంతో ప్రభుత్వం ఈ విధమైన చర్యలు తీసుకోవడం ఏహ్య భావాన్ని కలిగించింది. తెల్లవారి ఆదివారం కావడం ఇంకా చెప్పాలంటే మొదటి ఆదివారం కాబట్టి హ్యాపీ సండే కావడంతో నగరవాసులు ఉదయం 9 గంటల వరకు ఇబ్బందులు పాలయ్యారు.

**యువతలో క్రమశిక్షణ పెంపొందించాలి**

రోడ్లపై ఈ వెంట్స్ నిర్వహించడమేంటి ? నెల్లో రెండు ఆదివారాలు పిల్లలకు పెద్దలకు ఆటలు నిర్వహిస్తే ఒలంపిక్స్‌లో మెడల్స్ వచ్చేస్తాయా ? ఉన్న ఆటస్థలాలను మాల్స్‌కోసం విదేశీయులకు అప్పజెప్పి రోడ్లను ఆక్రమిస్తే ఆరోజు దూర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో వచ్చేవారు రోడ్లు తెలియక ఎంత తికమక పడతారన్న ఆలోచన కూడా లేకుండా ఈ పద్ధతులు ఏమిటి ? కార్ల టాపులేపి నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ, అమ్మాయిలు, అబ్బాయిలు వీరంగం సృష్టించారు. దీంతో మధ్య తరగతి వర్గం, మధ్య వయస్కులు ముక్కుమీద వేలేసుకున్నారు. కనిగిరిలో ఎమ్మెల్యే బాబూరావు తాగితందనాలాడుతూ అమ్మాయిలతో లుంగీ డ్యాన్సు వేయడం రాష్ట్ర నేతల క్రమశిక్షణకు పరాకాష్టగా నిలుస్తోంది. విజయవాడలో ఒకప్పుడు ఫ్యాక్షనిజం ఉండేదేమోకాని, ఎప్పుడూ ఆకతాయితనం, ఈవ్ టీజింగ్ లేదు. విదేశీ మోహంతో మన పయనం ఎటువైపో చూసుకునే సమయం ఆసన్నమైంది. సింగపూర్, మలేషియా తళుకుబెళులకులు కాదు... భారతీయతకు ప్రతిరూపమైన క్రమశిక్షణ, నిడారంబరత, నిజాయితీ, నిబద్ధత ఈ నాటి యువతలో పెంపొందించుకునే చర్యలు చేపట్టాలని, భారతీయతను భ్రష్టు పట్టించకండి సామాజికవేత్తలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

– బోస్

# మానవహక్కుల కోసం కృషిచేస్తా : గుటరెస్



గుటరెస్

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో శాంతి, సౌహార్ధాలు వెల్లి విరియాలన్న ఆకాంక్షతో నెలకొల్పిందే ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. ప్రపంచ దేశాల్లో యుద్ధోన్మాదాన్ని తగ్గించి సర్వమానవ సౌభాతృత్వాల కోసం పాటు పడటం దాని లక్ష్యంతో 1946 డిసెంబరు 7, యునైటెడ్ నేషన్స్ (ఐక్యరాజ్యసమితి)ను ప్రారంభించారు. ఉగ్రవాదం ప్రపంచానికి పెనుసవాలుగా మారిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ప్రాధాన్యత మరింత పెరిగింది. అయితే అనుకున్నంత క్రియాశీలకంగా ఐక్యరాజ్య సమితి పనిచేయడంలేదన్నది జగమెరిగిన సత్యం. ఐక్యరాజ్యసమితి కార్యకలాపాలన్నీ అగ్రదేశం కనుసన్నల్లో జరగడం, అగ్రదేశాల యుద్ధోన్మాదానికి మధ్యఆసియా బలైవడంతో ఐసీస్‌లాంటి ఉగ్రసంస్థలు పుట్టుకొచ్చి ప్రపంచశాంతికి ఆశనిపాతంగా తయారైంది.

ఈ నేపథ్యంలోపోర్చుగల్‌కు చెందిన ఆంటోనియో గుటెరేస్ (67)ఆదివారం నాడు ఐక్యరాజ్య సమితి నూతన కార్యదర్శిగా పదవీబాధ్యతలు చేపట్టనున్నారు. పోర్చుగీసు మాజీ ప్రధానిగా పనిచేసిన గుటరేస్ 9వ ప్రధాన కార్యదర్శి. అంతకుముందు శరణార్థుల విభాగంలో ఐక్యరాజ్యసమితి హైకమిషనర్‌గా పనిచేశారు. నూతన ఏడాది బాధ్యతలు చేపట్టిన అనంతరం 193 మంది ఉన్న సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ వికేంద్రీకరణ, సాధికారిక అభివృద్ధి, ప్రపంచ శాంతి, మానవహక్కుల కోసం గుటరేస్ కృషిచేస్తామన్నారు. అంతర్జాతీయంగా అత్యంత త్రీవ్రమైన సమస్యలను పరిష్కరించడానికి బహువిధ మార్గాలను అనుసరించేందుకు ఐక్యరాజ్యసమితి కీలకమైందన్నారు. ఐక్యరాజ్యసమితి నిరంకుశ ప్రభుత్వ యంత్రాంగానికి ప్రతీకగా ఉందన్న అపప్రదను తొలగించేందుకు కృషిచేస్తానని గుటెరస్ వాగ్దానం చేశారు. వాతావరణ కాలుష్యం, యుద్ధవాతావరణంతో ప్రపంచదేశాలు అల్లకల్లోలంగా ఉన్న సమయంలో పదవీబాధ్యతలు తీసుకున్న గుటరెస్ ఏమేరకు తన లక్ష్యాలను చేరుకుంటారో వేచి చూడాల్సిందే...

**బాన్‌కీ మూన్ వీడ్కోలు**

**దేశప్రజలకు సేవచేయండి**
**ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి**
**సహజవనరులను పరిమితంగా వాడుకొండి**

మీపై విమర్శలు చేసిన వారిని హింసపెట్టి జైలులోవేయకండి అనే నినాదాలతో పనిచేసిన ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాని కార్యదర్శి బాన్‌కీమూన్ (71)డిసెంబరు 31న వీడ్కోలు విందు ఇచ్చారు. పదేళ్లపాటు ఈ పదవిలో



కొనసాగిన బాన్ తన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి తన కార్యకలాపాల్లో అలక్ష్యం చూపకూడదన్నారు. యూఎన్ అధికారులు, సిబ్బంది, రాయబారులు విందులో పాల్గొన్నారు. శనివారం నాడు న్యూయార్క్ స్క్వేర్‌లో జరిగే నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొంటానన్నారు. కొత్త ఏడాదిలోకి పాల్గొనే ముందు 60 సెకన్ల బటన్‌ను ఆయన ప్రారంభించారు. ప్రపంచ ప్రజలంతా స్థిరమైన అభివృద్ధిని సాధించేందకు కృషిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కోట్లాది మంది నేను ఉపాధిని కోల్పోవడం గమనిస్తున్నారని ఆయన చమత్కరిస్తూ, తెల్లవారేసరికి అన్నీ మారిపోతాయన్నారు. 2007 జనవరి 1న ఆయన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టగా, శనివారంతో పదవీకాలం ముగిసింది. సౌత్‌కొరియాకు చెందిన బాన్‌కీమూన్ రెండు పర్యాయాలు పూర్తి స్థాయి ప్రధాని కార్యదర్శిగా పనిచేశారు. వాతావరణ మార్పులు, పేదరికం, పేద–ధనిక వ్యత్యాసంలను



రూపుమాపటానికి ప్రయత్నించారు. ప్రపంచదేశాల్లో కమ్ముకుంటున్న కాలుష్యాన్ని అతిక్రమించేందుకు పారీస్ ఒప్పందాన్ని అమలు చేయాలని ఆయన గట్టిగా కోరుతున్నారు. సిరియా, యెమెన్, దక్షిణ సూడాన్, లిబాయాల్లోని యుద్ధాలపై ఆయన ప్రభావం అంతగా కనిపించలేదు. విరమణ అనంతరం దక్షిణకొరియా పార్లమెంటు ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తారన్న ఊహాగానాలు చెలరేగుతున్నాయి. అందుకు తగ్గట్టుగా ఈ ఏడు జరగనున్న ఎన్నికల్లో సంస్కరణలు తీసుకురావడానికి ఆయన మద్దతు తెలిపారు. దీంతో చిన్న పార్టీలు కూడా తమ ప్రతినిధులను పార్లమెంటుకు పంపగలుగుతాయని, ఆ ప్రతినిధులు తమకు ఎన్నుకున్న ప్రజల అభిప్రాయాలను ప్రతిభింబిస్తాయన్నారు. దశాబ్ధి క్రితం బాన్‌కీమూన్ దక్షిణకొరియా విదేశాంగ మంత్రిగా పనిచేశారు.

– ఖాన్

## ఎయిర్ ఇండియా ఆఫర్

**న్యూఢిల్లీ :** ఎయిరిండియా ఒక్కసారిగా విమానటికెట్ల ధరలను తగ్గించింది. రిపబ్లిక్ డే ఆఫర్ కింద ఏకంగా రైలు టికెట్ల ధరలకే విమానటికెట్లను అందిస్తామని ఊరిస్తోంది. రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ టూటైర్ టికెట్ల ధరలకు స్వదేశీ రూట్లలో ఎకానమీ క్లాస్ టికెట్లు ఇవ్వబోతోంది. ఈ ఆఫర్ కింద జనవరి 26 నుంచి ఏప్రిల్ 30 వరకు టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. అలాగే, ప్రయాణానికి కనీసం 20 రోజుల ముందుగా టికెట్లు బుక్ చేసుకోవాలి. ఇందులో అత్యల్పంగా ఢిల్లీ–జమ్మూ మార్గంలో రూ. 1610కే టికెట్ అందుబాటులో ఉంది ఢిల్లీ– ముంబై మార్గంలో రూ. 2401, ఢిల్లీ– బెంగళూరు మార్గంలో రూ. 2952, ఢిల్లీ –చెన్నై మార్గంలో రూ.3100 చొప్పున టికెట్ల ధరలను నిర్ణయించారు. పరిమితంగానే సీట్లున్నాయని, అందువల్ల ముందు వచ్చినవారికి ముందు ప్రాతిపదికన వాటిని కేటాయిస్తామని మాత్రం తెలిపింది. రైలు టికెట్ ధరతోనే, అంతకంటే తక్కువ సమయంలో గమ్యస్థానాలు చేరుకోవచ్చని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ప్రత్యర్థి విమానయాన సంస్థలు గో ఎయిర్, ఎండిగో, ఎయిర్ ఏషియా, జెట్ ఎయిర్‌వేస్ లాంటివి ఇప్పటికే ఆఫర్లతో వెల్లువెత్తిస్తున్నాయి.

## నడిరోడ్డుపై కీచక పర్వం

**బెంగుళూరు :** బెంగుళూరు నగరం కీచకుల కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వేలమంది పోలీసుల సమక్షంలో రక్షణ లేకుండా పోయింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరం నడిబొడ్డున మహిళలపై జరిగిన ఘటనకు దేశవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగానే, అదే రోజు జరిగిన మరో దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. స్కూటర్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఒక మహిళపై దాడి చేశారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో నమోదైంది. వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు ఇంటికి దగ్గరలోనే ఉన్న ఆమెను పలకరిస్తూ వేగంగా యూటర్న్ తీసుకున్నారు. ఇంతలో ఒకడు దూకి ఆమెను పట్టుకొని ఈడ్చుకుంటూ ద్విచక్రవాహనం దగ్గరికి తీసుకెళ్లారు. దీంతో బాధితురాలు వారి నుంచి విడిపించుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించింది. ఈ తరుణంలోనే ఇద్దరిలో ఒకరిని చెంపదెబ్బవేయడంతో ఆమెను రోడ్డుపై నెట్టేసి పలాయనం చిత్తగించారు. ఈ పెనుగులాటలో బాధితురాలికి సాయం చేయడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. జనవరి 1, రాత్రి2.30 కి ఈ దారుణం సీసీటీవీలో రికార్డయ్యింది. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అయితే ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని బెంగుళూరు పోలీస్ కమిషనర్ ప్రవీణ్ సూద్ తెలిపారు. బెంగుళూరు ఎంజీ రోడ్,బ్రిగేడ్ రోడ్లపై 1,500 మంది పోలీసుల సమక్షంలోనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం దేశప్రజలను దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. ఈ ఘటనలకు కారణం యువతుల పాశ్చాత్య దుస్తులు ధరించడమేనన్న రాష్ట్ర హోంమంత్రి వ్యాఖ్యలకు జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ లలిత కుమారమంగళ మండిపడ్డారు. తక్షణమే మంత్రి రాజీనామా చేయాలని ఆమె డిమాండు చేశారు.






## మంత్రి వర్గంలో ముస్లింలకు చోటు కల్పించాలి

ఖలీలుద్దీన్



**రాజధాని ప్రతినిధి–గుంటూరు :** రాష్ట్ర మంత్రి వర్గంలో ముస్లింలకకు చోటు కల్పించాలని తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ ఖలీలుద్దీన్ కోరారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ముస్లింలు లేకపోవడంతో ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ఇంతకుముందెన్నడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైన తగిన రీతిలో స్పందించి,రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో మైనార్టీ నాయకులకు చోటు కల్పించాలని ఆయన కోరారు.


**మైనార్టీ సంక్షేమ పథకాలు గురించి విస్త్రతంగా ప్రచారం చేయాలి**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మైనార్టీ సంక్షేమ పథకాల గురించి విస్త్రతంగా ప్రచారం చేయాలని, కొంత మంది అధికారుల తీరు వల్ల ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియడం లేదని ఖలీలుద్దీన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో మంచి ఉద్దేశంతో ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నా అధికారుల అలసత్వం వల్ల అవి అమలుకు నోచు కోవడం లేదన్నారు. అర్హులైన వారికి అందడం లేదని అన్నారు. దుకాణ్ అవుర్ మకాన్, దుల్హన్ పథకం, ముస్లిం పేద విధ్యార్థులకు ఉపకారవేతనాలు వంటి పథకాలు గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని మహమ్మద్ ఖలీలుద్దీన్ అన్నారు.











## ఐటీ .. వెరీ పిటీ

- హెచ్ – 1బి వీసా ఎఫెక్ట్
- వేల కోట్లు నష్టం




**ముంబై :** హెచ్1–బి వీసా ప్రోగ్రామ్‌లో మార్పులు చేస్తూ రూపొందించిన బిల్లును అమెరికా కాంగ్రెస్‌లో కుదేలయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, విప్రో,టెక్ మహీంద్రా, మైండ్ ట్రీ, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎంఫసిస్ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడిని గురయ్యాయి.బీఎస్ఈ ట్రేడింగ్‌లో ఐటీ రంగ షేర్లు 2.5 శాతం పడిపోయాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 3.5 శాతం, ఇన్ఫోసిస్ 2.5 శాతం, టీసీఎస్ 2శాతం, విప్రో 2శాతంమేర దిగజారాయి. నష్టాలు చవిచూసిన ఈ కంపెనీల మార్కెట్ విలువ మొత్తం రూ.22వేల కోట్లు అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. హెచ్ –1 బి వీసా దేర్వినియోగానికి తాజా బిల్లు అడ్డుకట్ట వేస్తుందంటూ రిపబ్లికన్ నేతలు డారెల్ ఇసా, స్కాట్ పీటర్స్ ఈ బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. తక్కువ వేతనాలకే విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవడం ద్వారా అమెరికన్లకు ఉపాధిని దూరం చేస్తున్న సంస్థలపై చర్యలకు దోమదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. హెచ్–1 బి వీసాకు కనీస వేతనాన్ని రూ. 67 లక్షలకు (ఏడాదికి) పెంచడం, మాస్టర్స్ డిగ్రీ విషయంలో ఇస్తున్న మినహాయింపులను తొలగించడం వంటి మార్పులను ఈ బిల్లులో ప్రతిపాదించారు.











Editor : Pattan Hussain Khan, Printed and Published by him on behalf of Vastitude media pvt ltd. Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP. 522237. Printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18